Crime News
ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం, మార్చి 06, 2025 | సంపుటి - 20 | సంచిక 155 | వెల - 4రూ | పేజీలు - 12
Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

# వచ్చే నెల నుంచి భారత్‌పై సుంకాలు విధింపు

**కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో ట్రంప్ ప్రకటన**



వాషింగ్టన్ : వచ్చే నెల నుంచి భారత్‌పై సుంకాలు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. తాజాగా ట్రంప్ కాంగ్రెస్ సంయుక్త సెషన్‌లో ప్రసంగించారు. దాదాపు గంట 40 నిమిషాల పాటు ట్రంప్ ప్రసంగించారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ సెషన్‌లో ప్రసంగించడం ఇదే తొలిసారి. ఈ సెషన్‌లో భారత్, చైనా, కెనడా దేశాలపై సుంకాలు విధించనున్నట్లు స్పష్టం చేశారు. భారత్, చైనా సహా పలు దేశాలపై ఏప్రిల్ 2 నుంచి అమలులోకి రానున్నట్లు ట్రంప్ ప్రకటించారు. కొన్ని దశాబ్దాలుగా అమెరికాపై కొన్ని దేశాలు అధిక సుంకాలు విధిస్తున్నాయి.

మిగతా 2లో

# అంతర్గత విషయాలు బయట చర్చిస్తే ఖబడ్దార్

## నటనలు మాని... పార్టీకోసం నిజంగానే పనిచేయండి

## కాంగ్రెస్ శ్రేణులకు మీనాక్షి నటరాజన్ హెచ్చరిక



హైదరాబాద్ :

పార్టీ అంతర్గత విషయాలపై బయట చర్చ పెట్టొద్దని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూచించారు. అంతర్గత విషయాలపై బయట చర్చ పెట్టిన వారిపై చర్యలు తప్పవని అన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ అనుబంధ సంఘాల సమావేశంలో ఆమె మాట్లాడారు. నివేదికలు ఇవ్వకపోయినా వారి పనితీరు ఏంటనేది తమకు తెలుస్తుందని అన్నారు. పార్టీ కోసం పనిచేస్తున్నది ఎవరు..? పనిచేసినట్టు యాక్టింగ్ చేస్తున్నది ఎవరనేది కూడా తెలుస్తుందంటూ చురకలు అంటించారు. పార్టీ కోసం సమయం ఇవ్వండి.. పార్టీ అంతర్గత విషయాలు బయట చర్చ చేయకండి.. అలాంటి వారిపై చర్యలు తప్పవు అని హెచ్చరించారు. తన పని తీరు నచ్చకపోయినా.. రాహుల్, సోనియాకు ఫిర్యాదు చేయొచ్చు అన్నారు. ఐదు రోజుల క్రితం మధ్య ప్రదేశ్ నుంచి రైలులో హైదరాబాద్‌కు వచ్చిన మీనాక్షి నటరాజన్..

మిగతా 2లో



# టన్నెల్ ప్రమాదం దురదృష్టకరం

**చురుకుగా సహాయక చర్యలు**

**కార్పోరేట్ కాలేజీలకు దీటుగా జూనియర్ కాలేజీలు**

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి**

నల్లగొండ : నల్లగొండ వరప్రదాయిని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలడం చాలా దురదృష్ట కరమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ పూర్తి అయితే నల్గొండ నియోజకవర్గం పూర్తిగా సస్యశ్యామల మవుతుందన్నారు. టన్నెల్ వద్ద సహాయక పనులు చురుకుగా సాగుతున్నాయని, బిఆర్ఎస్ అర్థం లేని విమర్శలను పట్టించుకోబోమని అన్నారు. కార్పొరేట్ కాలేజీలకు ధీటుగా రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కనగల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని మంత్రి కోమటిరెడ్డి ప్రారంభించారు.

మిగతా 2లో

# నేను ఆత్మహత్య చేసుకోలేదు

**అధికమొత్తంలో నిద్రమాత్రలు వాడా**

**పోలీసులకు వాంజ్మూలం ఇచ్చిన గాయని కల్పన**



హైదరాబాద్ : తాను ఆత్మ హత్యాయత్నానికి పాల్ప డలేదని, తన కుమార్తె విషయంలో చోటుచేసుకున్న మనస్పర్థల వల్ల నిద్ర పట్టక అధిక మొత్తంలో నిద్ర మాత్రలు వేసుకోవడం వల్ల అపస్మారక స్థితిలోకి వెళ్లినట్టు గాయని కల్పన తెలిపారు. ఈ విషయానికి సంబంధించి కేపీ హెచ్‌బీ పోలీసులు ప్రెస్‌నోట్ విడుదల చేశారు. 'కల్పన గత 5 సంవత్సరాల నుంచి భర్తతో కలిసి హైదరాబాద్‌లోని విల్లాలో నివాసం ఉంటున్నారు. వారి కుమార్తె దయ ప్రసాద్‌కి కల్పనకు మధ్య చదువు

2లో



# 15 నెలల్లోనే రూ. 1.65 లక్షల కోట్ల అప్పు

**నాడు అప్పులు చేసి ప్రజల కష్టాలు తీర్చితే..**

**నేడు అప్పులు చేసి జేబులు నింపుకుంటున్న సీఎం రేవంత్**

**మాజీ మంత్రి కేటీఆర్**

హైదరాబాద్ : నాడు బీఆర్ఎస్ చేసిన అప్పులపై ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీ.. నేడు 15 నెలలకాలంలోనే రూ. 1.65 లక్షల కోట్లు అప్పులు చేశారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. నాడు అప్పు చేసి 70 లక్షల అన్నదాతలకు అండగా నిలిచి వారికి రైతుబంధు కింద రూ.73 వేల కోట్లు ఖాతాల్లోకి వేసి.. రూ.28 వేల కోట్లు రుణమాఫీ చేసి.. రూ.6 వేల కోట్లతో రైతుబీమా చేసి.. లక్ష 11 వేల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందేలా చేసి.. వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు.. పారిశ్రామిక, గృహావసరాలకు 24 కరెంటు అందించి..

2

# నాడు అడ్డుకొని.. నేడు ఫొటోలకు ఫోజులు

**కాంగ్రెస్‌కు చేతకాని తనంతో రైతులకు నీటి కష్టాలు**

**కృష్ణా జలాలను కాపాడుకోలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం**

**మాజీ మంత్రి హరీశ్‌రావు**



హైదరాబాద్ : కేసీఆర్ కృషి ఫలితం.. సీతారామా ప్రాజెక్టు, నెర్రెలు బాసిన సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తెలిపారు. నాడు సీతారామ ప్రాజెక్టును వ్యతిరేకించిన కాంగ్రెస్.. అప్పట్లో అనుమతులు రాకుండా కోర్టుల్లో కేసులు వేశారని అన్నారు. కానీ నేడు కాంగ్రెస్ మంత్రులు, నాయకులు మాత్రం గోదావరి జలాల వద్ద ఫొటోలకు ఫోజులిస్తున్నారని విమర్శించారు. తిట్టడం తప్ప.. కట్టడం రాని కాంగ్రెస్‌కు, కేసీఆర్ గొప్పతనం ఇప్పటికైనా అర్థం కావాలని అన్నారు. ఈ ప్రాజెక్టుతో ఒక్క ఎకరాకు నీరు రాదు అన్నోళ్ళు, ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కృష్ణా జలాల్లో తెలంగాణ నీటి హక్కులను కాపాడలేని

2లో



# తప్పులను ప్రశ్నించినందుకే సస్పెండ్ చేశారు

**బీసీల రాజ్యాధికారం కోసం పోరాటం**

**రేవంత్ ఒత్తిడితోనే సస్పెండ్ చేశారు**

**బెదిరింపులకు భయపడేది లేదు : తీన్మార్‌మల్లన్న**

హైదరాబాద్ : ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నించినందుకే పార్టీ నుంచి నన్ను సస్పెండ్ చేశారని తీన్మార్ మల్లన్న తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... తనను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయించి రేవంత్ రెడ్డి చాలా పెద్ద పొరపాటు చేశారని అన్నారు. బీసీలకు రాజ్యాధికారం ఎందుకు రాదో.. చూస్తామన్నారు. "నన్ను సస్పెండ్ చేస్తే.. బీసీ ఉద్యమం ఆగిపోతుందన్న భ్రమలోంచి రేవంత్ బయటకు రావాలి. నాలాంటి వాళ్ళు పక్కన ఉండొద్దని సీఎం రేవంత్ రెడ్డి కోరుకుంటున్నారు. ఈడబ్ల్యూఎస్ కోటాకు ఇబ్బంది ఉండకూడదన్న ఉద్దేశంతోనే కుల గణనను తప్పుగా చూపారు.

2లో

# రెచ్చిపోతున్న సైబర్‌నేరగాళ్లు

**ఎమ్మెల్యే వేముల వీరేశంకు న్యూడ్ వీడియో కాల్**

**డబ్బులు ఇవ్వాలని డిమాండ్.. పోలీసులకు ఫిర్యాదు**

హైదరాబాద్ : రాష్ట్రంలో సైబర్ నేరగాళ్లు మరోసారి రెచ్చిపోయారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశంను టార్గెట్ చేసి న్యూడ్ కాల్స్‌తో బెదిరింపులకు దిగారు. న్యూడ్ వీడియో కాల్‌ను రికార్డు చేసి ఆయన మొబైల్‌కు పంపించడమే కాకుండా..

2లో



# సీఎంను కలిసిన సీపీఐ బృందం

హైదరాబాద్ :

సీఎం రేవంత్ రెడ్డిని ఆయన స్వగృహంలో సీపీఐ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానికంగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు గురించి కొద్దిసేపు చర్చించారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్థానిక పరిస్థితుల ప్రభావం ఉంటుంది తప్పితే ఆయా పార్టీలు అలాగే రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాల విధానాలు ప్రతిబింబించవని అన్నారు. అదే సందర్భంగా కాంగ్రెస్, సీపీఐల మధ్య 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జరిగిన ఒప్పందం ప్రకారంగా సీపీఐకి రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఇవ్వాల్సి ఉన్నప్పటికి ప్రస్తుతం ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధిష్ఠానంతో మాట్లాడి సానుకూలంగానే స్పందించారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటీ నరసింహ పాల్గొన్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్ గొంతుకై మల్లన్న మాటలు



**ఎఐసీసీ అధినేతతో పోల్చుకునే స్థాయి మల్లన్నకు లేదు**

**సమయం ఇచ్చినా స్పందించలేదు**

**మంత్రి సీతక్క ఆగ్రహం**

2

## వచ్చే నెల నుంచి భారత్‌పై సుంకాలు విధింపు

యూరోపియన్ యూనియన్, చైనా బ్రెజిల్, భారత్ వంటి చాలా దేశాలు తమ నుంచి అధిక సుంకాలు వసూలు చేస్తున్నాయి. ఇది చాలా అన్యాయం అని ట్రంప్ చెప్పారు. భారత్ అమెరికాపై వంద శాతం కంటే ఎక్కువ సుంకాలు వసూలు చేస్తుంది. ఇక అమెరికా వసూలు చేసే దానికంటే చైనా రెండింతలు ఎక్కువగా సుంకాలు విధిస్తోంది. ఇప్పుడు తాను అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత తాము కూడా సుంకాలు విధించేందుకు సిద్ధమయ్యామని ట్రంప్ తెలిపారు. ఏ దేశాలు.. తమ ఉత్పత్తులపై ఎంత టారిఫ్‌లు విధిస్తాయో.. తాము కూడా అంతే సుంకాల్ని వసూలు చేస్తామని ట్రంప్ స్పష్టం చేశారు. తన దేశం ఎదుర్కొంటోన్న ద్రవ్యోల్బణ సమస్య గురించి ప్రస్తావిస్తూ.. జో బైడెన్ పాలనలోని గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. చమురు, గ్యాస్ తవ్వకాల గురించి తన ఆలోచనలు వెల్లడించారు. ఏ దేశానికీ లేనివిధంగా మన కాళ్ల కింద ద్రవరూప బంగారం (చమురు, గ్యాస్‌ను ఉద్దేశించి) ఉందని, అది ద్రవ్యోల్బణ సమస్యను తీరుస్తుందని అన్నారు. 'ద్రవ్యోల్బణ సమస్యను పారదోలడం కోసం మేం చేసే పోరాటంలో భాగంగా ఇంధన వ్యయాన్ని వేగంగా తగ్గించడంపై దృష్టిపెట్టాం. బైడెన్ పాలనలో 100కు పైగా విద్యుత్ ఎ÷-లాంట్లు మూసివేశారు. వాటిలో చాలా ఎ÷-లాంట్లను మేం ఇప్పుడు తెరవబోతున్నాం. అందుకే నేను అధికారంలోకి రాగానే జాతీయ ఇంధన అత్యవసర పరిస్థితిని విధించాను. మన కాళ్ల కింద బంగారాన్ని తోడటం ద్వారా ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని అన్నారు.

## 15 నెలల్లోనే రూ. 1.65 లక్షల కోట్ల అప్పు

కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల, సీతారామసాగర్ కట్టి 45 వేల చెరువులు కుంటలు బాగుచేసి.. 45 లక్షల మందికి పైగా ఆసరా ఫించన్లతో అండగా నిలిచి.. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, కళ్యాణలక్ష్మి, వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు, 30 మెడికల్, నర్సింగ్ కాలేజీలను ఏర్పాటుచేస్తే అప్పులు తప్పని రాద్ధాంతం చేశారని విమర్శించారు. 15 నెలల పాలనలో రూ. 1.65 లక్షల కోట్లు అప్పు చేసి.. రుణమాఫీ ఎగ్గొట్టి.. రైతుబంధు ఎగ్గొట్టి.. రైతుబీమా లేకుండా చేసి.. కరెంటుకు కోతలు వేసి.. గురుకులాలను గాలికి వదిలేసి.. కాళేశ్వరాన్ని ఎండబెట్టి.. పాలమూరు రంగారెడ్డిని పడావుపెట్టి.. శ్రీశైలం సొరంగం కుప్పకూల్చి 8 మంది ప్రాణాలు బలితీసుకున్న బాధ్యతలేని ప్రభుత్వం ఇది అని కాంగ్రెస్‌పై కేటీఆర్ మండిపడ్డారు. తట్టెడు మట్టి తీసింది లేదు.. ఒక్క పథకం అమలు చేసింది లేదు.. గల్లీలో గాలిమాటలు, ఢిల్లీకి ధనం మూటలు మోసుడు తప్ప.. 15 నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏంటి అని నిలదీశారు. నాడు అప్పులు తప్పని అడ్డగోలు అభాండాలు.. నేడు అందినకాడికి అప్పులు అని విమర్శించారు.

## ఫలించిన హరీశ్‌రావు ప్రయత్నం

### రంగనాయకసాగర్‌కు నీటి ఎత్తిపోతలు ప్రారంభం

సిద్దిపేట : సిద్దిపేట నియోజకవర్గ రైతుల పక్షాన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన ప్రయత్నం ఫలించింది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్ మీదుగా రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి తక్షణమే నీటిని ఎత్తిపోయాలని హరీశ్ రావు ఇటీవల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారు. ఆ లేఖకు స్పందన లేకపోవడంతో ఫోన్ చేసి మాట్లాడారు. రైతుల కష్టాల గురించి క్షుణ్ణంగా చర్చించారు. వెంటనే నీరు ఎత్తిపోయకుంటే 50 వేల ఎకరాల్లో పంట ఎండిపోతుందని.. రైతులంతా తీవ్రస్థాయిలో నష్టపోతారని.. క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. యాసంగి పంట చేతికొచ్చేదాకా సాగునీటిని అందుబాటులో ఉంచాలని.. గడిచిన నాలుగేళ్ల పాటు సాగునీరు అందించిన తీరును వివరించారు. కనీసం 1టీఎంసీ నీటిని ఎత్తిపోయాలని కోరారు. ఈ క్రమంలోనే ఈ రోజు ఉదయం అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి రంగనాయక సాగర్‌లోకి గోదావరి జలాలు ఎత్తిపోయడం ప్రారంభించారు. ఇదిలా ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని.. ఎందుకూ పనికిరాదని విమర్శలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వమే నేడు ఇదే కాళేశ్వరం ప్రాజెక్టులోని అంతర్భాగాలైన అన్నపూర్ణ, రంగనాయకసాగర్ రిజర్వాయర్ల ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోస్తూ పంటలకు నీరందిస్తున్నారనే చర్చ జరుగుతున్నది.

## అగ్రకులాల నాయకులు తప్పులు చేస్తే చర్యలు తీసుకోరా..?

### కాంగ్రెస్ పార్టీపై సీనియర్ నేత మధుయాష్కీ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీలో రెడ్లు, అగ్రకులాల వాళ్లు ఎలాంటి క్రమశిక్షణ ఉల్లంఘన పనులు చేసినా చర్యలు తీసుకోరు అని మధుయాష్కీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు చిన్నారెడ్డే క్రమశిక్షణ తప్పాడని ఆయన పేర్కొన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యే మేఘా రెడ్డిపై బహిరంగంగా ఆరోపణలు చేశాడు.. మరి క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడిపై క్రమశిక్షణ చర్యలు ఉండవా? అని ప్రశ్నించారు. కులగణన మీద బీసీ నాయకులతో రేవంత్ రెడ్డి మీటింగ్ పెడితే దానికి జానారెడ్డిని, కేశవరావును పిలిచారు కానీ బీసీ నాయకుడినైనా నన్ను పిలవలేదు అని కాంగ్రెస్ సీనియర్ నేత మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను ఇటీవలే సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకే పార్టీ నుంచి ఎమ్మెల్సీ మల్లన్నను సస్పెండ్ చేసినట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. పలు సభల్లో రెడ్లను తీన్మార్ మల్లన్న బహిరంగంగా విమర్శించిన నేపథ్యంలోనే ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు రాజకీయ నిపుణులు పేర్కొన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకే సస్పెండ్ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా కమిటీ సంఘం తెలిపింది.

## అమెరికాలో మరో తెలుగు విద్యార్థి బలి

### దుండగుడి కాల్పుల్లో మరణించిన ప్రవీణ్

రంగారెడ్డి : ఉన్నత చదువుల కోసం అగ్ర రాజ్యం అమెరికా వెళ్లిన మరో తెలుగు విద్యార్థి బలయ్యాడు. దుండగుడు జరిపిన కాల్పుల్లో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల కేంద్రానికి చెందిన గంప రాఘవులు-రమాదేవి దంపతులకు కొడుకు ప్రవీణ్(27), కుమార్తె ఉన్నారు. కుమారుడు ప్రవీణ్ కొంతకాలం కిందట ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. అక్కడ విస్కాన్సిన్ మిల్వాంకీలో నివాసం ఉంటున్నాడు. అక్కడే యూనివర్సిటీలో ఎంఎస్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఖర్చుల కోసం ఓ స్టార్ హోటల్‌లో పార్ట్‌టైం జాబ్ చేస్తున్నాడు. ఇదిలా ఉంటే ప్రవీణ్ నివాసం ఉండే ఇంటికి సమీపంలోని బీచ్ దగ్గర తాజాగా ఓ దుండగుడు కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో గాయపడ్డ ప్రవీణ్ అక్కడికక్కడే మరణించారు. ప్రవీణ్ మరణవార్తను అతని స్నేహితులు ఇండియాలోని కుటుంబసభ్యులకు తెలియజేశారు. దీంతో అతని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రవీణ్ మృతితో కేశంపేట మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# టన్నెల్ ప్రమాదం దురదృష్టకరం

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేంద్ర యూనివర్సిటీ సౌజన్యంతో గ్లూకోమా టెస్టింగ్ మిషన్లను నూతనంగా ఏర్పాటు చేసిన కనగల్ పీహెచ్సీలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొట్టమొదటగా కనగల్ మండల కేంద్రాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకొని మార్చి 6 నుంచి 300 మందికి గ్లూకోమ టెస్టులు చేయనున్నామని చెప్పారు. 40 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు గ్లూకోమా టెస్టులకు సహకరించాలని కోరారు. మెరుగైన వైద్యం కోసం ప్రతి నియోజకవర్గంలో మోడల్ పీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని.. తొందరలోనే ప్రతి నియోజకవర్గంలో మోడల్ పీహెచ్?సీ ఏర్పాటు చేస్తామన్నారు. కనగల్ మండల కేంద్రంలోని తిమ్మన్నగూడెం నుండి సాగర్ హైవేకు రూ. 15 కోట్లతో నిధులు మంజూరు అయ్యాయని.. అతి త్వరలో రోడ్డు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే.. గ్రామాలలో లింకు రోడ్లను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కనగల్ మండల కేంద్రంలో జూనియర్ కళాశాల మంజూరు చేశామని.. వచ్చే అకాడమికి ఇయర్ నాటికి బిల్డింగ్ పూర్తి చేసి కాలేజీ ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే.. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ హాస్టల్స్?కు నూతన బిల్డింగులను కట్టిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సమయంలో కూడా కలెక్టర్ ఇలా త్రిపాఠి నిర్విరామంగా జిల్లా మొత్తం తిరుగుతూ.. ఆయా మండలాలలోని ప్రభుత్వ హాస్పిటల్స్, ప్రభుత్వ హాస్టల్స్?ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ జిల్లాను సురక్షితంగా చూసుకుంటున్నారని.. ఇలాంటి కలెక్టర్ మన జిల్లాలో పని చేయడం అదృష్టమన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీఎంహెచ్ఓ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్ ఓ కళ్యాణ్ చక్రవర్తి, మండల పీహెచ్సీ డాక్టర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మండల ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## నాడు అడ్డుకొని.. నేడు ఫొటోలకు ఫోజులు

కాంగ్రెస్ చేతగానితనం వల్ల సాగర్ ఆయకట్టుకు కరువు వచ్చిందని హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల రోజుకు పదివేల క్యూసెక్కుల కృష్ణ జలాలను ఆంధ్ర తరలించుకుపోతున్న పరిస్థితి అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో రైతులను ఆదుకునేందుకు ఏకైక మార్గం గోదావరి జలాలను ఒడిసి పట్టి, ఎత్తిపోయడమే అని తెలిపారు. దీన్ని ముందే అంచనా వేసిన నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు రూప కల్పన చేశారని పేర్కొన్నారు. కేంద్రం కొర్రీలను, కాంగ్రెస్ పార్టీ కుట్రలను ఛేదించి వడివడిగా 90 శాతం పనులు పూర్తి చేశారని హరీశ్‌రావు తెలిపారు. ఇదే కాంగ్రెస్ నేతలు నాడు సీతారామ ప్రాజెక్టే వృథా అన్నారని.. అనుమతులు రాకుండా కోర్టుల్లో కేసులు వేయించారని చెప్పారు. కానీ కేసీఆర్ పట్టుబట్టి న్యాయపరమైన చిక్కులు తొలగించి, అత్యంత క్లిష్టమైన అటవీ పర్యావరణ అనుమతులు సాధించి సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయించారని పేర్కొన్నారు. ఆ ఫలితమే నేడు కరువు కోరల్లో చిక్కుకున్న ఖమ్మం జిల్లా రైతులకు వరంగా మారిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించి సిద్ధంగా ఉంచిన సీతారామ నుంచి గోదావరి జలాలను ఎత్తిపోస్తూ అక్కడ ఫోటోలకు మంత్రులు, నాయకులు ఫోజులు ఇస్తున్నారంటే అందుకు కేసీఆర్ ఏ కారణమని తెలి పారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల సాగు, తాగునీటి కష్టాలకు సీతారామ ఒక శాశ్వత పరిష్కార మార్గం అని హరీశ్‌రావు అన్నారు. ప్రత్యక్షంగా ఆరు లక్షల ఎనభై వేల ఎకరాలకు, పరోక్షంగా పది లక్షల ఎకరాలకు సీతారామ ద్వారా గోదావరి జలాలు అందించామని తెలిపారు. సీతారామ ద్వారా ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదని నాడు ప్రతిపక్షంలో ఉండి ఇదే కాంగ్రెస్ నాయకులు విమర్శించారని గుర్తుచేశారు. 2023 డిసెంబర్ 7న రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువుదీరిందని.. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు మీద విషం చిమ్మారని పేర్కొన్నారు. వృథా ప్రాజెక్టు అన్నారని.. ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదన్నారని.. డీపీఆర్ లేదని చెప్పారు. ఒకే ఒక్కసారి మంత్రులు బృందం పర్యటించి, 2024 ఆగస్టు15వ తేదీన మూడు పంపు హౌసులను ఏకకాలం స్విచ్ ఆన్ చేసి ప్రాజెక్టును ప్రారంభించారని తెలిపారు. కేసీఆర్ మొక్కవోని దీక్షముందు కాంగ్రెస్ నేతల ఆరోపణలు పటాపంచలు అయిపోయారని హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కష్టం, నేడు సగౌరవంగా రైతుల ముంగిట నిలబడిందని.. 60 ఏండ్ల కాంగ్రెస్, టీడీపీ పాలనకు, పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు తేడాను సుస్పష్టం చేసిందని చెప్పారు. అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే పది లక్షల ఎకరాలకు నీళ్లించే ప్రాజెక్టును ప్రారంభించారంటే దాని వెనుక బీఆర్ఎస్ ప్రభుత్వ కృషి ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ఓట్లు, సీట్లు, అధికారం శాశ్వతం కాదని, మనం చేసిన అభివృద్ధే శాశ్వతమని నమ్మే నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. అలా నమ్మి నిర్మించినవే కాళేశ్వరం, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులు అని స్పష్టం చేశారు.

## తప్పులను ప్రశ్నించినందుకే సస్పెండ్ చేశారు

90 ఏళ్ళ తర్వాత కుల గణన చేస్తే.. చపట్లు కొట్టేటోడు కూడా లేడు. కుల గణనపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చకు రెడీ. పీసీసీ అధ్యక్షుడిపై ఒత్తిడి చేసి రేవంత్ రెడ్డికి నన్ను సస్పెండ్ చేయించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తానన్న రాహుల్ గాంధీ హామీతోనే కాంగ్రెస్‌లో చేరాను. తన పక్కన వారు బానిస మాదిరి బతకాలని రేవంత్ కోరుకుంటారు. రేవంత్ చేసిన కులగణన చిత్తు కాగితంతో సమానం. సొంత మంత్రులకే ముఖ్యమంత్రి పేరు గుర్తుకు రావటం లేదు" ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. 2011లో రాహుల్ గాంధీ చేసిన పనినే తాను చేసినట్లు తెలిపారు. మన్మోహన్ తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను రాహుల్ గాంధీ చించలేదా?.. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు ఒక న్యాయం.. మల్లన్నకు ఒక న్యాయమా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం అగ్రవర్ణాలకు మాత్రమే అని వెల్లడించారు. ముఖ్యమంత్రి, మంత్రులు.. కులగణనలో నిర్లక్ష్యంగా పాల్గొన్నారని తెలిపారు. అగ్రవర్ణాలను ఎక్కువ చూపి.. బీసీలను తొక్కి పెట్టారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి.. పదే పదే తప్పులు మాట్లాడుతూ దొరికిపోతున్నారని అన్నారు. ప్లాన్ ప్రకారం కాంగ్రెస్‌ను ఖతం చేసే పనిలో సీఎం రేవంత్ ఉన్నారంటూ సంచలన కామెంట్స్ చేశారు. సీఎం రేవంత్ .. ప్రధాని మోదీ ఒకరికి ఒకరు సహకరించుకుంటున్నారన్నారు. మల్కాజిగిరి, చేవెళ్ళ, మహబూబ్‌నగర్ ఎంపీలను బీజేపీ గెలవటానికి రేవంత్ సహకరించారని ఆరోపించారు. బలమైన కేసీఆర్‌తో తాను కొట్లాడినప్పుడు రేవంత్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ ఎంపీగా వంశీచంద్ రెడ్డిని.. రేవంత్ రెడ్డే ఓడించారన్నారు. మహబూబ్‌నగర్, మల్కాజిగిరి ఎంపీలను గెలిపించుకోలేని రేవంత్ .. తనను గెలిపించారా అంటూ మండిపడ్డారు. రేవంత్ కూర్చున్న సీఎం కుర్చీకి పునాది పడటానికి తాను కారణమని స్పష్టం చేశారు. "నా రెక్కల కష్టంతోని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి రావటానికి నా పాత్ర కూడా ఉంది. కేసీఆర్ నియంత పాలనలో కాంగ్రెస్‌కు.. నా న్యూస్ ఆఫీస్ గాంధీ భవన్‌గా మారింది. నేను ప్రచారం చేసిన 45 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ 42 సీట్లు గెలిచింది. రేవంత్‌కు నచ్చకున్నా.. 2028లో బీసీ ముఖ్యమంత్రి ఖాయం. హనుమంతరావు, అంజన్ కుమార్ యాదవ్ లాంటి వాళ్ళకు కాంగ్రెస్‌లో స్వేచ్ఛ లేదు. అధికారంలోకి వచ్చి 15 నెలలు అయినా.. కాంగ్రెస్ కార్యకర్తలు సంతోషంగా లేరు. గౌడ్ కోటాలో జగ్గారెడ్డి సతీమణికి కార్పొరేషన్ పదవి వచ్చింది. రెడ్డిలు పప్పు, బెల్లం లెక్క కార్పొరేషన్ పదవులు పంచుకున్నారు" అంటూ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు చేశారు. అలాగే సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మల్లన్న ప్రెస్‌మీట్‌కు బీసీ జేఏసీ నేతలు మద్దతు తెలిపారు.

## బీజేపీ, బీఆర్ఎస్ గొంతుకై మల్లన్న మాటలు

హైదరాబాద్ : ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీతో తీన్మార్ మల్లన్న పోల్చుకునే స్థాయి అతనికి లేదని మంత్రి సీతక్క అన్నారు. మల్లన్న వ్యాఖ్యలపై ఆమె బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తల శ్రమతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. కొందరు నేతలు బీజేపీ, బీఆర్ఎస్ గొంతుకలై మాట్లాడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ చేయలేనిది తాము చేశామని.. అభినందించాల్సింది పోయి విమర్శలు చేస్తారా అని ప్రశ్నించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో పోల్చుకునే స్థాయి మల్లన్నది కాదని చెప్పారు. కులగణనపై అభ్యంతరాలు ఉంటే శాసనమండలిలో మాట్లాడాలని అన్నారు. కులగణనకు 50 రోజుల సమయం ఇచ్చామని.. అది సరిపోదా అని మంత్రి సీతక్క నిలదీశారు. కాగా.. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో మంత్రి సీతక్క, షబ్బీర్ అలీ, జానారెడ్డి, జీవన్ రెడ్డి, వీహెచ్ తదితరులు విడివిడిగా గాంధీభవన్‌లో సమావేశమయ్యారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తమ అభిప్రాయాలను చెప్పాలని పీఏసీ సభ్యులను మీనాక్షి నటరాజన్ కోరారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై ఏఐసీసీ కార్యదర్శి వంశీ చంద్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లన్న వ్యాఖ్యలను ఖండించారు. తన ఓటమికి సీఎం రేవంత్ రెడ్డి కారణం అంటూ మల్లన్న చేసిన వ్యాఖ్యలు కేవలం తన ఉనికి కోసమే అని చెప్పారు. తాను మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా పోటీ చేయాలన్నది అధిష్ఠానం నిర్ణయమని తెలిపారు. తన గెలుపు కోసం సీఎం రేవంత్ రెడ్డి ఎంతో శ్రమించారని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాల్లో భాగంగానే మహబూబ్ నగర్‌లో బీజేపీ గెలిచిందని అన్నారు. ఎమ్మెల్సీ కవిత జైల్లో ఉండటంతో ఆమెను బయటకు తీసుకు రావడం కోసం బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి అమ్ముడుపోయిందని ఆరోపించారు. గతంలో కేసీఆర్ లాంటి నేతలు ఎంపీగా పని చేసిన మహబూబ్‌నగర్ సిట్టింగ్ సీట్లో బీఆర్ఎస్ డిపాజిట్ కోల్పోయి బీజేపీకి మద్దతు ఇచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రి నుంచి గ్రామ స్థాయి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ తన గెలుపు కోసం సమష్టిగా కృషి చేశారని వంశీ చంద్ రెడ్డి పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై జానారెడ్డి స్పందించారు. కులగణన అంశంలో తన పాత్ర లేదని చెప్పారు. మల్లన్న గాలి మాటలు మాట్లాడితే కుదరదని హెచ్చరించారు. తప్పు చేసిన వాడిని క్షమించే గుణం తనదని అన్నారు. తనను ఎవరూ తిట్టిన తాను పట్టించుకోనని చెప్పారు. తీన్మార్ మల్లన్న సమావేశంతో తనకు ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. ప్రత్యేక్ష రాజకీయాలకు తాను దూరం. సలహాలు అడిగితే ఇస్తానని తెలిపారు. పరిపాలన చేసే వారు సైతం ఆడిగితేనే సలహాలు, సూచనలు ఇస్తానని అన్నారు. తమ నాయకులు తనను విమర్శిస్తే ఖండిస్తాలేరన్నారు. అలాగని సమర్థించడం లేదని చెప్పారు. ఎందుకో వారినే అడిగి తెలుసుకోవాలని జానారెడ్డి అన్నారు. తీన్మార్ మల్లన్న అంశం తనకు సంబంధం లేదని మాజీ ఎంపీ వీ. హనుమంతురావు అన్నారు. పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని మీనాక్షి నటరాజన్‌కు చెప్పానని అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో వీహెచ్ మీడియాతో మాట్లాడారు. మీనాక్షి నటరాజన్ తనను ఏమి అడగలేదని చెప్పారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని మీనాక్షి నటరాజన్‌కు చెప్పానని హనుమంతురావు అన్నారు.

## కేసు విచారణకు పలుమార్లు గైర్హాజరు

### రాహుల్‌కు 200 జరిమానా విధించిన యూపి కోర్టు

లక్నో : ఓ కేసు విషయంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ఉత్తర్‌ప్రదేశ్‌లోని న్యాయస్థానం రూ. 200 జరిమానా విధించింది. పదే పదే విచారణకు గైర్హాజరు అవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 14న తదుపరి విచారణకు హాజరు కాకుంటే మాత్రం తీవ్ర చర్యలుంటాయని రాహుల్ గాంధీని హెచ్చరించింది. మహారాష్ట్రలో 2022లో మీడియా సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ.. వీర్ సావర్కర్ బ్రిటిష్ సేవకుడని, వారి నుంచి పెన్షన్ కూడా తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు స్వాతంత్య్ర సమరయోధుడైన వీర్ సావర్కర్‌ను కించపరిచే విధంగా ఉన్నాయని ఆరోపిస్తూ నృపేంద్ర పాండే అనే వ్యక్తి యూపీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేవిధంగా రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని అందులో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌కు సంబంధించి తాజాగా మరోసారి విచారణ జరిగింది. రాహుల్ గాంధీ తరఫున న్యాయవాది ప్రన్షు అగర్వాల్ హాజరై.. ప్రస్తుతం లోకసభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ బిజీగా ఉన్నారని, వ్యక్తిగత హాజరుకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. అయితే, పదే పదే విచారణకు గైర్హాజరవుతున్న నేపథ్యంలో ఆయనకు రూ. 200 జరిమానా విధించిన అప్పర్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం.. తదుపరి విచారణకు రాహుల్ తప్పకుండా హాజరు కావాలని ఆదేశించింది. లేని పక్షంలో నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంటు జారీ చేస్తామని హెచ్చరించింది.

## అంతర్గత విషయాలు బయట చర్చిస్తే ఖబడ్దార్

పార్టీని సెట్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. సింప్లిసిటీకి ప్రాధాన్యం ఇస్తూ.. అంతర్గతంగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతూ ఆమె సమావేశాలు సాగుతున్నాయి. తన దృష్టిలో పడాల్సిన అవసరం లేదంటూనే.. పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేయాలని నేతలకు సూచిస్తున్నారు. ఇవాళ ఉదయం పీసీసీ చీఫ్?మహేశ్ కుమార్ గౌడ్?తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన మీనాక్షి నటరాజన్ ఎమ్మెల్సీ అభ్యర్థులపై చర్చించారు. అనంతరం పార్ట అనుబంధ సంఘాల నాయకులతో మాట్లాడారు. తర్వాత ఆదిలాబాద్ జిల్లా నేతలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కీలక అంశాలను ప్రస్తావిస్తూనే పలువురికి చురకలు అంటించారు.

## నేను ఆత్మహత్య చేసుకోలేదు

విషయంలో ఇటీవల మనస్పర్థలు వచ్చాయి. అనంతరం ఆమె హైదరాబాద్‌కు చేరుకున్నారు. అదే సమయంలో కల్పన భర్త ప్రసాద్.. ఆమెకు పలుమార్లు ఫోన్ చేయగా స్పందన లేదు. దీంతో, ప్రసాద్ కాలనీ వెల్ఫేర్ సభ్యులకు ఫోన్ చేసి చెప్పగా, వారు ఆఎంఒ 100కి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. కేపీహెచ్‌బీ పోలీసులు, కాలనీ వెల్ఫేర్ మెంబర్స్ ఇంటి తలుపులు తెరిచేందుకు ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో వెనుక వైపు ఉన్న కిచెన్ డోర్ నుంచి లోపలికి ప్రవేశించి, బెడ్ రూమ్‌లో అపస్మారక స్థితిలో ఉన్న కల్పనను సమీపంలోని ఆస్పత్రికి తరలించాం ' అని పోలీసులు వెల్లడించారు. తాను ఆత్మహత్యాయత్నం చేయలేదని, ఈ ఘటనలో ఎవరి ప్రమేయం లేదని కల్పన చెప్పినట్టు పోలీసులు పేర్కొన్నారు. తనకు, తన కుమార్తెకు జరిగిన విషయంలో నిద్ర పట్టక అధిక మొత్తంలో నిద్ర మాత్రలు వేసుకోవడం వల్ల ఇలా జరిగిందని ఆమె వెల్లడించినట్టు తెలిపారు.

## రెచ్చిపోతున్న సైబర్‌నేరగాళ్లు

డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివరాల ప్రకారం.. నకిరేకల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు నిన్న రాత్రి సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ చేశారు. ఆ కాల్ లిఫ్ట్ చేయగానే అవతలి అమ్మాయి నగ్నంగా కనిపించింది. మొబైల్ స్క్రీన్‌పై ఆ సీన్ చూడగానే వేముల వీరేశం ఫోన్ కట్ చేశాడు. కానీ అదంతా స్క్రీన్ రికార్డు చేసిన సైబర్ నేరగాళ్లు.. ఆ వీడియోను ఆయనకే పంపించారు. తమకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆ వీడియోను కుటుంబసభ్యులు, మిత్రులకు పంపించడమే కాకుండా సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. కానీ ఆయన స్పందించకపోవడంతో ఆ వీడియోను కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు పంపించారు. ఆ వీడియో చూసిన వెంటనే సదరు నేతలు, కార్యకర్తలు వేముల వీరేశానికి ఫోన్ చేసి ఆరా తీశారు. దీంతో కంగుతిన్న ఎమ్మెల్యే.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. పోలీసుల సలహాలతో సైబర్ నేరగాళ్ల నంబర్‌ను బ్లాక్ చేయాలని ఎమ్మెల్యేకు సూచించారు.

## అహంకారానికి నిలువెత్తు రూపం జగన్

**అసెంబ్లీకి రాకుండా అబద్దాలు చెబితే ఎలా**

**అధికారం ఉన్నా..లేకున్నా జగన్ ఎప్పుడూ ప్రజలకు దూరమే**

**జగన్ విమర్శలపై కౌంటర్ ఇచ్చిన మంత్రి లోకేశ్**

అమరావతి : అహంకారానికి ప్యాంటు, షర్టు వేస్తే జగన్ లాగే ఉంటుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అసెంబ్లీకి రాకుండా ఇంట్లో కూర్చుని అబద్దాలు చెబితే ప్రజలు నమ్మరని అన్నారు. అసెంబ్లీకి వచ్చి మాట్లాడితే నిజాలంటే మేమూ చెబుతామని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్నా, కోల్పోయినా జగన్ ప్రజలకు దూరంగానే ఉన్నారని మండిపడ్డారు. పరదాల ప్రభుత్వం పోయాక రాష్ట్రంలో పరదాల అమ్మకాలు తగ్గాయని వ్యాఖ్యానించారు. 'వైకాపాకు ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వకూడదని నిర్ణయించారు. ఆ విషయం జగన్‌కు ఎందుకు అర్థం కావట్లేదు? ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా గురించి సీఎంను కించపరిచేలా మాట్లాడుతారా? ప్రతిపక్ష హోదా రావాలంటే 10శాతం సభ్యులుండాలి. 11 సీట్లు ఎందుకు వచ్చాయో ఆత్మ పరిశీలన చేసుకుంటే మంచిది. తల్లి, చెల్లి కూడా నమ్మట్లేదని జగన్ ఇంకా గ్రహించట్లేదు. పవన్ కల్యాణ్‌కు వచ్చిన మెజారిటీ ఎంత? జగన్‌కు వచ్చింది ఎంత? సీఎం, డిప్యూటీ సీఎంపై జగన్‌వి దిగజారుడు మాటలు మానుకోవాలన్నారు. గతంలో లేని విధంగా రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరుగుతుందని ఎన్నికల ముందు చెప్పారు. ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకున్నాం. గత ప్రభుత్వం విధ్వంసం వల్ల ఆదాయం పడిపోయింది. గాడి తప్పిన రాష్ట్రాన్ని సరైన మార్గంలో పెడుతున్నాం' అని లోకేశ్ వివరించారు. 'జగన్‌కు చట్టాలు ఉల్లంఘించటం అలవాటు కాబట్టి.. మేము కూడా చట్టాన్ని ఉల్లంఘించి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని అంటున్నారు. ఎమ్మెల్యేగా గెలవకుండా సభకు వస్తా అన్నట్టుగా జగన్ వితండ వాదం ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి మెజారిటీకి భయపడి హడావుడిగా బెంగళూరు నుంచి వచ్చి ప్రెస్‌మీట్ పెట్టి .. మళ్లీ బెంగళూరురు తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. జగన్ 40లక్షల ఉద్యోగాలు ఎవరికి కల్పించారు, ఎక్కడ ఇచ్చారో సమాధానం చెప్పాలి. 40లక్షల ఉద్యోగాల కల్పన జరిగి ఉంటే ఇక నిరుద్యోగ సమస్య ఎక్కడుంటుందని లోకేశ్ ప్రశ్నించారు. జగన్ చేసిన విధ్వంసం వల్ల పడిపోయిన రాష్ట్ర ఆదాయాన్ని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నాం. సజ్జల స్క్రిప్ట్ పంపిస్తుంటే మండలిలో అది చదవటం తప్ప బొత్స చేతుల్లో ఏముంది. మూడు రాజధానులపై జగన్ స్టాండ్ ఏంటో బొత్స ఏం చెప్పగలరా అని ఆక్షేపించారు.

# నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించాలి

- భద్రతతో కూడిన ఉత్పత్తి, రవాణా సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- ఉద్యోగులకు అవగాహన కల్పిస్తూ లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలి
- బొగ్గు ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం కలగకుండా చూసుకోవాలి
- డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కొప్పుల వెంకటేశ్వర్లు

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 05:** నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించాలని డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు.బుధవారం జి.యం. కార్యాలయం నందు రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, ఏరియాలోని వివిధ గనులు విభాగాధిపతులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ (ప్రాజెక్ట్స్) కొప్పుల వెంకటేశ్వర్లు దిశానిర్దేశం చేసి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్దేశించిన ఓ.బి (మట్టి వెలికితీత), బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించే దిశగా ఎప్పటికప్పుడు కార్యాచరణ సిద్ధం చేసుకుంటూ ముందు కెళ్లాలన్నారు,. ప్రస్తుతం మార్కెట్ లో ఉన్న పరిస్థితుల పట్ల ఉద్యోగులకు అవగాహన కల్పిస్తూ లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలన్నారు. బొగ్గు ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం కలగకుండా చూసుకోవాలని, భద్రతతో కూడిన ఉత్పత్తి, రవాణా సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా కొద్ది రోజులు మాత్రమే ఉన్నాయని, ఉద్యోగులందరూ బాధ్యతా యుతంగా విధులు నిర్వహిస్తూ సంస్థ



నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్వోటుజియం జి.రఘుపతి, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖరబాబు, ఫైనాన్స్ ఎజియం పి.శ్రీనివాసులు, విభాగాధిపతులు రాజారెడ్డి, రాజేంద్ర కుమార్, బి.సుదర్శనం, జనార్దన రెడ్డి, ఐలయ్య, ఉదయ్ హరిజన్, షబ్బీరుద్దీన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఛాంపియన్ ట్రోఫీ బీజేపీదే....

- గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపుతో అంబురాన్నింటిన సంబురాలు
- కార్యకర్తలతో కలిసి సంబురాలు చేసుకున్న సంజయ్





**కరీంనగర్ టౌన్, మార్చ్5(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల "ఛాంపియన్ ట్రోఫీ"లో బీజేపీ విజయం సాధించిందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఒక వర్గానికి కొమ్ము కాస్తున్న కాంగ్రెస్ కు ఎమ్మెల్సీ ఎన్నికల తీర్పు గుణపాఠమన్నారు. ముస్లింలంతా ఏకమై బీజేపీని ఓడించాలని చూస్తే హిందూ సమాజమంతా కాంగ్రెస్ ను ఓడించి ఆ పార్టీకి "రంజాన్" గిఫ్ట్ ఇచ్చారని పేర్కొన్నారు. బీజేపీ కార్యకర్తల పోరాటాలకు హ్యాట్సాఫ్ చెప్పిన బండి సంజయ్ బీజేపీకి అండగా నిలిచిన ఓటరు మహాశయులకు శిరస్సు వంచి వందనాలు తెలిపారు. డబ్బులు పంచి గెలవాలని కాంగ్రెస్ అభ్యర్థి చెంప చెళ్లుమన్పించారని చెప్పారు. నోట్లు పంచిన వారిని వదిలిపెట్టబోమని, గూగుల్ పే వివరాల లెక్కలు తీస్తున్నామని తెలిపారు. కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయం సాధించిన అనంతరం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పార్టీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, మాజీ మేయర్ సునీల్ రావు తదితరులతో కలిసి బండి సంజయ్ "విక్టరీ" గుర్తును చూపిస్తూ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ బండి సంజయ్ ఏమన్నారంటే బీజేపీ విజయానికి అహర్నిశలు పనిచేసిన కార్యకర్తలందరికీ హ్యాట్సాఫ్. టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించిన ఓటర్లకు శిరస్సు వంచి వందనాలు చెబుతున్నా. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఇది నాలుగో విజయం. 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలతోపాటు నిన్న టీచర్స్ ఎమ్మెల్సీ, ఇయాళ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సీటు సాధించాం. నరేంద్రమోదీ నీతి, నిజాయితీ పాలనను, తెలంగాణకు కేంద్రం కేటాయించిన నిధులను గుర్తించడంతోపాటు కార్యకర్తలు చేసిన పోరాటాలును గుర్తు చేసుకుని అద్భుతమైన విజయాన్ని అందించినందుకు చాలా సంతోషంగా ఉంది. మా కార్యకర్తలు టీచర్లు, నిరుద్యోగులు, ప్రజల పక్షాన చేసిన పోరాటాలను గుర్తు చేశాం. లాఠీదెబ్బలను, జైలుకు వెళ్లిన సంఘటలను గుర్తు చేసినం. మోదీ ప్రభుత్వం ఉద్యోగులకు రూ.12 లక్షల వరకు పన్ను రాయితీ ఇవ్వడంతోపాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసింది. అవన్నీ గుర్తు చేసినం. మా పక్షాన నిలబడ్డందుకు అనందంగా ఉంది.మొన్న ఛాంపియన్ ట్రోఫిలో ఇండియా గెలిచింది. ఆరోజు, ఈరోజు అదే చెప్పిన. మాది ఇండియా టీం. విజయం సాధించి తీరుతామని చెప్పినం. వాళ్లు డబ్బు సంచులు పంచారు. మేం ఓటర్లను నమ్ముకున్నాం. నోట్ల సంచులు ఓడిపోయాయి. ఓటర్లే గెలిచారు. ఈవీఎంలను మేనేజ్ చేసి బీజేపీ గెలుస్తుందని పదేపదే దుష్ప్రచారం చేసిన రాహుల్ గాంధీకి నేను సవాల్ విసురుతున్నా ఈవీఎంల ద్వారా మాత్రమే కాదు ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిర్వహించిన బ్యాలెట్ పేపర్ ద్వారా కూడా బీజేపీయే గెలిచింది. దీనికేం సమాధానం చెబుతారు.బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రలు చేసినా, డబ్బు సంచులను పంచినా ఓటుకు రూ.5 వేల చొప్పున పంచినా వారి కుట్రలు ఫలించలేదు. మేం నయాపైసా ఖర్చు చేయలేదు. మా కార్యకర్తలే ఇంటింటికీ తిరిగారు. వారి కష్టం, మోదీ పాలన, అమ్మవారి దయవల్లే ఈరోజే మాకు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ చెంప చెళ్లుమన్పించారు. వాస్తవానికి బీఎస్పీ అభ్యర్థి 2వ స్థానానికి వస్తారని భావించాం. ఎప్పుడైతే బీఆర్ఎస్ పార్టీ నేతలు ఆయనకు మద్దతిచ్చి, పైసలిచ్చిందో అవన్నీ గమనించిన ప్రజలు ఆ అభ్యర్థిని 3వ స్థానానికి పరిమితం చేశారు. మార్పు కోరుతున్న ప్రజలకు బీజేపీ దిక్సూచిలా కన్పించింది. ఇకపై ఏ ఎన్నికలు జరిగినా విజయపరంపర బీజేపీదే. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ గెలపు బీజేపీదే. ఎందుకంటే రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులిస్తోంది కేంద్ర ప్రభుత్వమే. సొమ్ము కేంద్రానిదైతే సోకు రాష్ట్ర ప్రభుత్వం చేసుకుంటోంది. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధమైనరు. మా పోరాటాలు, జైళ్లు, తిన్న లాఠీదెబ్బలను గుర్తు చేసుకున్నరు. మా కార్యకర్తల తలలు పగిలి రక్తం చిందించిన సంఘటనలను, త్యాగాలను గుర్తు చేసుకుని ఓటరు మహాశయలు ఓటేసి ఆశీర్వదించారు. వారి నమ్మకాన్ని నిలబెడతాం. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీ యుద్ధం చేసేందుకు సిద్ధమవుతున్నం. ఇకనైనా కాంగ్రెస్ దిగిరావాలి. రాష్ట్రంలోని 42 అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్లు రాష్ట్ర ప్రభుత్వ పాలనపై వ్యతిరేకత వ్యక్తం చేస్తూ తీర్పు ఇచ్చారు. వెంటనే 6 గ్యారంటీలను అమలు చేయాలి. అట్లాగే 2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి. ఇచ్చిన మాట మేరకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలి. అట్లాగే ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీని అమలు చేయాలి. 5 పెండింగ్ డీఏలు, రిటైర్డ్ మెంట్ బెన్ ఫిట్స్, జీపీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలి. వీరితోపాటు రైతులకు, మహిళలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి.బీజేపీ ఎక్కడైనా పైసలు పంచిందా మీరే చెప్పండి. కొందరు గూగుల్ పే, ఫోన్ పే ద్వారా విచ్చలవిడిగా డబ్బులు పంచారు. ఓటుకు రూ.5 వేల దాకా యూపీఐ ద్వారా పంపిణీ చేశారు. అవన్నీ బయటకు తీస్తాం. అడ్డగోలుగా సంపాదించిన సొమ్మును పంచి ఎన్నికల్లో అడ్డదారుల్లో గెలుద్దామనుకున్నరు. ఎవరినీ వదిలిపెట్టబోం. రాజకీయాలను కలుషితం చేసే వాళ్లను వదిలిపెట్టబోం. నిజాయితీగా కష్టపడే కార్యకర్తల పోరాటాలను, త్యాగాలకు విలువ లేకుండా చేస్తామంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు.తెలంగాణ ఆదాయంలో హైదరాబాద్ వాటా అధికం. కానీ వెనుకబడ్డ ఆదిలాబాద్ లో నిధులు ఎక్కువ ఖర్చు చేస్తోంది. దీనినేమంటారు? అట్లాగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు వ్యతిరేకంగా బీసీ సమాజం, హిందూ సమాజం ఓట్లేసి గెలిపించింది. ఒక వర్గానికి కొమ్ముకాస్తున్న కాంగ్రెస్ పార్టీ యావత్ హిందూ సమాజం ఈ తీర్పు ద్వారా "రంజాన్" గిఫ్ట్ ఇచ్చింది. పండుగ చేసుకోమని చెప్పింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని, బండి సంజయ్ ను ఓడించేందుకు ముస్లిం సంఘాలన్నీ ఏకమై 'బండి సంజయ్ కు గుణపాఠం చెబుదాం. అందరూ ఏకమై బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ కు ఓటేయాలని పిలుపినిచ్చింది. చివరకు ఏమైంది? వాళ్లంతా ఒకటైతే హిందూ సమాజం కూడా ఏకమై బీజేపీ పక్షాన నిలిచింది.ఇప్పుడు కాంగ్రెస్ కు సవాల్ విసురుతున్నా ప్రజలంతా కాంగ్రెస్ పక్షాన ఉన్నారని భావిస్తే తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి అన్నారు.

## బాలిక ఆత్మహత్య నిందితుడికి మూడు ఏళ్ల జైలు శిక్ష..



**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రేమిస్తున్నానని వెంటపడి వేధించి మైనర్ బాలిక ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన నిందితుడికి మూడు సంవత్సరాల జైలు శిక్ష 3వేల రూపాయల జరిమాన విధిస్తూ జిల్లా జడ్జి నిలిమా తీర్పు చెప్పారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా పెగడపల్లి పోలీస్ స్టేషన్ పరిదికి చెందిన నిందితుడు ఎట్టెం రవి ( 22 ) అనే వ్యక్తి మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని వేదించగా, మనస్తాపానికి గురైన సదరు బాలిక పురుగుల మందు త్రాగి ఆత్మహత్య చేసుకోవడం జరిగింది.ఈ ఘటనలో నిందితుడిపై పెగడపల్లి పోలీస్ స్టేషన్ లో అప్పటి ఎస్సై శ్వేత కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి కోర్టు కి ఆధారాలు సమర్పించగా పిపి, కోర్ట్ డ్యూటీ అధికారులు సాక్ష్యులను ప్రవేశపెట్టగా, సాక్ష్యులను విచారించిన జిల్లా న్యాయమూర్తి నీలిమ నిందితుడికి 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు 3వేలు జరిమాన విదిస్తూ బుధవారం తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్పి అశోక్ కుమార్ మాట్లాడుతూ ... సమాజంలో నేరం చేసిన వారేవరైనా శిక్ష నుండి తప్పించుకోలేరని పోలిసులు, ప్రాసిక్యూషన్ వారి వ్యూహంతో న్యాయ విచారణ, న్యాయ నిరూపణ వేగవంతగా జరిపి కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు. ఇట్టి కేసు లో నిందితునికి శిక్ష పడటంలో కృషి చేసిన పీపీ రామకృష్ణ రావు, ఎస్.ఐ శ్రీకాంత్ , కోర్ట్ కానిస్టేబుల్ సాగర్ , కానిస్టేబుల్స్ శ్రీధర్, కిరణ్ కుమార్ లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

## మహిళలు రాజకీయ సామాజిక సాధనలో ముందు ఉండాలి

రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 5: మహిళలు ఆర్థిక రాజకీయ సామాజిక సాధనలో ముందు ఉండాలి అని శ్రామిక మహిళ జిల్లా నాయకురాలు జి. జ్యోతి అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.వనజా రాణి అన్నారు. ఈ మేరకు రొంపి కుంట గ్రామంలో అంగన్వాడి టీచర్ గుమ్మడి శారద ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముందస్తు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జ్యోతి మరియు వనజారాణిలు ముఖ్యఅతిథిగా హాజరై బహుమతి ప్రధానోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8న జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. ప్రతి సంవత్సరం ఒకటే రోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకోవడం జరుగుతుంది. అలాగే ఈ దినోత్సవాన్ని మొదట అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవం గా పిలిచేవారు అని పేర్కొన్నారు. ప్రాంతాల్లో ఈ ఆచరణ మహిళలకు గౌరవం గుర్తింపునిస్తుందని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా మహిళల రాజకీయ సామాజిక హక్కుల పోరాటంపై జాగృతి పెంచే విధంగా జరుపుకోవడం జరుగుతుంది. అలాగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు సెలవు దినంగా ప్రకటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ, రజియా, రాజమణి, సంధ్య, సుల్తానా, సృజన, అనిత, రమ, శారద తదితరులు పాల్గొన్నారు.



## ఏసీబీ చిక్కిన కోరుట్ల ఎస్ఐ..

### - లంచం తీసుకుంటుడగా రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్న ఏసీబీ డిఎస్పీ రమణమూర్తి



**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం జోగినిపల్లి శివారులో గత నెలలో మామిడి తోటలో పేకాట ఆడుతూ ఎనిమిది మంది పట్టు పడగా వారి వద్ద నుండి 23,000 నగదుస్వాధీన పరుచుకుని పోలీస్‌లు కేసు నమోదు చేశారు. ఎనిమిది మందిలో ఏడు మంది సెల్ ఫోన్లు తిరిగి ఇవ్వడంతో ఒకరి వ్యక్తి సెల్ ఫోన్ మాత్రం ఇవ్వలేదు అందుకుగాను ఆ వ్యక్తిని ఎస్.ఐ.5000 డిమాండ్ చేయడంతో ఏసీబీ డిఎస్పి రమణమూర్తి ఆధ్వర్యంలో బాధితుడు ఎస్సై 3కి 5000 ఇస్తుండగా వల పన్ని ఏసీబి అధికారులు పట్టుకున్నారు.

## ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 5:** కమాన్ పూర్ ( గుండారం) ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు, హిందీ, పరీక్షలు జరగగా మొత్తం 73 మందికి గాను 72 మంది విద్యార్థులు హాజరుకాగా ఒక విద్యార్థి గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలకు గాను చీఫ్ సూపర్డెంట్ గా కాశీ మల్ల సుధాకర్ డిపార్ట్మెంటల్ అధికారిగా నరహరి వ్యవహరించారు. మొదటిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

## ఉగాది పురస్కారాలు 2025 పోస్టర్ ఆవిష్కరణ



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 5:** కమాన్ పూర్ మండల కేంద్రంలో ఉగాది పురస్కారాలు 2025 పోస్టర్ ను ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ పులిపాక దేవ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. గోదావరిఖనిలోని మార్కండేయ కాలనీ రాజ్యలక్ష్మి గార్డెన్స్ లో ఈనెల 23న బిట్ బిట్ డాన్స్ అకాడమీ దేవా కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించే ఉగాది పురస్కారాలు అవార్డులు ప్రధానం చేయడం జరుగుతుంది. దీనికి గాను వైద్య విద్య సామాజిక వివిధ కళా రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారిని గుర్తించి ఈ అవార్డులు ప్రముఖుల చేతుల మీదుగా ప్రధానం చేయడం జరుగుతుంది. ఆసక్తి కలవారు ఈనెల 15వ తేదీలోగా తమ ఎంట్రీలను పులిపాక దేవా డ్యాన్స్ మాస్టర్ 9177709 591, 8374709591. నంబరు కు సంప్రదించాలని కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో బిట్ బిట్ డాన్స్ అకాడమీ అధ్యక్షులు దాసరి రామస్వామి, సలహాదారు సీనియర్ జర్నలిస్టు జబ్బార్ ఖాన్, మెజీషియన్ కళాకారుడు శశి, తోపాటు గుర్రం లక్ష్మీ మల్లు, బొమ్మగాని అనిల్ గౌడ్ , సుతారి రాజేందర్, బొంపల్లి రాజయ్య, సాన సురేష్ కురుమ, దాసరి శంకర్, తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు





**రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 05:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం-త్రీ, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలలోని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఏరియాలోని వివిధ గనులు, విభాగాలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు బుధవారం నాడు జి.యం. కార్యాలయ ప్రాంగణంలో ఆటల పోటీలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులందరూ ఈ పోటీలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల విజేతలకు ఈ నెల 8 వ తేదీన స్థానిక కమ్యూనిటీ హాలు నందు నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయబడునని నిర్వాహకులు తెలియజేశారు. ఈ వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్ గుర్రం శ్రీహరి, నిర్వాహకులు నాగరాజు, సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## బిజెపి పునర్విభజన రాజకీయం !

దక్షిణాదిలో బిజెపి పెద్దగా పట్టు సాధించలేకపోతోంది. తమిళనాడు, కేరళలో అడుగు పెట్టడమే కష్టంగా ఉంది. గత దశాబ్దంగా ఎంతగా ప్రయత్నించినా ఒక్కసీటు సాధించడం కష్టంగా మారుతోంది. ఈ క్రమంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన సరికొత్త ఆందోళనలకు దారితీస్తున్నది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. అయితే అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరిగే బదులు తగ్గుతాయన్న ఆందోళన ఇప్పుడు దక్షిణాది నేతల్లో కలవరానికి గురి చేస్తోంది. 2011 జనాభా లెక్కలు తీసుకుంటే, అప్పటికీ ఇప్పటికీ దక్షిణాదిలో జనాభా తగ్గింది. ఈ లెక్కన సీట్లు పెరగాల్సింది పోయి తగ్గే ప్రమాదం ఉంది. ఇదే విషయమై ప్రధానంగా తమిళనాడు సిఎం స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా పిల్లలను కనాలని నవదంపతులకు పిలుపునివ్వడం కూడా జరిగింది. రాజ్యాంగ బద్ధంగా జరగాల్సిన ఈ పునర్విభజన రాజకీయ విభజనగా మారడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాజ్యాంగంలోని 82వ అధికరణం ప్రకారం ప్రతి పదేళ్లకు ఒకసారి జనాభా లెక్కలు జరిపించాలి. మార్పులు చేర్పులను బట్టి చట్టసభల నియోజకవర్గాల సంఖ్యలు, హద్దులు సవరణలు చేయాల్సి వుంటుంది. ఎందుకంటే జనాభా అధికంగా వున్నా తక్కువగా వున్నా అన్ని రాష్ట్రాల్లోనూ ఓటుకు ఒకే విలువ వుండాలి. ఎమర్జన్సీలో తెచ్చిన 42వ రాజ్యాంగ సవరణలో నియోజకవర్గాల పునర్విభజన స్తంభింపచేశారు. ఆ సమయంలోనే జనాభా నియంత్రణపై ప్రత్యేక కేంద్రీకరణ పెట్టారు. జనాభాను తగ్గించే చర్యల కోసం రాష్ట్రాలను ప్రోత్సహించారు. అప్పటికి దక్షిణాది రాష్ట్రల్లో 6 నుంచి 10 శాతం పెరుగుదల వుంటే ఉత్తరాదిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, యు.పి, బీహార్ లలో 12 నుంచి 15 శాతం వుండింది. కనుక జనాభా నియంత్రణ చర్యలు వేగవంతం చేయాలనీ ఇరవయ్యేళ్ల తర్వాతనే పునర్విభజన చేపట్టాలని నిర్ణయించారు. ఈ సమయంలో జనాభా తగ్గితే సీట్లు తగ్గించడం సరికాదు గనక పార్లమెంటు స్థానాల సంఖ్యను 2001 వరకూ స్తంభింపచేశారు. అందువల్ల సీట్ల స్వరూపంలో అనేక మార్పులు జరిగినా మొత్తం ఎంపిల సంఖ్యలో మార్పు రాలేదు. సరిహద్దుల మార్పు తప్ప ఆ యా రాష్ట్రాల వారీగా వున్న సీట్ల సంఖ్యలో మార్పు లేకుండా నియోజకవర్గాల పునర్వి భజన పక్రియను 2026 వరకూ వాయిదా వేస్తూ 2002 రాజ్యాంగ సవరణ చట్టం తీసుకొచ్చారు. దీంతో ఇప్పటి వరు ఆ ప్రక్రియ ఆగిపోయింది. ఇప్పుడు జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సి ఉంది. ఈ సమయంలో గందరగోళం చెలరేగుతోంది. ఉన్నసీట్లు తగ్గిస్తే తమకు పార్లమెంటులో పట్టు లేకుండా పోతోందన్న ఆందోళన మొదలయ్యింది. నిజానికి ఇదో కీలకమైన అంశం. విధాన నిర్ణయం కూడా. ఇలాంటి కీలకాంశాలపై పారదర్శకంగా సమగ్రంగా చర్చ జరగాలి. దక్షిణాది నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్న వేళ కేంద్రం మాత్ర స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. ఏకపక్ష నిర్ణయాలు లేకుండా చూడడం కేంద్ర ప్రభుత్వ విద్యుక్త ధర్మం. ఎలాగూ దక్షిణాదితో వచ్చే లాభం లేదు కనుక సీట్లు తగ్గిస్తేనే మంచిదన్న కుత్సిత ఆలోచన ఏదైనా ఉందా అన్న అనుమానాలు కూడా వస్తున్నాయి. అధ్యక్ష తరహాను తలపించే విధంగా కేంద్రీకృత పెత్తనానికి బిజెపి యత్నిస్తోందని అనేక ఆరోపణలు సైతం ఉన్నాయి. అదే సమయంలో అంతా రాజ్యాంగబద్ధంగా పద్ధతి ప్రకారమే జరగడానికి చర్యలు అవసరం. నియోజకవర్గాల పునర్విభజన సరికొత్త సవాళ్లకు దారితీస్తున్నది. రాజ్యాంగం ప్రకారం జనాభా లెక్కల తర్వాత జరగాల్సిన పునర్విభజన అనేక కారణాల వల్ల సందేహాస్పదమై పోయింది. దక్షిణాది రాష్ట్రాల స్థానాల సంఖ్య తగ్గిపోతుందనీ, ఒకవేళ పెంచినా వాటి వాటాగా రావలసిన పెరుగుదల రాదనీ స్టాలిన్ విమర్శ చేస్తున్నారు. అయితే హోం మంత్రి అమిత్ షా ఎవరి సీట్లూ తగ్గబోవని ప్రకటించారు. అసలు పునర్విభజన ఏ ప్రాతిపదికపై జరుగుతుందో చెప్పాలని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి గట్టిగా కోరుతున్నారు. దక్షిణాదిపై బిజెపి, కేంద్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా అమిత్ షా హామీలను నమ్మలేమని వ్యాఖ్యానించారు. దక్షిణాది రాష్ట్రాల నోరు నొక్కేందుకు పునర్విభజన అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. కేంద్రానికి నిజంగా చిత్తశుద్ధి వుంటే ఈ పునర్విభజన ఏ ప్రాతిపదికన జరుగుతుంది, ఇప్పుడున్న సీట్లు ప్రస్తుత జనాభా ప్రకారమే వుంటాయా అని ఆయన ప్రశ్నించారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ కూడా కేంద్రం అందరితో చర్చించి అడుగు వేయాలనీ, సందేహాలు తొలగించాలని వ్యాఖ్యానిం చారు. అయితే జమిలి ఎన్నికల బిల్లుతో ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సిద్ధం అవుతున్న వేళ ఈ ఆందోళనపై స్పష్టత రావాల్సి ఉంది. 1976 తర్వాత కాలంలో దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తర్వాత ఎ.పి, తెలంగాణలు జనాభా తగ్గింపులో గణనీయమైన ప్రగతిని సాధించాయి. తమిళనాడులో సంతానోత్పత్తి రేటు 2001 నాటికే 2.0గా వుంది. అంటే జనాభా స్థిరీకరణ దశకు చేరింద ని అంచనా వేశారు. అమిత్ షా ప్రకటనను బట్టి చూస్తే 2026లో ఈ పక్రియ చేపట్టడం తథ్యంగా కనిపిస్తుంది. అయితే ఇప్పుడు కేవలం జనాభాను బట్టి సీట్లు నిర్ణయించేట్టయితే తక్కువ జనాభా వున్న దక్షిణాదిన సీట్లు తగ్గితే ఇప్పటికే చాలా ఎక్కువగా వున్న యు.పి, బీహార్ వంటి వాటికి ఇంకా పెరుగుతాయి. సగటు జనాభాను చూస్తే వేరే తేడాలుంటాయి. ఉదాహరణకు నాలుగు కోట్ల జనాభా వున్న తెలంగాణకు 17 లోక్‌సభ సీట్లున్నాయి. 12.6 కోట్ల జనాభా వున్న బీహార్‌కు 40 సీట్లున్నాయి. సగటున తెలంగాణకు 23 లక్షల మందికి ఒక సీటు వుంటే బీహార్‌లో సగటున 32 లక్షల మందికి ఒక సీటు వున్నట్టు లెక్క. అందులోనూ జనాభాను బట్టి దామాషా ప్రాతిపదికన పెంచేట్టయితే ఆ ఫార్ములాను బట్టి ఈ తేడా ఇంకా విపరీతంగా మారొచ్చు. సాంకేతికంగానేగాక రాజకీయంగానూ ఈ మార్పులకు చాలా ప్రభావం వుంటుంది. బిజెపి ఎన్నిఎత్తులు వేసినా దక్షిణాదిన స్వంతంగా అధికారంలోకి వచ్చేంతగా బలం పెంచుకోవడంలో సఫలం కాలేకపోయింది. కర్ణాటక మినహా ఇతర చోట్ల ప్రత్యక్ష, పరోక్ష మిత్రులపైనే ఆధారపడి వుంటున్నది. ఇలాంటి సమయంలో పునర్విభజన పేరిట ఉత్తరాదిన సీట్లు పెంచి దక్షిణాదిన తగ్గించేలా రాజకీయ ఎజెండాతో ముందుకు పోతుందా అన్న అనుమానాలు వస్తున్నాయి.

# జనాభా పెరుగుదలతో యూపి, బీహార్‌లకు లబ్ది



### పార్లమెంట్ సీట్లు పెరిగితే బిజెపికే లాభం

న్యూఢిల్లీ : పునర్విభజన జనాభా మేరకు జరిపితే ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు పెరిగి, దక్షిణిదిలో తగ్గుతాయి. ముఖ్యంగా జనాభాకు తగినట్టు సీట్లు పెంచాలంటే బీహార్, యు.పి వంటి చోట్ల సంఖ్య రెట్టింపవుతుంది. ఈ పెంపు అన్నది జనాభా పెరుగుదలకు కృషి చేసినందుకు బహుమానంగా భావించాల్సి ఉంటుంది. అయితే దక్షిణాదిలో సీట్లు తగ్గవని అమిత్ షా హామీ ఇస్తున్నా..నమ్మిక కుదరడం లేదు. ఎందుకంటే బిజెపి ఏది అనుకుంటే అది చేసి తీరుతుంది. ఒక లెక్క ప్రకారం ఉత్తరాది రాష్ట్రాలకు 32 స్థానాలు పెరిగితే దక్షిణాదిన 24 తగ్గుతాయి. కేరళకు 20లో ఆరు నుంచి ఎనిమిది కోల్పోవలసి రావచ్చంటున్నారు. అదే ఉత్తరప్రదేశ్‌కు 80 నుంచి 91కి చేరతాయి. బీహార్‌కు పది పెరగ్గా ఎం.పి, రాజస్థాన్‌కు కూడా గణనీయమైన పెరుగుదల వుంటుంది. 1977లో సగటున ఒక్కో ఎం.పి 10.11 లక్షల ఓటర్లకు ప్రాతినిధ్యం వహించేవారు. సగటు ఓటర్ల సంఖ్య నియోజకవర్గానికి ఎంత వుండాలనేదానిపై నిషేధమేమీ లేదు. ఉదాహరణకు ఇప్పుడు కూడా అదే తరహాలో 10.11 లక్షల మందికి ఒకరి చొప్పున నిర్ణయించేట్టయితే ప్రస్తుత జనాభా ప్రకారం 1400 మంది లోక్‌సభ సభ్యులవుతారు. ఆ ప్రకారం యు.పి, బీహార్‌ల సభ్యుల సంఖ్య మూడంతలు పెరుగుతుంది. తమిళనాడు, కేరళ వంటివి రెండింతలే పెరుగుతాయి. అదే బీహార్, యు.పి లను తీసుకుంటే 2015లో కూడా వాటి జనాభా పెరుగుదల రేటు 4.0గా వుంది. మానవాభివృద్ధి సూచికల్లోనూ దక్షిణాది రాష్ట్రాలు కొంత మెరుగ్గా వున్నాయి. హిందీ రాష్ట్రాలు ముఖ్యంగా పెద్దవైన ఉత్తర ప్రదేశ్, బీహార్‌ల జనాభా మాత్రం తగ్గకపోగా పెరుగుతూనే వచ్చింది. జనాభా నియంత్రణ చర్యలలో నిర్లక్ష్యం, మత సంబంధాలతో సహా అనేక రాజకీయ కారణాలు దీని వెనక వున్నాయనేది స్పష్టం. ఉన్న చట్టం ప్రకారం ఇప్పుడు నియోజక వర్గాల పునర్విభజన ఎజెండాలోకి రానుంది. అంటే ఇక్కడ ఒకటి పెరిగితే అక్కడ నాలుగు పెరుగుతాయి. ఏమైనా ఎంత జనాభా వుంటే ఒక లోక్‌సభ స్థానం, సాంకేతికంగా సమాన ప్రాతినిధ్య సూత్రమేమిటి అన్నదాన్ని బట్టి ఈ అంశాన్ని నిర్ధారించవలసి వుంటుంది.ఎ.పి, తెలంగాణ విభజన తర్వాత తమిళనాడుకే దక్షిణాదిన అత్యధికంగా 39 స్థానాలున్నాయి. దేశ వ్యాపితంగా చూస్తే అది అయిదో స్థానంలో వుంది. ఏకపక్షంగా పునర్విభజన జరిపితే 7,8 స్థానాలు తగ్గిపోతాయి. 11 వరకూ తగ్గొచ్చని మరో లెక్క కూడా వుంది. కొత్త పార్లమెంటులో 888 మంది సభ్యులకు చోటు కల్పించారు. కనుక పాత నిష్పత్తి ఫార్ములా చెల్లుబాటు కాదు. ఇదేగాక మరో సమస్య కూడా వుంది. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించినప్పుడు వారికి రిజర్వు చేసిన మూడో వంతు స్థానాలను అదనంగా కలపాలని తీర్మానించారు. కనుక ఈ రెండు కోణాల్లోనూ సీట్ల సంఖ్య పెంచడమనేది కూడా కీలకాంశంగా వుంటుంది. దీనికి సహేతుకమైన పరిష్కారం కావాలంటే జనాభా దామాషాతో పాటు ఇతర ప్రోత్సాహక సూచికలు కూడా నిర్ణయించాలి. జనాభా ఎక్కువగా వుండటానికి చారిత్రిక కారణాలున్నాయి గనక ఆ ప్రాతిపదికన ఉత్తరాదికి తగ్గించడం సరికాదని ఆ పార్టీని బలపర్చేవారు వాదిస్తున్నారు. ఉత్తరాది నుంచి శ్రామికులు వచ్చి చౌకగా పనిచేయడం వల్లనే తమిళనాడు సంపద పెరిగిందని కూడా వారు వితండ వాదన చేస్తున్నారు. ఇప్పటికే స్వంత మెజార్టీ కోల్పోయిన బిజెపి రేపు మరింత తగ్గిపోకుండా ఉత్తరాది రాజకీయం నడుపుతున్నదా అని రాజకీయ పరిశీలకులు సందేహిస్తున్నారు. భారతదేశ సమైక్యత, సమతుల్యతను కాపాడుకోవడం రాష్ట్రాల హక్కులను సమాఖ్య రాజ్యాంగానుసారం కాపాడటం ఇందులో దాగి వున్నాయి. సీట్లు పైనే పెంచి దక్షిణాదికి గొర్రె తోకగా వుంచేట్టయితే అప్పుడు సమైక్యతా భావనకే విఘాతం కలుగుతుంది. విధాన నిర్ణయాలలోనూ సమతుల్యత దెబ్బ తింటుంది. ఇంకా మహిళల రిజర్వేషన్ కోసం సీట్ల పెంపు, లేదంటే జనాభా ప్రకారం పెంపు వంటి చర్యలు చేపడితే మరింత పకడ్బందీగా అడుగులు వేయవలసి వుంటుంది. దేశమంతటా ఒక ప్రధాన చర్చగా మారిన ఈ అంశంపై కేంద్రం విజ్ఞతతో నిర్ణయం తీసుకుని దేశ సమైక్యతను సమాఖ్య సూత్రాలనూ కాపాడవలసి వుంటుంది. లేకపోతే ఇది పెద్ద పోరాటంగా మారడం అనివార్యమే అవుతుంది.

# తమిళనాట హిందీ పేర్లు తొలగించండి

### ఎక్స్ వేదికగా సిఎం స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు

చెన్నై : కేంద్రం, తమిళనాడు రాష్ట్రాల మధ్య జాతీయ విద్యా విధానం అమలు విషయంలో నెలకొన్న వివాదం కొనసాగుతూనే ఉంది. త్రిభాషా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మరోసారి కేంద్రంపై విరుచుకుపడ్డారు. తమిళనాడులోని అన్ని కేంద్ర కార్యాలయాల నుంచి హిందీని తొలగించాలన్నారు. తమిళంపై ప్రేమ ఉంటే.. చేతల్లో చూపించాలన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. 'ప్రధాని నరేంద్ర మోదీకి తమిళం అంటే అపారమైన ప్రేమ అని భాజపా చెబుతోంది. అదే నిజమైతే.. దాన్ని ఆయన చేతల్లో ఎందుకు చూపించడం లేదు..?. పార్లమెంటులో సెంగోల్‌ను ఏర్పాటుచేయడం కంటే.. రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి హిందీని తొలగిస్తే బాగుంటుంది. హిందీకి బదులుగా తమిళాన్ని అధికార భాషగా చేసి.. మరిన్ని నిధులు కేటాయించండి. కేంద్ర బ్జడెట్‌లో తిరుక్కురల్‌ను ఉటంకిస్తే సరిపోదు. రాష్ట్రానికి ప్రత్యేక పథకాలు, సత్వర విపత్తు సహాయ నిధి, కొత్త రైల్వే ప్రాజెక్టులను అందించాలి. రైళ్లకు అంత్యోదయ, తేజస్, వందేభారత్ వంటి పేర్లు పెట్టడం ఆపండి. దానికి బదులు తమిళ పేర్లను పెట్టండి. తమిళ భాషపై ప్రేమను మాటల్లో కాకుండా.. చేతల్లో చూపించండి' అని స్టాలిన్ పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై జరిగిన అఖిలపక్ష సమావేశంలో స్టాలిన్ మాట్లాడారు. 1971 జనాభాల లెక్కల ఆధారంగానే విభజన పక్రియ చేపట్టాలని ప్రధాని మోదీని స్టాలిన్ అభ్యర్థించారు. ప్రస్తుత జనాభా ప్రకారం.. పార్లమెంటులో తాము 12 సీట్లు కోల్పోయి.. 10 సీట్లు మాత్రమే వస్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇది తమిళ రాజకీయాలపై ప్రత్యక్షంగా దాడి చేయడమేనన్నారు. ఈ చర్య రాష్ట్ర గొంతును నొక్కేస్తుందన్నారు. తాము విభజనకు వ్యతిరేకం కాదని.. కానీ, గత 50 ఏళ్లుగా సామాజిక, ఆర్థిక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన తమకు ఇది శిక్ష కాకూడదన్నారు. ఈ సందర్భంగా 2026 జనాభా లెక్కల ఆధారంగా విభజన పక్రియ చేపట్టరాదని అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది.



# పోలీసుల ఔదార్యం



### ఇంటర్ విద్యార్థిని సకాలంలో పరీక్షా సెంటర్ తీసుకెళ్లిన సీఐ,ఎస్ఐ


జనగామ : ఖాకీలంటే కాఠిన్యమే కాదు, కరుణను సైతం పంచుతారనే ఉదంతం జనగామలో చోటు చేసుకుంది. పోలీసులు సకాలంలో విద్యార్థినిని పరీక్ష కేంద్రానికి చేర్చి శభాష్ అనిపించుకున్నారు. ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు హాజరు కావాల్సిన ఓ విద్యార్థిని జనగామ అర్బన్ పోలీసులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేర్చి తమ ఔన్నత్యాన్ని చాటుకున్నారు. సునీత అనే ఫస్టియర్ విద్యార్థిని పొరపాటున తను పరీక్ష రాయాల్సిన సెంటర్‌కు బదులు మరొక సెంటర్‌కు వెళ్లింది. ఈ క్రమంలో ప్రెస్టన్ కాలేజీ వద్ద విద్యార్థిని సునీత కంగారు పడుతున్న తీరును గమనించిన సీఐ దామోదర్ రెడ్డి, ఎస్ఐ చెన్నకేశవులు సదరు విద్యార్థినిని సకాలంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీ సెంటర్‌కు పోలీసు వాహనంలో చేర్చారు. పోలీసులు స్పందించిన తీరుపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. కాగా, ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొత్తం మూడు గంటలపాటు పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులను కాస్త ముందుగానే సెంటర్‌లోకి అనుమతిస్తారు. విద్యార్థులు ఉదయం 8:45 గంటలలోపు సెంటర్‌లో ప్రవేశించడం ఉత్తమమని అధికారులు సూచించారు. ఆలస్యంగా వచ్చే వారిని అంటే 9:05 గంటల తర్వాత వచ్చే వారిని అస్సలు అనుమతించరు. బుధవారం ఫస్టియర్ విద్యార్థులకు రెండోభాష పేపర్–1కు పరీక్ష నిర్వహిస్తారు. గురువారం సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,532 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫస్టియర్‌లో 4,88,448 విద్యార్థులు, సెకండియర్‌లో 5,08,523 విద్యార్థుల చొప్పున 9,96,971 విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. వీరిలో గతంలో ఫెయిలైన 67,735 మంది విద్యార్థులు కూడా పరీక్షలకు హాజరుకాబోతున్నారు. పరీక్షల కోసం 29,992 మంది ఇన్విజిలెటర్లు, 72 మంది ఫ్లయింగ్‌స్కాడ్, 124 సిట్టింగ్ స్కాడ్‌లకు విధులు కేటాయించారు. ఇంటర్‌బోర్డు అబ్జర్వర్లను (పరిశీలకులు) సైతం రంగంలోకి దించనున్నది.

# తగ్గుతున్న రాత్రిపూట ఉష్ణోగ్రతలు

హైదరాబాద్ : రాబోయే రెండు రోజులు తెలంగాణలో రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోనున్నట్లు వాతావరణశాఖ నిపుణుడు టీ బాలాజీ తన ఎక్స్ అకౌంట్‌లో తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రజలకు కొంత ఉపశమనం లభించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల, పెద్దపల్లి, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాలు కాస్త కూల్‌గా మారనున్నాయి. ఆ జిల్లాల్లో రాత్రి పూట ఉష్ణోగ్రతలు తగ్గనున్నట్లు పేర్కొన్నారు. రాత్రితో పాటు తెల్లవారుజామున కూడా టెంపరేచర్లు కూల్‌గా ఉంటాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం వేళ యధావిధిగా ఉష్ణోగ్రతలు ఉంటాయన్నారు. కొంత వరకు హీట్ నుంచి రిలీఫ్ ఉంటుందన్నారు. హైదరాబాద్ నగర ప్రజలకు కూడా కొంత గుడ్‌న్యూస్ చెప్పారు. ఇవాళ్టి రాత్రి నుంచి హైదరాబాద్‌లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గనున్నట్లు తెలిపారు. అయితే నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో హీట్ ఉన్నా.. ఉదయం పూట మాత్రం టెంపరేచర్లు తగ్గనున్నట్లు వెల్లడించారు. ఇక నగర శివార ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పడిపోనున్నట్లు చెప్పారు.

# భక్తులకు అండగా పరమాత్ముడు!

తిరుమల : భగవంతుడు ఎల్లవేళలా తనయందు భక్తి కలిగిన వారికి ఏదో రూపంలో అండగా ఉంటూనే ఉంటారు. శరణాగతి కోరుకుంటే అభయం ఇస్తుంటాడు. భక్తితో తనను శరుణు వేడుకున్న వారికి అండగా ఉంటానని మన పురాణాలు, ఉపనిశత్తులు చెబుతున్నాయి. పురాణాలు, ఇతిహాసాల్లో ప్రహ్లాదాదులంతా ఇలాగే భక్తిని చాటారు. భగవంతుడు వారికి అండగా నిలిచాడు. అంటే భక్తికి భగవంతుడు వశమవుతాడన్నది సత్యం. ప్రతిఫలాపేక్ష లేకుండా తనను కొలువుమని గీతాచార్యుడు చెప్పాడు. ఆధునిక కాలంలోనూ ఇదే పద్ధి కొనసాగుతోంది. గుడికి వెళ్లడం భక్తితో చేయాలని అంటారు. భగవంతుని మీద పరిపూర్ణమయైన ప్రేమ కలిగి ఉండడమే భక్తి. అది అమృతానంద స్వరూపం. త్యాగరూపం మైనది అయి ఏ కోర్కెలూ లేని స్థితిలో ఉండాలి. అదే మోక్ష అని నారద భక్తి సూత్రాలు చెబుతున్నాయి. భగవద్గీతలోని 'భక్తియోగం' భక్తి తత్త్వాన్నీ, లక్షణాల్నీ విపులంగా తెలిపింది. శ్రీమద్భాగవతం భగవద్భక్తుల లక్షణాలను, భక్తి స్వరూపాన్నీ సవిస్తరంగా ఆవిష్కరించింది. మానవునికి క్రోధం, శోకం లాంటి ఎన్నెన్నో అనుభూతులు ఉన్నా ప్రేమ లాంటి మధురమైన అనుభూతి మరేదీ లేదు! ప్రేమ పొందడం కన్నా ప్రేమించడం ఇంకా మధురం. మానవునికి స్వతహాగా ప్రేమించే లక్షణం ఉన్నా... ఆ ప్రేమ ఒక వ్యక్తికో, ఒక వస్తువుకో మాత్రమే పరిమితమవుతుంది. అప్పుడప్పుడు మాత్రమే కనిపిస్తూ, స్వార్థభావంతో కలుషితమౌతూ, విచ్ఛిన్నమైపోతూ ఉంటుంది. దీనినుంచి బయటపడి ప్రేమతత్వాన్ని అలవర్చుకుంటే భగవంతుడు వశమవుతాడని పురాణాలు చెబుతున్నాయి. నిష్కామంగా ప్రేమించడాన్ని సాధన చెయ్యాలి. ఈ జగత్తులో భగవంతుడు సర్వవ్యాప్తి. సమష్టి రూపమైన భగవంతుని పట్ల... సాధకులు చేసే 'నిష్కామప్రేమ' అనే ఈ ఉపాసనాక్రమానికి కూడా 'భక్తి' అనేదే వ్యవహార నామం. భక్తి సార్వజనీనం, భేదరహితం కావడంవల్ల నిజమైన భక్తిలో లోపాలు ఉండవు. అనంతమైన భగవత్తత్వానికి అనంతమైన కళ్యాణ గుణాలు, రూపాలు, నామాలు ఉన్నాయి! వాటిలో రాముడు, కృష్ణుడు, శివుడు, లలిత తదితర సంపూర్ణ దేవతామూర్తుల్ని ఉపాసనా సౌలభ్యం కోసం వేద, పురాణాలు మనకు అందించాయి.



ఆధ్యాత్మికం

## ప్రముఖ గాయని కల్పనను ఆసుపత్రిలో పరామర్శించిన కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు



**కూకట్ పల్లి మార్చ్ 05 (ది క్రైమ్ న్యూస్):** ప్రముఖ గాయని కల్పన ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసి, హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ రావు స్థానిక హెూలిస్టిక్ ఆసుపత్రి సీఈఓ డాక్టర్ సుబ్బారావు తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గాయని కల్పన ఇలాంటి కఠిన నిర్ణయం తీసుకోవడం బాధాకరమని, ఆమె త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆమెకు ప్రభుత్వం తరఫున, తన తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు, కల్పన ప్రస్తుతం వైద్యుల సమాచారం ప్రకారం ఆమె ఆరోగ్య పరిస్థితి కుదుట పడుతుందని, రెండు రోజుల్లో ఆమె మరింతగా కోలుకుంటుందనీ, ఆమెకు మెరుగైన వైద్యం అందిస్తున్నారని కార్పొరేటర్ తెలిపారు.

# మాదిగ ఎమ్మెల్యేలకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలి

**- చంద్రమౌళి మాదిగ, మంతెన చిరంజీవి మాదిగ**



**భూపాలపల్లి, మార్చి, 5 (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎమ్మార్పిఎస్, ఎమ్మెస్పీ పార్టీ ఇంచార్జి అంబాల చంద్రమౌళి మాదిగ, కాటారం ఎమ్మార్పిఎస్ మండల అధ్యక్షుడు మంతెన చిరంజీవి మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లో ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలో మహా ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణ ను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు.జస్టిస్ షమీన్ అక్తర్ గారు ఇచ్చిన నివేదికలో ఉన్న లోపాలను సవరించి ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. అలాగే వర్గీకరణ అనేది మూడు గ్రూపులుగా కాకుండా, నాలుగు (ఏ బి సి డి)లు గా వర్గీకరించాలని లేని పక్షం తిరుగుబాటు తప్పదని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో కాటారం మండల ఎమ్మార్పిఎస్ గౌరవ అధ్యక్షులు చిట్యాల సమ్మయ్య మాదిగ, ఎమ్మార్పిస్ మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ గద్దల మహేష్ మాదిగ, ఎమ్మార్పిఎస్ సీనియర్ నాయకులు ఆతుకూరి బాలరాజు మాదిగ పాల్గొన్నారు.

## రామగుండం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సిపి





**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** రామగుండం పోలీస్ స్టేషన్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సిపి పోలీస్ స్టేషన్ పరిసరాలు, పోలీస్ స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలు, శాంతి భద్రతల గురించి పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# ఎస్టీ క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు సమర్పించాలి

**- జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి డి.జనార్ధన్**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఎస్టీ క్రీడా పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలకు ఆసక్తి కలిగిన గిరిజన విద్యార్థిని విద్యార్థులు దరఖాస్తులు సమర్పించాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి డి.జనార్ధన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటర్ స్పోర్ట్స్ అకాడమీ బోయినపల్లి, మోడల్ స్పోర్ట్స్ పాఠశాల జాతర్ల, కిన్నెరసాని బాలుర పాఠశాల, ఉట్నూరు బాలుర పాఠశాల, కొత్తగూడెం బాలుర పాఠశాల, ఆసిఫాబాద్ బాలికల పాఠశాల, కాచినపల్లి బాలికల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఐదవ తరగతిలో ప్రవేశాల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు.విద్యార్థులకు ఆగస్టు 31 2025 నాటికి 90 నుంచి 11 సంవత్సరాల లోపు వయసు ఉండాలని, ఎంపిక జిల్లా స్థాయి కమిటీ ద్వారా దేహ దారుఢ్య పరీక్షలనంతరం చేయబడుతుందని అన్నారు ఆసక్తి , అర్హత గల గిరిజన బాలబాలికలు తమ దరఖాస్తులను జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కరీంనగర్ కార్యాలయంలో పని వేళలో సమర్పించాలని, ఇతర వివరాలకు 8686451313 నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి పేర్కొన్నారు.

# ఇంటర్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు

**• పరీక్ష కేంద్రాలను పరిశీలించిన రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్**



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షా కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ 2023 అమలు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. బుధవారం గోదావరిఖనిలోని బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల, రామగుండంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష కేంద్రాలను పరిశీలించి, పరీక్షలు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులకు సిబ్బందికి పటిష్టమైన బందోబస్తు గురించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ పరీక్షలు జరిగే సమయంలో సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు పేపరు వచ్చేటప్పుడు, పరీక్ష అనంతరం జవాబు పత్రాలు తీసుకొని వెళ్లేటప్పుడు తప్పకుండా ఎస్కార్ట్ ఉండాలని సూచించారు. పరీక్షలు జరిగే సమయంలో అధికారులు పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్లు ఇంద్రసేన రెడ్డి, రవీందర్‌లు, రామగుండం సిఐ ఓ.ప్రవీణ్ కుమార్, రామగుండం ఎస్ఐ సంధ్య రాణి, సిసి హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

# పిఠాపురం జనసేన ఆవిర్భావ వేడుకులను విజయవంతం చేయాలి

**• తెలంగాణ రాష్ట్ర నాయకులు**





**కూకట్ పల్లి మార్చ్ 05 (ది క్రైమ్ న్యూస్):** పిఠాపురంలో ఈనెల 14 న తేదీన జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సంబంధించి తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుండి జిల్లాల నాయకులు, నియోజకవర్గం నేతలు, పార్టీ కార్యకర్తలు తరలి రావాలని తెలంగాణద రాష్ట్ర అధ్యక్షుడు నేమూరి శంకర్ గౌడ్ కోరారు. దీనిలో భాగంగా మంగళవారం సాయంత్రం కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ఆధ్వర్యంలో కూకట్ పల్లి లోని వైష్ణవి గ్రాండ్ హెూటల్ లో నిర్వహించిన సమావేశంలో పాల్గొనీ పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఈనెల14వ తేదీన జనసేన నేతలు భారీ ఎత్తున తరలివచ్చి ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని కోరారు. పవన్ కళ్యాణ్ డిప్యూటీ చీఫ్ మినిస్టర్ హెూదాలో మొట్టమొదటిసారిగా జరుగుతున్న పార్టీ ఆవిర్భావ సభ ఇది అని, చిత్రాడ సభ వేదికగా పార్టీకి సంబంధించిన పలు అంశాలను అధినేత పవన్ కళ్యాణ్ వెల్లడిస్తారని ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సైతం పార్టీని బలోపేతం చేసేందుకు పవన్ కళ్యాణ్ సూచనలు చేయనున్నారని, వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు నాయకులు సైతం సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాధారం రాజలింగం, ప్రచార కమిటీ కన్వీనర్ సాగర్, రాంతాలూరి, వీర మహిళ అధ్యక్షురాలు కావ్య మండపాక, శిరీష వివిధ జిల్లాల కోఆర్డినేటర్స్, గ్రేటర్ హైదరాబాద్ నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

# కొత్త గనులకు మోక్షం ఎప్పుడు? ఉన్న గనులు మూతపడుతున్నాయి

**• పాలకుల మాటలు నీళ్ల మూటలేనా • టి ఎస్ యు ఎస్ కార్మిక సంఘం అధ్యక్షులు కామెర గట్టయ్య**




**భూపాలపల్లి, మార్చి 5:(ది క్రైమ్ న్యూస్):** బాతాల రాజన్న భవన్ తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో టి ఎస్ యు ఎస్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామెర గట్టయ్య మాట్లాడుతూ సింగరేణిలో మూతపడనున్న నాలుగు అండర్ గ్రౌండ్ గనులు ప్రస్తుతానికి 34,బొగ్గు బ్లాకుల్లో 18, భూగర్భగనులు 16, ఓపెన్ కాస్ట్ గనులు ఉన్నాయి ఈ ఏడాది నాలుగు భూగర్భ ఒక ఉపరితల గనిమూత పడనున్నాయి సింగరేణిలో 2037 సం.నాటికి మూతబడును 21 గనులు సింగరేణిలో మూతబడుతున్న బొగ్గు గనులు రాబోయే 17 ఏళ్లలో సింగరేణి భూగర్భ గనుల సంఖ్య 19 కి తగ్గిపోయే అవకాశం ఉంది. తెలంగాణ ఉద్యమ సమయంలో గత పాలకులు రాష్ట్ర ఆకాంక్ష నెరవేరిన అనంతరం ఉత్తర తెలంగాణకు కొంగుబంగారమైన సింగరేణి సంస్థను కాపాడుకుంటాం సీమాంధ్ర పాలకుల కబంధ అస్త్రాల నుండి కాపాడుకుంటాం నూతన అండర్ గ్రౌండ్ గానులు తవ్వి రెండు లక్షల నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రభాహేల్ పలికారు రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు కావలసినప్పటికీ టిఆర్ఎస్ ప్రభుత్వంలో సింగరేణిలో ఒక్క నూతన గని కూడా తవ్వలే కాంగ్రెస్ పార్టీ నాయకులు మొన్న జరిగిన అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికలలో గత ప్రభుత్వం కార్మికుల హక్కులను కాల రాసింది సింగరేణిలో నూతన గనులు రావాలంటే కార్మిక హక్కులు అమలు కావాలంటే సింగరేణి కార్మిక వర్గం కాంగ్రెస్కు ఓటు వేసి గెలిపించండి సింగరేణికి పూర్వ వైభవం తీసుకొస్తామని మొసలి కన్నీరు కార్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలల కాలంగడుస్తుంది ఇప్పటివరకు కార్మికులకు వారిచ్చిన అమీలు ఏ ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదు.2014 నాటికి కార్మికుల సంఖ్య 63 వేల పైచిలుకు ఉండే ప్రస్తుతం వారి సంఖ్య 42 వేలకు పడిపోయింది. 48 గనులు ఉండే ప్రస్తుతానికి 36 గనులు నడుస్తున్నాయి. దాదాపు 12 గనులు మూతపడ్డాయి. 2000, సం.లో ఎన్నికల ప్రక్రియ తీసుకొచ్చి కార్మిక సంఘాల ఐక్యతను దెబ్బ కొట్టి కార్మిక పోరాట స్ఫూర్తిని నీరు కర్చారు సింగరేణిలో అనేక పోరాటాలు త్యాగాలు చేసి సాధించుకున్న అనేక హక్కులను సింగరేణిలో గుర్తింపు కబడ్డ సంఘాలు తమ ఆర్థిక ప్రయోజనాల కోసం కంపెనీకి తాకట్టు పెట్టి కోట్ల రూపాయలు కూడా పెట్టుకుంటున్నారు. సింగరేణి పరిరక్షించుకోవాలి కార్మిక హక్కులు కాపాడుకోవాలంటే సింగరేణిలో ప్రత్యేక ఐక్య పోరాటాలు అవసరమని ఆ పోరాటాలకు కార్మిక సంఘాలు కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని గట్టయ్య మాట్లాడారు.ఈ కార్యక్రమంలో టి ఎస్ యు ఎస్ కార్మిక సంఘం నాయకులు దాసరి జనార్ధన్, కాసర్ల ప్రసాదరెడ్డి, నామల శ్రీనివాస్, రాళ్ల బండి బాబు, ఈ రెంటి శ్రీధర్, జయశంకర్, ఎండి సాజిత్, నరసింహారెడ్డి, సలీం, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మినరసింహ స్వామీ ఉత్సవాలు ప్రారంభం



**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** రామగుండం కార్పొరేషన్ పరిధి న్యూ మారేడుపాక లోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం నుండి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి భజన, సప్తాహయాగం లతో ప్రారంభమైన ఉత్సవాలు ప్రతీరోజూ ప్రత్యేక పూజలు, భజన, హెూమాలు ఈ నెల 10వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. 11న సాయంత్రం 6 గంటలకు గోధూళి శు భ ముహూర్తమున స్వామివారి కళ్యాణ మహెూత్సవం జరుగుతుందని, ఈ మహెూత్సవంలో భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారి కృపనుపొందాలనిఆలయ కమిటీ సభ్యులు భక్త జనులకు కోరారు.

## ఇంటర్ మొదటి రోజు పరీక్ష ప్రశాంతం

**- ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన**

**- ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు /ఉర్దూ/హిందీ పరీక్షకు (96%) మంది విద్యార్థులు హాజరు**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మొదటి రోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు.మొదటి రోజు ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ భాష పరీక్షలు జరిగాయని, ఈ పరీక్షకు (5341) మంది హాజరు కావాల్సి ఉండగా, (5154)మంది హాజరు కాగా, (187) మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, తొలి రోజు 96 శాతం హాజరు నమోదు కావడం జరిగిందని, మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి కల్పన తెలిపారు.

# కాంగ్రెస్ సర్కార్‌తో పేద ప్రజల సొంతింటి కళ నేరవేరబోతుంది..

- పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- లబ్ధిదారులు ఎవరు దళారులకు డబ్బులు ఇచ్చి మోసపోకూడదు
- నియోజకవర్గానికి నాలుగు సంవత్సరాలల్లో 14 వేల ఇండ్లు
- అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇండ్లు
- కాంగ్రెస్ సర్కార్‌లో దళారి వ్యవస్థకు తావు లేదు
- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు







**పెద్దపల్లి, మార్చి 05 ( ది క్రైమ్ న్యూస్ ):** ఓదెల మండలంలోని శానగొండ గ్రామంలో బుధవారం రోజున ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోసి భూమి పూజ చేసి స్థానిక నాయకులతో కలిసి ఇండ్ల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు.అనంతరం ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి ప్రతి మండలంలోని ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని దాని కింద ఆ గ్రామానికి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతుంది అన్నారు. అందులో భాగంగా మొదటి విడుతగా ఓదెల మండలంలోని శానగొండ గ్రామాన్ని ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోసి పేద ప్రజల సొంతింటి కళ నెరవేర్చడానికి శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు. ఈ గ్రామంతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు ఇందిరమ్మ ఇండ్లతో పాటు సంక్షేమ పథకాలు కూడా అందుతున్నాయి అన్నారు. మన పెద్దపల్లి నియోజకవర్గంలో సంవత్సరానికి 3500 ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. నాలుగు సంవత్సరాలకు ఒక్కో సంవత్సరానికి 3500 చొప్పున 14వేల ఇండ్లు ఈ నియోజకవర్గనికి మంజూరు చేసే అవకాశం ఉందని అలాగే ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఐదు లక్షలు ఇచ్చి ఇల్లు కట్టిస్తుందన్నారు. గతంలో వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో 2004 నుంచి 2014 వరకు ఇల్లు లేని ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇచ్చింది అన్నారు. బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పది సంవత్సరాలు పాలన చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఇంతవరకు ఈ రాష్ట్రంలో ఏ ఒక్కరి కూడా ఇల్లు ఇవ్వలేదు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ ఇందిరమ్మ ఇల్లు ఇల్లు లేని వారికి ఇవ్వడం జరుగుతుంది అన్నారు. గతంలో కట్టిన ఇండ్లకు గాని ఎలాంటి బిల్లులు ప్రభుత్వం ఇవ్వదని, ఎలాంటి పైరవీలకు తావు లేకుండా కొత్తగా కట్టిన ఇండ్లను యాప్ ద్వారా ప్రభుత్వం పరిశీలించి ఇంటికి దశల వారీగా మొత్తం ఐదు లక్షలు ప్రభుత్వం ఇస్తుంది అన్నారు. కొత్తగా ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే వారు ఎవరైనా మిమ్ములను ఎవరైనా డబ్బులు అడుగుతే నాకు నేరుగా ఫోన్ చేయాలని ఎవరికి కూడా ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వకూడదని ఎమ్మెల్యే పకడ్బందీగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఓదెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మూలప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి,డైరెక్టర్ బొంగోని శ్రీనివాస్, నీర్ల శ్రీనివాస్, అక్కం రమేష్, రంగు శంకర్, చొక్కారావు, సమ్మి రెడ్డి, అరెల్లి శివాజీ గౌడ్,అశోక్,నంద్రా తిరుపతి, జీల తిరుపతి, ఐలయ్య, కుమార్,రెడ్డి రజినీకాంత్ మరియు మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీలు మరియు ప్రజాప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# టీజీడబ్ల్యూసి చొరవతో గల్ఫ్ నుండి మృతదేహం స్వదేశానికి రాక


**లక్షెట్టిపేట, మార్చి05, ( ది క్రైమ్ న్యూస్):** మండలంలోని హనుమంతుపల్లె గ్రామవాసి విధి నిర్వహణలో భాగంగా ఓమన్ దేశంలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు భవనం పై నుండి కింద పడి మృతి చెందిన గుమ్ముల కొమరయ్య (48) మృతదేహన్ని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో స్వదేశానికి తీసుకువస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి జన్నారం మండల అధ్యక్షులు మగ్గిడి తిరుపతి స్పందించి డెడ్ బాడీని తొందరగా స్వదేశానికి పంపించేలాగా కృషి చేయాలని మాజీ మండల అధ్యక్షులు పాలాజీ శ్రీనివాస్ (ఒమన్)గారికి తెలియపరచగా ఆయన వెంటనే ఇండియన్ కౌన్సిలేట్, ఒమన్ పోలీస్, కంపెనీ యాజమాన్యం తో సమన్వయం చేసి మృతుని కుటుంబానికి రావాల్సిన నిధులు, డెడ్ బాడీ రాకముందే అందేలా ప్రత్యేక చొరవ చూపారని నాయకులు తెలిపారు. కేవలం ఆరు రోజుల్లోనే డెడ్ బాడీ స్వదేశానికి పంపే ప్రక్రియ పూర్తిచేసినా శ్రీనివాస్ కు మండల అధ్యక్షులు మగ్గిడి తిరుపతి, వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమయ్యలకు మృతుని కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. హైదరాబాదు విమానాశ్రయం నుండి మృతుని ఇంటి వరకు ప్రభుత్వ ఉచిత అంబులెన్స్ సౌకర్యాన్ని మంద భీమ్ రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. మృతదేహం స్వదేశానికి తరలించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా మృతుని కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మగ్గిడి తిరుపతి మాట్లాడుతూ గల్ఫ్ లో చనిపోయిన కార్మికులను స్వదేశానికి తెప్పియడానికి మా సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. మా వంతుగా మేము సహాయం చేస్తున్నామని ప్రభుత్వం నుండి మాకు కొంతవరకు సహాయం అందిన ఇంకా అందవలసినది చాలా ఉందన్నారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా కొంతమందికి మాత్రమే అందిందని మిగతా వారికి కూడా తొందరగా అందజేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. గల్ఫ్ బోర్డు ప్రకటన ఆలస్యం చేస్తే మళ్లీ ఉద్యమించక తప్పదన్నారు. ఈ ప్రక్రియను ఇంత వేగవంతంగా పూర్తి చేసిన టీ జీ డబ్ల్యూ డబ్ల్యూ సీ సంస్థ గౌరవ వ్యవస్థాపకులను కమిటీ సభ్యులను దీనికి సహకరించిన ప్రతి ఒక్కరిని గ్రామస్తులు అభినందించారు.



తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి తరపున గుమ్ముల కొమరయ్యకు నివాళులు అర్పిస్తూ, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# స్వామి వారి కళ్యాణోత్సవం స్థల వేదిక మార్పు మళ్ళీ పునఃరాలోచన చేయాలి

**- పట్టణ బీజేపీ అధ్యక్షుడు భాస్కర్**



**ధర్మపురి, మార్చి 5, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి బ్రహ్మోత్సవాల్లో స్వామి వారి కళ్యాణోత్సవము స్థల వేదిక మార్పు పునఃరాలోచన చేయాలని ధర్మపురి పట్టణ బీజేపీ అధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జరగబోయే శ్రీ స్వామి వారి కళ్యాణోత్సవమూ స్థల వేదిక మార్పు గురించి రెండు రోజుల క్రితం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగిందని బుధవారం భాస్కర్ తెలిపారు. కానీ మా పార్టీ నుంచి వినతిపత్రం ఇచ్చినా కూడా పట్టించుకోకుండా మళ్ళీ మేము ఏదైతే స్థలం మార్పిడి పై పునఃరాలోచన చేయాలని డిమాండ్ చేశామో దాన్ని లెక్కచేయకుండా మళ్లీ అదే స్థలం లో పనులు ప్రారంభిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయం తెలుసుకొని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో దేవస్థానం ముందర పార్టీ శ్రేణులతో కలిసి ఆందోళన కార్యక్రమం చేయడం జరిగిందని భాస్కర్ వివరించారు. మా నిరసనకు దేవస్థానం ఈవో వచ్చి సానుకూలంగా స్పందించి మళ్లీ స్వామి వారి కళ్యాణోత్సవము స్థల వేదిక మార్పు అందరితో చర్చించి పునఃరాలోచన చేద్దామని హామీ ఇచ్చినట్లు పట్టణాధ్యక్షుడు భాస్కర్ పేర్కొన్నారు. అనంతరం మీడియా కు తెలిపిన వివరాల ప్రకారం ఏ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లో ఉన్న ఆ రాష్ట్రంలో హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగానే ప్రవర్తిస్తారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం హిందూ పండుగలు, హిందువు భక్తుల మనోభావాలను ఆలోచించకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరికాదని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలా భక్తుల మనోభావాలు దెబ్బతీసే కార్యక్రమాలు మానుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ హిందూ వ్యతిరేకి ప్రభుత్వమని ప్రజలు గుర్తించే రోజు తప్పక వస్తుందని ఆయన తెలిపారు. ఏదైతే స్వామి వారి కళ్యాణం కు సంబంధించిన స్థలం ఉందో అది కూడా పశువుల ఎముకలతో, డైపర్లతో, మురికి నీళ్లతో దుర్వాసనతో కలిగి ఉన్న స్థలంలో ఏ విధంగా మీరు స్వామి వారి కళ్యాణం చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, బెజ్జారపు లవన్ కుమార్, కస్తూరి మురళి, తిరుమందాస్ సత్యనారాయణ, రాయల రవికుమార్ షిండే, సంఘీ మాధవ్, మండలజీ సూరజ్, ఆనందాస్ నవీన్, బాకీ అనిల్, ఆప్పం మల్లేష్, అప్పం శ్రీనివాస్, వెలగందులో ప్రణీత్, సుంకు మధుసూదన్, బాకీ అనిల్, గుండి రాజేశ్వర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**- కాంట్రాక్ట్ కార్మిక నేత తిరుపతి డిమాండ్**



**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి రామగుండం మూడవ డివిజన్ ఓసీపీ.1 ప్రాజెక్టు కోల్ హ్యాండ్లింగ్ ప్లాంటులో బుధవారం బెల్ట్ క్లీనింగ్ పనులు చేస్తున్న కాంటాక్ట్ కార్మికుల సమావేశం జరిగింది. సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకత్వంలో ఉదయం జరిగిన ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బుర్ర తిరుపతి పాల్గొని మాట్లాడుతూ.. సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, జీవో నెంబర్ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని అన్నారు. ఒకరోజు విధులకు హాజరు కాకపోతే పెనాల్టీ విధించే ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని, బెల్ట్ క్లీనింగ్ కార్మికులకు సెమి స్కిల్ వేతనాలు చెల్లించాలని, షిఫ్ట్ సమయాన్ని ఏడు గంటలకు మార్చాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు రెండు జతల బట్టలు, సేఫ్టీ కి సంబంధించిన పనిముట్లను ఇవ్వాలని కోరారు. కార్మికులపై కక్ష చర్యలు మానుకోవాలని సింగరేణి యాజమాన్యానికి డిమాండ్ చేశారు. లేనియెడల సింగరేణి వ్యాప్తంగా కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి, ప్రత్యక్ష పోరాటాలను చేపడతామని హెచ్చరించారు. అందుకు కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు శంకర్ గౌడ్, తిరుపతి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరం పై పోత్కపల్లి పోలీసులు దాడి

**- పేకాట ఆడుతున్న ఏడుగురు అరెస్ట్**



**పెద్దపల్లి, మార్చి 5 ( ది క్రైమ్ న్యూస్ ):** పోత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కనగర్థి గ్రామ శివారు పరిసర ప్రాంతం లో కొంతమంది వ్యక్తులు కలసి పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం పై పోత్క పల్లి పోలీసులు బుధవారం పేకాట స్థావరంపై దాడి చేసి పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురు మందిని ని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 4400/- రూపాయలు, 06 మొబైల్ ఫోన్లు మరియు పేక పత్తులు స్వాధీనం చేసుకున్నారు. వారి పై కేసు నమోదు చేసున్నట్లు ఎస్ ఐ తెలిపారు. పట్టుబడిన వారి వివరాలు 1. రాధండి శంకరయ్య, 2. చేరుకుతోట శ్రీనివాస్, 3. ఇట్యాల కనుకయ్య, 4.వడ్లకుంట రాజు, 5. యం డి సంధాని, 6. పెండెం వెంకయ్య, 7.దున్నపోతుల అనిల్ ఈ సందర్భంగా పోత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్ మాట్లాడుతూగ్రామాలలో పేకాట, కోడి పందాలు ఆన్లైన్ బెట్టింగులు, క్రికెట్ బెట్టింగ్, బహిరంగ ప్రదేశంలో జూదం,మరే ఇతర చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే లేదా ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటు సమాచారం ఉంటే వెంటనే పోత్కపల్లి ఎస్ఐ నెంబర్ 8712656514, కు సమాచారం అందించాలని సూచించారు.చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన ఎంతటి వారినైనా చట్టప్రకారం శిక్షించడం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించినారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమం లో ఏ ఎస్ ఐ రత్నాకర్ హెడ్ కానిస్టేబుల్ కిషన్ కానిస్టేబుల్స్ అశోక్ రమేష్ లు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** ఇనుగుర్తి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నముప్పారంలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం వేడుకలు నిర్వహించడం జరిగింది. ప్రధానోపాధ్యాయులుగా ఎల్లబోయిన ముకేశ్ చరణ్, డీఈఓ గా కొత్తపల్లి చరణ్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులుగా శ్రీజ, అక్షర, శృతి,తేజశ్రీ, ప్రవీణ్, రాజు, కైలాష్, శివచరణ్, విగ్నేష్,శంకర్, అరుణ్,చరణ్ మొదలగు వారు పాల్గొని సహచర విద్యార్థినీ, విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఉత్తమ బోధన చేసిన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు బహుమతులను ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బయ్యా రవీందర్ , ఆడెపు రమేష్, జంజిరాల నాగరాజు, పీ.ఎం.ప్రమోద్ కుమార్, ఇల్లందుల శ్రీనివాస్, మహమ్మద్ తారీఖ్ ఖాన్ ,దోమల నగేష్, శనిగరం శ్రీనివాస్ మొదలవారు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉప్పల్ గ్రామ అభివృద్ధిలో నూతన అధ్యాయం

## • 30 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ అఖిలపక్ష మద్దతు



**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్ ):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని ఉప్పల్ గ్రామానికి కేంద్ర ప్రభుత్వం 30 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయడంతో గ్రామ అభివృద్ధిలో మరో ముందడుగు పడింది. పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ గారి కృషితో ఈ నిధులు కేటాయించబడ్డాయి. మంగళవారం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు. బీజేపీ మండల అధ్యక్షులు ర్యాకం శ్రీనివాస్ మాట్లాడుతూ, "గ్రామాల అభివృద్ధి ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యమవుతుంది. నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టి భారీ నిధులు కేటాయిస్తున్నారు" అని అన్నారు. అలాగే బండి సంజయ్ కుమార్ మండల అభివృద్ధికి మొత్తం ?1.17 కోట్లు కేటాయించడం హర్షణీయమని, ఈ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు జరగనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ బీజేపీ నేతలు తోట సురేష్, చిట్టి సుందరయ్య, మెడిపెల్లి రాజు, బండి సంపత్, బండారి సుధాకర్, దండవీని శ్రీనివాస్, లచ్చన్న, పిట్టల సతీష్ తదితరులు పాల్గొన్నారు. అభివృద్ధికి బీఆర్ఎస్ మద్దతు పార్టీలకు అతీతంగా సహకారంఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నేతలు కూడా హాజరై అభివృద్ధికి మద్దతు తెలిపారు. మారేపెల్లి నవీన్, ఎర్రబెల్లి దేవేందర్ రావు, ఎర్రబెల్లి సంపత్ రావు, ర్యాకం మొండయ్య, రాజమౌళి తదితరులు అభివృద్ధి ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. "గ్రామాభివృద్ధి పార్టీలకు అతీతం. అందరూ కలిసి ముందుకు వెళ్లాలి" అని వారు వ్యాఖ్యానించారు. గ్రామస్థుల హర్షం ఇటీవల కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి భారీ నిధులు కేటాయించడంతో ఉప్పల్ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ రోడ్డు నిర్మాణం ద్వారా ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగవుతుందని, వాణిజ్య అభివృద్ధికి కూడా దోహదం చేస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# హలో పద్మశాలి ఛలో హైదరాబాద్..

**• పద్మశాలి మహాసభ పోస్టర్ ఆవిష్కరన • కమలాపూర్‌లో చేనేత కార్మికులకు పిలుపునిచ్చిన సంఘ నాయకులు**
**• కార్మికులకు, పద్మశాలీలకు కరపత్రాలు పంపిణీ • సీఎలో ఆల్ ఇండియా 35వ ర్యాంకు సాధించిన సిరికి ఘన సన్మానం**






**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్ ):** ఈ నెల తొమ్మిదిన హైదరాబాదులోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో నిర్వహిస్తున్న అఖిల భారత పద్మశాలి మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం చేనేత కార్మికులకు, పద్మశాలి కులస్తులకు పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా, రాష్ట్ర నాయకులు కార్మికులకు మహాసభల కరపత్రాలు పంపిణీ చేసి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు కార్మికులు సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పద్మశాలి కులస్తుల సమస్యల సాధనకు, చేనేత రంగ అభివృద్ధి, భవిష్యత్తు రాజకీయాలపై నిర్వహిస్తున్న సభకు గ్రామాల్లో నుండి పద్మశాలి కులస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పద్మశాలీల సత్తా చాటాలని, సభకు వెళ్లేందుకు బస్సు సౌకర్యంతో పాటు భోజన వసతి ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. అనంతరం కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సిఏ పరీక్షలో ఆల్ ఇండియా 35వ ర్యాంకు సాధించిన పద్మశాలి ముద్దుబిడ్డ చేరాల సిరి సహస్రను పద్మశాలి కుల పెద్దలు ఘనంగా శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి రవీందర్, అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు పోరండ్ల కృష్ణ ప్రసాద్, మండల అధ్యక్షులు బొప్ప శివశంకర్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, ఉపాధ్యక్షులు వెంగళ వేణుగోపాల్, మెండు రమేష్, దాసి శంకరయ్య, ఆడెపు శ్రీకాంత్, నాసని రాజు, ఆడెపు విజయ, బైరి సహదేవ్, పద్మశాలి కుల బంధవులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న గర్రెపల్లి ఆధ్యాత్మిక ప్రవచనములు

## - ఆమ్నాయవర్ధిని మిత్రబృందం వారిచే నిర్వహణ
## - మూడో తేదీ నుండి 9వ తేదీ వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు
## - లోక కళ్యాణార్థం నిర్వహించే మహా కార్యక్రమం



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 05:** మంత్రపురిలోని శ్రీ శీలేశ్వర - సిద్దేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 3 నుండి 9 వ తేది వరకు సంపూర్ణ ఋగ్వేద స్వాహాకార యజ్ఞము నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 3వ తేదీ పాల్గున శుద్ధ చతుర్థి నుండి 9వ తేదీ పాల్గొన శుద్ధ దశమి వరకు ఏడు రోజులపాటు ఈ కార్యక్రమం జరగనుందని శ్రీ ఆమ్నాయవర్ధిని సేవా ట్రస్ట్ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం 8:30 గంటల నుండి 1:00 వరకు గురు వందనము నిత్య పూజ గాయత్రి జప సహిత ఋగ్వేద పారాయణ స్వాహాకారము అలాగే సాయంత్రం 5 గంటలకు సుహాసినిలచే స్తోత్ర పారాయణము, ప్రదోష పూజ రుద్రక్ర మార్చన, బ్రహ్మశ్రీ వేదమూర్తులు గర్రెపల్లి మహేశ్వర శర్మచే ఆధ్యాత్మిక ప్రవచనము, ప్రసాదన వితరణ అనంతరం మంథని గ్రామ భక్తులచే భజన కార్యక్రమం నిర్వహించినట్లు బ్రహ్మశ్రీ వేదమూర్తులు చింతలపల్లి ఉమా శంకర్ గణాపాఠి వారి బృందము, బ్రహ్మశ్రీ వేదమూర్తులు ఒజ్జల గణేష్ అవధాని, ఆమ్నాయవర్ధిని మిత్రబృందము వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తజనులు అధిక సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పునీతులు కావాలని వారు కోరారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కొలువుదీరిన మంథనిలో ఇలాంటి కార్యక్రమము నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని ఆలయ నిర్వాహకులు లోకే మనోహర్, లోకే శరత్ లు తెలిపారు. ఎంతో ప్రతిష్ట కలిగిన ఈ ఆలయాన్ని పునరుద్ధరించే మహాభాగ్యం కలిగినందుకు వారు ఎంతో సంతోషంగా ఉందన్నారు.



## బ్రహ్మోత్సవాల పనులను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్





**ధర్మపురి, మార్చి 5, (ది క్రైమ్ న్యూస్):** బ్రహ్మోత్సవాల పనులను పర్యవేక్షించి అధికారులకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పలు సూచనలు చేశారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ బుధవారం ధర్మపురి పురపాలక సంఘం యందు రాబోయే బ్రహ్మోత్సవాల పనులను సందర్శించి తదుపరి మున్సిపాలిటీ ఆఫీస్ యందు ఎల్ఆర్ఎస్ అప్లికేషన్స్ ఫీల్డ్ డాటాను సందర్శించి పరిశీలించడం జరిగింది. అనంతరం బ్రహ్మోత్సవాల సందర్భంగా గోదావరిలో భక్తుల సౌకర్యార్థం స్నానఘట్టాలు, చలువ పందిళ్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే. శ్రీనివాస్, డిపిఓ, ఇరిగేషన్ ఆఫీసర్ డిఈ, టెంపుల్ ఇఓ శ్రీనివాస్, ఎంపీడీవో, టిపిఓ, ఏఈఎస్, మేనేజర్ గంగాధర్, సానిటరీ ఇన్స్పెక్టర్ గంగాధర్, మున్సిపల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి సమస్యకు గత ప్రభుత్వమే కారణం



**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** సాగునీటి సమస్యలు తలెత్తడానికి గత ప్రభుత్వ వైఫల్యమే కారణమని కాంగ్రెస్ పార్టీ తొర్రూరు మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు. మండలంలోని సోమవరపు కుంట తండా శివారులో ఆకేరు వాగు పరిధిలోని చెక్ డాములను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చేలా డబ్బులు దండుకునేలా ఆకేరు వాగులో చెక్ డ్యాములు నిర్మించారని,ఆ చెక్ డ్యాములు నాణ్యత లేకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయాయని అన్నారు. సాగునీరు రావడంలేదని గులాబీ నాయకులు మొసలి కన్నీళ్లు కారిస్తున్నారని, వారి వైఫల్యం వల్లనే సాగునీటి సమస్య తలెత్తిందని రైతులు అర్థం చేసుకోవాలని కోరారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సీ రెడ్డిలు ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి సాగునీరు అందేలా కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వంపై బురద చెల్లితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బానోత్ సాగర్, బానోత్ వీరన్న, బానోత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్పత్తి ప్రమాణాలను పరిశీలించిన డైరెక్టర్



**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి రామగుండం.3వ డివిజన్ ఓసీపీ.1 ప్రాజెక్టులో బుధవారం సంస్థ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు పర్యటించారు. ఉదయం ప్రాజెక్టుకు వచ్చిన ఆయనను వ్యూ పాయింట్ నుండి క్వారీలో నడుస్తున్న పనులను పరిశీలించారు. ఇక ప్రాజెక్టుకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు చేపడుతున్న భద్రతా చర్యలు, ప్రణాళికల వివరాలను డివిజన్ జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు డైరెక్టర్ కు వివరించారు. వారి వెంట డివిజన్ ఎస్.ఓ టూ జీఎం జి.రఘుపతి, మేనేజర్ ఉదయ్ హరిజన్, ఇతర అధికారులు ఉన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 05:** తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలని ఉద్యమకారులు సీఎం రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డులు ద్వారా తమ వినతి తెలిపారు. బుధవారం మంథని పట్టణంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ ఆదేశానుసారం అధ్యక్షుడు కొండేటి మారుతి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతు జ్యోతి రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె రాజేశం, ఉపాధ్యక్షురాలు ముస్కె ఈశ్వరమ్మ సీఎం రేవంత్ రెడ్డికి ఉద్యమకారులకు 250 గజాలు ఇంటి స్థలం, ప్రతినెల 25 వేల పెన్షన్, మంజూరు చేయాలని పోస్ట్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ బేతు వనజా రాణి, జిల్లా కార్యదర్శి సులోచన, రామగిరి మండల అధ్యక్షురాలు మల్లేశ్వరి, రామగిరి మండలం ఉపాధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, నాయకులు మంథని సంపత్, తదితరులు పాల్గొన్నారు.





# కార్మికుల ప్రాణాలు గాలిలో దీపాలు

- ఉపాధి కోసం వస్తే ఊపిరి తీస్తున్నారు
- రంగాపూర్ శివారులోని ఏఎన్ఆర్ ఇటుక బట్టీలో అనుమానాస్పదంగా వలస కార్మికుని మృతి
- ఇటుక బట్టీల వైపు కన్నెత్తి చూడని కార్మిక శాఖ అధికారులు

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్): పెద్దపల్లి మండలం రంగాపూర్ శివారులోని ఏఎన్ఆర్ ఇటుక బట్టీలో బుధవారం ఒరిస్సా రాష్ట్రానికి చెందిన నిశాంత్ 42 సంవత్సరాల వలస కార్మికుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటనలో బట్టి యజమానుల మాటలకు అధికారుల సమాధానాలకు పొంతన లేకుండా పోయింది. డిహైడ్రేషన్ వలన చనిపోయాడంటున్న అధికారులు, కడుపు నొప్పితో చనిపోయాడని ఇటుక బట్టి యజమానుల సమాధానం కానీ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మృతుని శరీర భాగాలపై గాయాలు ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని వలస కార్మికుని మృతిపై పలు అనుమానాల ఉన్నట్లు దళిత లేబర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బొంకూరి కైలాసం కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. పెద్దపల్లి జిల్లాలో పుట్టగొడుగుల్లాగా వెలసిన ఇటుక బట్టీలలో పనిచేస్తున్న ఒరిస్సా కార్మికుల భద్రత లేని బతుకులకు భరోసా ఇచ్చేది ఎవరని, ప్రభుత్వాలు మారిన, పాలకులు మారిన, అధికారులు మాత్రం మారడం లేదని వలస కార్మికులపై దాడులు జరిగిన, అఘాయిత్యాలు, అకృత్యాలు లైంగిక వేధింపులు,చివరకు ప్రాణాలు పోయిన ఇటుక బట్టి యజమానులతో కుమ్మక్కైన సంబంధిత శాఖల అధికారులు బట్టీల వైపు తొంగి చూడడం లేదని ఆరోపిస్తున్నారు. మధ్యవర్తుల మాటలు నమ్మి ఉన్న ఊరును విడిచి కన్న వారిని వదిలి పిల్ల పాపలతో పొట్ట చేత పట్టుకొని ఉపాధి కోసం వస్తే ఊపిరి తీస్తున్నారని, ఇటుక బట్టీల యజమానులు పరిహారం ఇవ్వాల్సి వస్తుందని కనికరం లేకుండా కార్మికుల శవాలను కంటికి తెలవకుండా కాల్చేస్తున్నారు.

### దళిత బహుజన లేబర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బోంకూరి కైలాసం

జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇటుక బట్టీలను నిర్వహిస్తూ కార్మికుల ప్రాణాలను బలిగొంటున్నారని రంగాపూర్ శివారులోని ఏఎన్ఆర్ ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన నిశాంత్ 42 సంవత్సరాల వలస కార్మికుని మృతికి ఇటుక బట్టి యజమాన్యమే కారణమని కడుపునొప్పితో బాధపడుతున్న వలస కార్మికునికి కనీస వైద్య సదుపాయం అందించకపోవడం దుర్మార్గమని ఇటికబట్టి యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతి చెందిన కార్మికునికి కుటుంబానికి 10 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లాలో వలస కార్మికులపై అఘాయిత్యాలు పెరిగాయని, కార్మిక శాఖ అధికారులు నిమ్మకు నిరెత్తినట్లు ఉన్నారని, ఎలాంటి అనుమతులు లేకుండా ఇటుక బట్టిలను నిర్వహిస్తున్నారని పెద్దపల్లి జిల్లాలోని వందల సంఖ్యలో ఉన్న ఇటుక బట్టీలలో పనిచేస్తున్న ఒరిస్సా కార్మికుల వివరాలు నమోదు చేయడంలో కార్మిక శాఖ అధికారులు విఫలమయ్యారని అన్నారు. ఇటుక బట్టిల యజమానులతో కుమ్మక్కైన అధికారులు కార్మికులను పట్టించుకోవడం లేదని జిల్లా కలెక్టర్ స్పందించి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.కార్మికుల మృతికి కారణమైన ఎ ఎన్ ఆర్ ఇటుక బట్టి యజమాని పై చర్యలు తీసుకోవాలని, మృతి చెందిన కార్మికుని కుటుంబానికి 10 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలని, జిల్లాలోని ఇటుక బట్టీలలో మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అనుమతి లేని ఇటుక బట్టలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.




# నిరుపేద యువతి వివాహానికి పుస్తె మట్టెలు అందించిన పెద్దపల్లి లయన్స్ క్లబ్

- రూ.50 వేల విలువ చేసే పుస్తె మట్టెలు, చీరలు అందచేత



రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 05: రామగిరి మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద యువతీ కట్లకోల సాన్వి (రవళి) వివాహం గురువారం జరుగుతుండగా లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో బుధవారం రూ.50వేలు విలువ చేసే రాత్రి పుస్తె మట్టలు, పెళ్లి బట్టలు, వంట పాత్రలు అందచేశారు. రత్నపూర్ గ్రామ మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమపీవీరావు రవళి పరిస్థితి ని వివరించి పెళ్లికి సహాయం చేయాల్సిందిగా పెద్దపల్లి లయన్స్ క్లబ్ దృష్టికి తీసుకువచ్చారు. పేదింటి అమ్మాయి తల్లి కూలీ పనిచేస్తు చదివించి పెళ్లి చేయాలనీ ఇబ్బందులు పడుతు సమాజం లోని దాతల సహాయం కోరడంతో లయన్స్ క్లబ్ పెద్దపల్లి వారు తమ ఉదారతను చాటుకొని ముందుకు వచ్చారు. ఈ విషయంలో వెంటనే స్పందించిన పెద్దపల్లి లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో రూ.50 వేలు సేకరించి పుస్తె మట్టలు, కనకదుర్గ షాపింగ్ వారి సహకారంతో పెళ్లి బట్టలు, వంటపాత్రలను అందచేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఇప్పటివరకు అనేకమంది నిరుపేదల పెళ్లిళ్లకు సహాయం చేసింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ప్రెసిడెంట్ లయన్ వేల్పుల రమేష్, సెక్రటరీ లయన్ బోడకుంట రామ్ కిషన్, రత్నపూర్ మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు, మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి, క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ సాదుల వెంకటేశ్వర్లు, సీనియర్ సభ్యులు లయన్ బెల్లంకొండ జయపాల్ రెడ్డి, లయన్ కావేటి రాజగోపాల్, లయన్ నల్ల రాజేందర్, లయన్ జక్కుల సాయిలు, సెంటినరి కాలనీ క్లబ్ ప్రెసిడెంట్ ముల్కూరి శ్రీనివాస్, పూజారి సౌమిత్రి కృష్ణ, మాజీ వార్డు సభ్యులు కొవ్వూరి సురేష్, కొవ్వుల రవీందర్ రావు, పానగంటి వీరేశం,సందవేన కుమార్, మేకల మారుతీ, అసం తిరుపతి, జక్కుల ఆశాలు, ధర్మల సంజీవ్ కుమార్, కొండు వేణు, తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 7 నుండి 12 వరకు మహిళా దినోత్సవం వేడుకలు

- సింగరేణి సేవా అధ్యక్షురాలు బండి వనజ

యైటింక్లయిన్ కాలని. (ది క్రైమ్ న్యూస్): స్థానిక సింగరేణి సీ.ఈ.ఆర్ క్లబ్ లో బుధవారం రామగుండం రెండవ ఏరియా సేవా సమితి మహిళల సమావేశం జరిగింది. సాయంత్రం జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు బండి వనజ వెంకటయ్య మాట్లాడుతూ.. ఈ నెల 12న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు, తెలిపారు. 7న శుక్రవారం ఉదయం 9 గంటలకు ఎన్.సీ.ఓ.ఏ క్లబ్ లో క్లబ్ సభ్యులకు ఆటల పోటీలు, సాయంత్రం 4 గంటలకు జీఎం కార్యాలయంలో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు, మరుసటి రోజు శనివారం ఉదయం 9 గంటలకు క్లబ్ లో కార్మిక కుటుంబాల మహిళలకు ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 12న బుధవారం ఉదయం 9 గంటలకు సీ.ఈ.ఆర్ క్లబ్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మహిళా దినోత్సవ ఖ్యాతిని పెంపొందించే విధంగా మహిళలతో సంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు మొదలైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆటల పోటీల్లో గెలుపొందిన మహిళా ఉద్యోగులకు, ఇతర మహిళలకు బహుమతులు ప్రధానం



చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అధ్యక్షురాలు వనజ వెంకటయ్య కోరారు. ఇంకా ఈ సమావేశంలో ఏరియా డివైపిఎం శ్యామ్, స్పోర్ట్స్ సూపర్వైజర్ నరేందర్ రెడ్డి, ఎన్సీఓఏ క్లబ్ సెక్రెటరీ కల్పనా, సభ్యులు సృజన, సేవా కో ఆడినేటర్ బి. దేవారెడ్డి కాలనీ, పోతన కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

# మల్క కోమురయ్య గెలుపుతో హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



ధర్మపురి, మార్చి 5, (ది క్రైమ్ న్యూస్): మల్క కోమురయ్య గెలుపుతో హర్షం వ్యక్తం చేసినట్లు ఉపాధ్యాయ బుగ్గారం మండల తపస్ సంఘ నాయకులు మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో సంబరాలు జరుపుకున్నారు. ఇటీవల కరీంనగర్ నిజామాబాద్ అదిలాబాద్ మెదక్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తపస్ బలపరిచిన మల్కా కొమురయ్య ఒకటో నెంబర్ ప్రాధాన్యతతోనే మునుపెన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో విజయం సాధించడం జరిగిందని, ఇట్టి ఘనవిజయాన్ని పురస్కరించుకొని బుగ్గారం మండల తపస్ సంఘ నాయకులు మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో బుగ్గారం మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు కి మరియు బుగ్గారం కాంప్లెక్స్ హెచ్ఎం మోహన్ రెడ్డి కి మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు స్వీట్లు ఇచ్చి తమ ఆనందాన్ని పంచుకొని విజయోత్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర కార్యదర్శి రొట్ట శ్రీనివాస్ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి తమ అభ్యర్థి అయిన మల్కా కొమురయ్య ని ఒకటో నెంబర్ ప్రాధాన్యతతోనే గెలిపించి నందుకు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపాధ్యాయులకు ఉన్నటువంటి 317 జీవో స్పౌస్ బదిలీలు పెండింగ్లో ఉన్న డిఏలు పిఆర్సి మరియు పదోన్నతులు తదితర సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చూస్తామని రొట్టె శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో బుగ్గారం మండల తపస్ అధ్యక్షులు సతీష్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, జిల్లా బాధ్యులు రఘునందన్, కిషోర్, శ్రీలత, దొంతుల శ్రీధర్, ప్రణీత్, లచ్చన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో జోరుగా అక్రమ ఇసుక రవాణా



ధర్మారం, మార్చి 5 (ది క్రైమ్ న్యూస్ ): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో అక్రమ ఇసుక రవాణా దళారులకు మూడు పువ్వులు ఆరు కాయలు గా సాగుతుంది. నిబంధనలు ఉల్లంఘించి సొమ్ము చేసుకుంటున్న దళారులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న పట్టించుకోనే వారు కరువయ్యారు. జిల్లా కలెక్టర్ ఆన్లైన్ లో సరఫరా మండలాలకు రేటు నియమించి ఇసుక సరఫరా అయ్యే విధంగా అనుమతులు జారీ చేసిన విషయం తెలిసిందే కానీ దళారులు ఇసుకను అడ్డదారిలో తరలించి అక్కడక్కడ డంపింగ్ లు ఏర్పాటు చేసుకొని అక్రమ రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి కన్నం పెడుతున్నారు. పేద మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్న ఇసుక రవాణాను అరికట్టలేక పోతున్నారని ప్రజల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# మా భూములు.. మాకేనని

- రామగిరి తహసిల్దార్ ఆఫీస్ లో మేడిపల్లి రైతులు వినతి పత్రం అందజేత - భూ సేకరణ ఉపసంహరించుకునే వరకు మా పోరాటం ఆగదు - మేడిపల్లి బాధిత రైతులు



రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 05: రాష్ట్ర ప్రభుత్వం మేడిపల్లి భూముల సేకరణ ఉపసంహరించుకునే వరకు తమ పోరాటం ఆగదని మేడిపల్లి బాధిత రైతులు తెల్పి చెప్పారు. పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ జారీ చేసిన నోటీసులో 60 రోజుల లోపు గ్రామ రైతులు తమ అభ్యంతరాలను తెలుపగలరని పేర్కొన్నారు. కానీ మేడిపల్లి రైతులు భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేమని ఈ యొక్క ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు మేము భూములు ఇవ్వబోమని వెంటనే ఈ చర్యను ఉపసంహరించుకోవాలని పలుమార్లు జిల్లా కలెక్టర్ కి, మంథని ఆర్డిఓకి, రామగిరి ఎమ్మార్వో కి పలుమార్లు వినతి పత్రం ఇచ్చిన వారి నుండి ఇప్పటివరకు ఎలాంటి జవాబు రావడం లేదు. ఇకనైనా అధికారుల నుండి జవాబు రాకపోతే ఈ రెండు రోజుల్లో పెద్ద ఎత్తున నిరాహార దీక్షలు చేపడతామని రైతులు హెచ్చరించారు. మరి ఒకసారి ముందస్తు కార్యాచరణలో భాగంగా రామగిరి తహసిల్దార్ ఆఫీస్ లో మేడిపల్లి రైతులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి రామగిరి మండల అధ్యక్షుడు కొండ లక్ష్మణ్, రత్నాపూర్ మాజీ ఎంపీటీసీ ధర్మల సంపత్, రత్నాపూర్ మాజీ వార్డు సభ్యులు చామంతి-కృష్ణ, గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది.

# కలెక్టరేట్ భవన్‌లో చలివేంద్రం ప్రారంభించారు



శామీర్ పేట, మార్చ్ 05 (ది క్రైమ్ న్యూస్): మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ భవన్ లో చలివేంద్రం ప్రారంభించడం జరిగినది, బుధవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడలు, నృత్యము, సాంగ్స్ వంటి కార్యక్రమాలు టీజీవో ల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. దీనిలో ముఖ్య అతిథిగా విజేందర్ రెడ్డి జిల్లా అదనపు కలెక్టర్, హరిప్రియ డిఆర్ఓ, విజయ కుమారి డిఈఓ, టీజీవో అధ్యక్షులు జి.వినోద్ కుమార్, టీజీవో కార్యదర్శి దా. కురు మూర్తి, రాధిక ఎంప్లాయిమెంట్ అధికారి, జాన్సి బీసీ డెవలప్మెంట్, గోపాల్ రావు యూత్ & స్పోర్ట్స్ డిస్టిక్ట్ మెంబు, శివ ప్రసాద్ లైమ్, రవీందర్ టీజీవో ఉపాధ్యక్షులు, జిల్లా టీజీవో మహిళా ప్రతినిధులు పాల్గొనడం జరిగినది. డిఆర్ఓ మాట్లాడుతూ మహిళా దైనందిన జీవితంలో మహిళల పాత్ర, మహిళా శక్తి, మహిళల ధైర్య సాహసాలు, ఓర్పు సహనం గురించి క్లుప్తంగా వివరించడం జరిగినది.

# పారిశుద్ధ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

- గ్రామాభివృద్ధికి కృషి చేయాలి - మంథని డివిజనల్ పంచాయతీ అధికారి కే.సతీష్ కుమార్

రామగిరి, (ది క్రైమ్ న్యూస్) మార్చి 05: రామగిరి మండలంలోని రత్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో మంథని డివిజనల్ పంచాయతీ అధికారి కే.సతీష్ కుమార్ ఆకస్మికంగా పర్యటించి జరుగుచున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి పంచాయతీ కార్యదర్శికి తగు సూచనలు జారీ చేయడం జరిగినది. గ్రామం లో నిరంతరం ఇంటింటా చెత్త సేకరణ జరగాలని ఎస్ డబ్ల్యూఎమ్ షెడ్ లో సెగ్రిగేషన్ ను ప్రక్రియ జరిగి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని ప్లాస్టిక్ లేదా డ్రై వేస్ట్ ను అమ్మి అట్టి రొక్కమును గ్రామపంచాయతీ ఖాతా యందు జమ చేయవలసిని అలాగే ఇంటి పన్ను వసూలు 10-03-2025 వరకు 100% పూర్తి చేయవలెనని పంచాయతీ కార్యదర్శి మొదటి ప్రాధాన్యతగా ఆటోస్ దరఖాస్తు దారులను ఇంటికి వెళ్లి సంప్రదించి రెగ్యులర్ చేసుకునేటట్లు అవగాహనా కలిపించేటట్లు చేయాలని ఆదేశించినారు. గ్రామ పంచాయతీ లో నిరంతరం పరిశుద్ధ కార్యక్రమాల నిర్వహణ, గ్రామ ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా మంచి నీటి సరఫరా పై ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించాలని ఆదేశించినారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి పారిశుద్ధ కార్యక్రమాలు అయిన ఫాగింగ్ చేయించడం, బ్లీచింగ్ చల్లించడం, క్లోరినేషన్ చేయించడం తదితర పనులను నిరంతరం జరగాలని ఆదేశించినారు.ఇట్టి ఆదేశాల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించినచో తగు చర్యలు గైకొనబడునని ఆదేశించారు.



# సచిన్ యువరాజ్ సరసన నిలిచిన కోహ్లీ

## స్పోర్ట్స్

### మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లలో రికార్డు




ఆడిన ప్రతి మ్యాచ్ లో ఏదో ఒక రికార్డు నెలకొలపుతున్న కింగ్ కోహ్లీ ఆసీస్ తో చాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్స్ లో గెలుపు ద్వారా సచిన్ యువరాజ్ ల సరసన చేరాడు. ఇంతవరకు ఐసీసీ టోర్నమెంట్లలో నాకౌట్ గేమ్స్ లో ఇండియా కేవలం నాలుగు సార్లు మాత్రమే గెలిచింది. వీటిలో సచిన్ ఒకసారి, యువరాజ్ సింగ్ 3 సార్లు మేన్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచారు. ఇప్పుడీ ఐదో గెలుపుతో కోహ్లీ కూడా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గెలుచుకొని వారి పక్కన చేరాడు 1998లో టెస్ట్ మ్యాచ్ అన్ని జట్ల మధ్య తొలిసారి నాకౌట్ సిరీస్ జరిపింది ఐసీసీ. దానిలో భాగంగా ఆస్ట్రేలియా తో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ లో ఇండియా 50 ఓవర్ల లో 307 పరుగులు చేస్తే ఆస్ట్రేలియా 263 పరుగులకే ఆల్ అవుట్ అయ్యింది. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ 141 (128 బంతుల్లో ) పరుగులు సాధించడమే కాకుండా 4 వికెట్లు తీయడం ద్వారా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు సాధించాడు. 2000 లో జరిగిన చాంపియన్స్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ లో ఇండియా 265 పరుగులు చేస్తే ఆస్ట్రేలియా 245 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యింది. ఈ మ్యాచ్ లో 84 పరుగులు (80 బంతుల్లో ) చేసిన యువరాజ్ సింగ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు 2007 లో జరిగిన తొలి %ు%20 వరల్డ్ కప్ సెమీ ఫైనక్ లో ఇండియా 20 ఓవర్ల లో 188 పరుగులు చేస్తే ఆస్ట్రేలియా 173 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలయ్యింది. ఈ మ్యాచ్ లో 30 బంతుల్లోనే 70 పరుగులు చేసిన యువరాజ్ సింగ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు.సచిన్ టెండూల్కర్ వరల్డ్ కప్ కలను తీర్చిన 2001%ఔజ% ట్రోఫీ లో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ లో ఇండియా ఆస్ట్రేలియా తలపడ్డాయి. ఆస్ట్రేలియా చేసిన 260 (50 ఓవర్ల లో ) పరుగులను ఇండియా 47.4 ఓవర్ల లోనే ఛేదించింది. ఈ మ్యాచ్ లో రెండు వికెట్లు తీయడం తో పాటు 57 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచిన యువరాజ్ సింగ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు తాజా గా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్ లో ఆస్ట్రేలియా ఇచ్చిన 264 పరుగుల టార్గెట్ ను ఇండియా 48.1 ఓవర్ల లోనే ఛేదించింది. ఈ మ్యాచ్ లో విరాట్ కోహ్లీ 84 (98 బంతుల్లో ) రన్స్ చేసి ఇండియా విజయం లో కీలక పాత్ర పోషించాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకుని సచిన్, యువరాజ్ సింగ్ ల సరసన నిలిచాడు.




## చరిత్ర సృష్టించిన కేన్ విలియమ్సన్

### 19 వేల పరుగులు పూర్తి చేసుకున్న కేన్ పలు రికార్డులు నమోదు

ఛాంపియన్స్ ట్రోఫీ 2025 సెమీ ఫైనల్ లో దక్షిణాఫ్రికాతో జరుగుతోన్న మ్యాచ్‌లో న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ చరిత్ర సృష్టించాడు. ఈ పోరులో శతకం బాదడంతో పాటు న్యూజిలాండ్ తరఫున అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో చేరాడు. 19 వేల పరుగులు పూర్తి చేసుకున్న న్యూజిలాండ్ తొలి బ్యాటర్ గా ఘనత సాధించాడు. ఈ మ్యాచ్ లో 27 పరుగుల వ్యక్తిగత స్కోర్ దగ్గర ఈ ఫీట్ నమోదు చేశాడు. విలియమ్సన్ ఈ 19 వేల పరుగుల ఫీట్ ను అంతర్జాతీయ క్రికెట్ లో 440 ఇన్నింగ్స్ లో నమోదు చేశాడు. తక్కువ ఇన్నింగ్స్ లో ఈ ఫీట్ నమోదు చేసిన నాలుగో ఫాస్టెస్ట్ బ్యాటర్ గా నిలిచాడు. విరాట్ కోహ్లీ 399 ఇన్నింగ్స్ లో ఈ 19 వేల పరుగుల ఫీట్ ను నమోదు చేయగా.. సచిన్ తెందుల్కర్ (432), బ్రియాన్ లారా (433), జో రూట్ (444), రికీ పాంటింగ్ (444) ఇన్నింగ్స్ లో సాధించారు. అలానే తాజా సెంచరీతో అంతర్జాతీయ క్రికెట్ లో అత్యధిక శతకాలు బాదిన ఆటగాళ్ల జాబితాలోనూ స్థానం సంపాదించాడు కేన్ మామ. విరాట్ కోహ్లీ (82), జో రూట్ (53), రోహిత్ శర్మ (49), కేన్ విలియమ్సన్ (48), స్టీవ్ స్మిత్ (48) సెంచరీలు చేశారు. ఈ 19 వేల పరుగుల రికార్డ్ తో పాటు ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగులు (442) చేసిన న్యూజిలాండ్ బ్యాటర్ గానూ నిలిచాడు విలియమ్సన్. ఈ క్రమంలో స్టీఫెన్ ఫ్లెమింగ్ (441 పరుగులు) రికార్డును బ్రేక్ చేశాడు.

## కేఎల్ రాహుల్‌పై అంబటి రాయుడు ప్రశంసల జల్లు

### అద్భుతంగా బ్యాటింగ్ చేశాడని ప్రశంసా

టీమిండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్‌పై మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ప్రశంసల జల్లు కురిపించాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్లో కేఎల్ రాహుల్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడని కొనియాడాడు. ఒత్తిడిని అధిగమిస్తూ అతను ఆడిన తీరు అమోఘమని రాయుడు ప్రశంసించాడు. ఆస్ట్రేలియాతోనే జరిగిన వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్లో రాహుల్ చేసిన తప్పిదానికి తాజా ఇన్నింగ్స్ పరిహారమని అభిప్రాయపడ్డాడు. ఆస్ట్రేలియాతో మంగళవారం జరిగిన సెమీఫైనల్లో టీమిండియా 4 వికెట్ల తేడాతో గెలుపొంది ఫైనల్ చేరిన విషయం తెలిసిందే.ఈ మ్యాచ్‌లో కేఎల్ రాహుల్(34 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 42) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. విరాట్ కోహ్లీతో కలిసి తీవ్ర ఒత్తిడిలో రాహుల్ కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఆఖరి వరకు క్రీజులో నిల్చొని భారీ సిక్సర్‌తో భారత విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. అయితే ఇదే ఆస్ట్రేలియాతో అహ్మదాబాద్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్లో కేఎల్ రాహుల్(107 బంతుల్లో 66) జిడ్డు బ్యాటింగ్‌తో టీమిండియా ఓటమికి కారణమయ్యాడు. దాంతో అప్పట్లో అతనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇప్పటికీ కేఎల్ రాహుల్ క్రీజులో ఉంటే అభిమానులు భయపడుతారు. అంతలా ఈ ఇన్నింగ్స్ అతని బ్యాటింగ్‌పై ప్రభావం చూపింది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ రాయుడు.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'కేఎల్ రాహుల్ తీవ్ర ఒత్తిడిలో ఉన్నాడు. ఎందుకంటే నెంబర్ 6లో ఆడటం అతనికి అలవాటు కాదు. కానీ అపారమైన పరిణితి కనబరుస్తూ ఒత్తిడిని అద్భుతంగా హ్యాండిల్ చేశాడు. అతను తీసుకున్న రిస్క్.. ఆడిన షాట్స్ అమోఘం. ఒత్తిడి మొత్తాన్ని అతనే భరిస్తూ.. విరాట్ కోహ్లీకి స్వేచ్ఛగా ఆడే అవకాశం కల్పించాడు. వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్లో రాహుల్ చేసిన తప్పిదానికి తాజా ఇన్నింగ్స్‌తో విముక్తి లభించిందనుకుంటున్నా. ఆ తప్పిదాన్ని అతను మనసులోనే ఉంచుకొని.. చక్కగా సరిదిద్దుకున్నాడు. ఫైనల్లోనూ అతను ఇదే తరహా ప్రదర్శన చేయాలని ఆశిస్తున్నా.జట్టులోని ప్రతీ ఒక్కరికి ఒంటి చేత్తో మ్యాచ్‌ను గెలిపించే సామర్థ్యం ఉండటం టీమిండియా చేసుకున్న అదృష్టం. అందరూ తీవ్ర ఒత్తిడిలో అద్భుతంగా రాణిస్తూ టీమిండియాకు విజయాలు అందిస్తున్నారు. అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్.. విరాట్ కోహ్లీతో కలిసి ఈ రోజు బాధ్యత తీసుకున్నారు. ప్రతీ ప్లేయర్ తాము ఓ మ్యాచ్ విన్నర్ అనే విషయాన్ని రుజువు చేసుకున్నారు. ఇలాంటి ఆటగాళ్లు జట్టులో ఉండటం టీమిండియా చేసుకున్న అదృష్టం'అని అంబటి రాయుడు చెప్పుకొచ్చాడు.

## ఇండియన్ టాప్ కెప్టెన్‌గా రోహిత్ రికార్డు..

### చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ చేరికతో అరుదైన ఘనత




భారత వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ రికార్డులకెక్కాడు. టీమిండియాను నాలుగు రకాల ఐసీసీ టోర్నీ ఫైనల్ కు చేర్చిన ఏకైక కెప్టెన్ గా ఘనత వహించాడు. 2022 ఫిబ్రవరిలో సారథిగా పగ్గాలు చేపట్టిన రోహిత్.. ఈ మూడేళ్లలో అనితర సాధ్యమైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ముఖ్యంగా 2023 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్ కు భారత్ ను చేర్చి, తొలి ఐసీసీ టోర్నీ ఫైనల్ ఘనతను సాధించాడు. అదే ఏడాది సొంతగడ్డపై జరిగిన 2023 వన్డే ప్రపంచకప్ లో అజేయంగా నిలిపి, ఫైనల్ కు చేర్చాడు. ఇక తర్వాత ఏడాది వెస్టిండీస్ లో జరిగిన టీ20 ప్రపంచకప్ లోనూ ఫైనల్లో స్థానం సంపాదించేలా పావులు కదిపాడు. తాజాగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ సెమీస్ లో ఆస్ట్రేలియాను నాలుగు వికెట్లతో ఓడించి, తన కెప్టెన్సీలో నాలుగో ఐసీసీ టైటిల్ పోరుకు భారత్ అర్హత సాధించేలా చేశాడు. అయితే ఇందులో టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్లో 209 పరుగులతో, వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆరు వికెట్లతో ఆసీస్ చేతిలో భారత్ ఓడిపోయింది. అయితే టీ20 ప్రపంచప్ ఫైనల్లో సౌతాఫ్రికాను ఓడించి 2007 తర్వాత టీమిండియా రెండోసారి టైటిల్ లిఫ్ట్ చేసేలా తన నాయకత్వ ప్రతిభ చాటాడు. గతంలో మూడు ఐసీసీ టోర్నీ ఫైనల్స్ కు చేర్చిన రికార్డు ఎంఎస్ ధోనీ పేరిట ఉండేది. 2007 టీ20 ప్రపంచకప్, 2011 వన్డే ప్రపంచకప్, 2013 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ లలో భారత్ ను ఫైనల్ కు చేర్చాడు. అయితే అన్ని టోర్నీలలో భారత్ విజేతగా నిలిచింది. గతేడాదే ఈ ఫైనల్ చేరిక ఘనతను రోహిత్ సమం చేయగా, తాజాగా ఆ రికార్డును బద్దలు కొట్టి టీమిండియా తరపున మేటీ కెప్టెన్ గా ఎదిగాడు. ఇక ఆదివారం ఫైనల్ మ్యాచ్ ను దుబాయ్ వేదికగా భారత్ ఆడుతుంది. బుధవారం సౌతాఫ్రికా, న్యూజిలాండ్ జట్ల మధ్య రెండో సెమీస్ లాహోర్ లో జరుగుతుంది. ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టు ఫైనల్లో టీమిండియాతో తలపడుతుంది. మంగళవారం జరిగిన సెమీస్ మ్యాచ్ లో భారత్ కొన్ని ఘనతలు సాధించింది. తనకు కొరకరాని కొయ్యలా మారిన ఆసీస్ ను దాదాపు 14 ఏళ్ల తర్వాత నాకౌట్ లో మట్టి కరిపించింది. సొంతగడ్డపై 2011లో జరిగిన వన్డే ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్లో ఆసీస్ ను ఓడించింది. అప్పుడు 261 పరుగుల టార్గెట్ ను ఛేదించి, కంగారూలను ఇంటిముఖం పట్టించింది. ఆ మ్యాచ్ లో పూర్తి చేసిన 261 పరుగుల టార్గెటే ఆసీస్ పై భారత్ కు అత్యధిక ఛేదన కావడం విశేషం. తాజాగా దుబాయ్ లో జరిగిన మ్యాచ్ లో 265 పరగుల టార్గెట్ ను ఛేదించి, నాకౌట్ లో ఆసీస్ పై తన రికార్డును మెరుగు పర్చుకుంది. ఈ మ్యాచ్ లో టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 49.3 ఓవర్లలో 264 పరగులకు ఆలౌటవగా.. మరో 11 బంతులు మిగిలి ఉండగానే 267-6 తో భారత్ విజయం సాధించింది. ఛేజ్ మాస్టర్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (84) కీలక ఇన్నింగ్స్ తో ఛేజింగ్ లో తన ప్రతిభను మరోసారి చాటాడు.

## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ టాప్ 5లోకి విరాట్

### నాలుగో ర్యాంక్‌కు చేరుకున్న కోహ్లి

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్?లో టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సత్తా చాటాడు. ప్రస్తుత ఛాంపియన్స్ ట్రోఫీలో అద్భుతంగా రాణిస్తున్న విరాట్ ఒక స్థానం మెరుగుపర్చుకొని, నాలుగో ర్యాంక్?కు చేరుకున్నాడు. విరాట్ ప్రస్తుతం 747 రేటింగ్స్?తో నాలుగో స్థానంలో ఉండగా, కెప్టెన్ రోహిత్ శర్మ రెండు ప్లేస్?లు పడిపోయి ఐదో ర్యాంక్?లో కొనసాగుతున్నాడు. యంగ్ బ్యాటర్ శుభ్?మన్ గిల్ అగ్ర స్థానం పదిలంగా ఉంచుకున్నాడు. ఇక యంగ్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ ఒక స్థానం మెరుగుపర్చుకొని ఎనిమిదో ప్లేస్ దక్కించుకున్నాడు. అఫ్గానిస్థాన్ బ్యాటర్ ఇబ్రహీం జర్దాన్ ఏకంగా 13 స్థానాలు ఎగబాకి టాప్-10లోకి దూసుకొచ్చాడు. ప్రస్తుతం ఇబ్రహీం 676 రేటింగ్స్?తో 10వ స్థానంలో కొనసాగుతున్నాడు.

## ఐపీఎల్ 2025కు సిద్ధమవుతోన్న ఉప్పల్ స్టేడియం

### స్టేడియాన్ని ఆధునీకరిస్తోన్న హెచ్‌సీఏ మారుస్తున్న స్టేడియం రూపురేఖలు

ఐపీఎల్ 2025 టోర్నమెంట్‌కు తెలుగు రాష్ట్రాల్లో అతి కీలకమైన ఉప్పల్ స్టేడియం సిద్ధమవుతోంది. అరకొర సౌకర్యాలు.. ప్రేక్షకులకు తగినన్ని ఏర్పాట్లలో విఫలమై తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న ఉప్పల్ స్టేడియాన్ని హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఆధునీకరిస్తోంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లకు స్టేడియం రూపురేఖలు మారుస్తున్నారు. ఐపీఎల్ టోర్నీకి చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. టాటా ఐపీఎల్-18 వ సీజన్‌కు ఉప్పల్ స్టేడియంలో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్ మోహన్ రావు తెలిపారు. ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) యాజమాన్యంతో పాటు హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యులు ఐపీఎల్ ఏర్పాట్లపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఐపీఎల్ పాలకమండలి నిబంధనల ప్రకారం అభిమానులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని అధ్యక్షుడు జగన్ మోహన్ రావు ఆదేశించారు . గతేడాది కార్పొరేట్ బాక్సుల్లోని ఏసీలు, వాష్‌రూమ్స్ వల్ల కొన్ని చోట్ల తలెత్తిన సమస్యలు ఈసారి పునరావృతం కావద్దని స్పష్టం చేశారు.'ఐపీఎల్ మ్యాచ్‌ల టికెట్ల విక్రయం పూర్తి పారదర్శకంగా జరగాలి. స్టేడియంలో విక్రయించే ఆహార పదార్థాలు నాణ్యత బాగుండాలి. అధిక రేట్లకు విక్రయించరాదు' అని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు తెలిపారు. మార్చ్ 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్‌లో హైదరాబాద్ సన్‌రైజర్స్‌పై అందరి దృష్టి పడింది. ఈసారి ట్రోఫీ కోస ఆరెంజ్ ఆర్మీ పూర్తిగా కసరత్తు అయ్యింది.



## శ్రేయస్ అయ్యర్ సూపర్ రనౌట్

### అద్భుత ఫీల్డింగ్‌తో టీమిండియా విజయం



అన్ని విభాగాల్లో ఆధిపత్యాన్ని ప్రదర్శించిన టీమిండియా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఫైనల్‌కు దూసుకెళ్లింది. వరుసగా నాలుగు మ్యాచ్‌లకు నాలుగు గెలిచి ఓటమెరుగని జట్టుగా టైటిల్ ఫైట్‌కు సిద్ధమైంది. మంగళవారం దుబాయ్ వేదికగా జరిగిన సెమీఫైనల్లో టీమిండియా సమష్టిగా రాణించి 4 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించిన విషయం తెలిసిందే. ఈ గెలుపుతో వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్లో ఆసీస్ చేతిలో ఎదురైన పరాజయానికి టీమిండియా ప్రతీకారం తీర్చుకుంది. మరోసారి విరాట్ కోహ్లీ(98 బంతుల్లో 5 ఫోర్లతో 84) అసాధారణ బ్యాటింగ్‌తో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. దాంతో అతనిపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. అయితే విరాట్ కోహ్లీ కంటే.. శ్రేయస్ అయ్యర్ అసాధారణ ఫీల్డింగ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పాడని నెటిజన్లు, క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ విజయంలో విరాట్ కోహ్లీ పాత్ర ఎంత ఉందో..? అయ్యర్‌ది కూడా అంతే ఉందని కామెంట్ చేస్తున్నారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌటైంది. శ్రేయస్ అయ్యర్ సూపర్ రనౌట్‌తో ఆసీస్ 15-20 పరుగులు తక్కువగా చేసింది. హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొని దూకుడుగా ఆడుతున్న అలెక్స్ క్యారీ(57 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 61)ని శ్రేయస్ అయ్యర్ స్టన్నింగ్ త్రోతో రనౌట్‌గా పెవిలియన్ చేర్చాడు. అతని త్రో ధాటికి బంతి నేరుగా వికెట్లను తాకింది. క్యారీ రనౌటవ్వకుండా ఉంటే.. భారీ షాట్లు ఆడేవాడు. అప్పుడు ఆసీస్ 280 ప్లస్ రన్స్ టార్గెట్ నమోదు చేసేది. ఆ లక్ష్యాన్ని చేధించడం టీమిండియాకు కష్టంగా మారేది. ఈ క్రమంలోనే బౌలర్లు అసాధారణ ప్రదర్శన కనబర్చినా.. ఛేజింగ్‌లో విరాట్ కోహ్లీ చెలరేగినా.. ఆఖర్లో హార్దిక్ పాండ్యా మెరుపులు మెరిపించినా.. అయ్యర్ రనౌట్ చేయకుంటే టీమిండియా గెలిచేది కాదని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. కోహ్లీతో కలిసి శ్రేయస్ అయ్యర్ కీలక భాగస్వామ్యాన్ని కూడా నెలకొల్పాడని గుర్తు చేస్తున్నారు. అద్భుత ఫీల్డింగ్‌తో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించిన శ్రేయస్ అయ్యర్‌కే బెస్ట్ ఫీల్డింగ్ అవార్డ్ దక్కింది. రవి శాస్త్రి చేతుల మీదుగా అయ్యర్ ఈ రికార్డ్‌ను స్వీకరించాడు.

# విశ్వేజి

# ఉదయాన్నే ఈ వాటర్ తాగితే..
# హీరోయిన్‌ను కూడా మీ ముందు దిగదుడుపే!



ఒకప్పుడు, చాలా మందికి తెలియని ఓ రహస్యం ఉండేది. అదే కీరదోస నీళ్లు! మామూలుగా మనం కీరదోసకాయ ముక్కల్ని తినేసి, నీళ్లని పారబోస్తాం. కానీ, ఆ నీళ్లలోనే అసలు సిసలైన పోషకాలు దాగున్నాయని ఎంతమందికి తెలుసు? అవును, మీరు విన్నది నిజమే! కీరదోస నీళ్లు కేవలం దాహం తీర్చడమే కాదు, మన శరీరానికి ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలను అందిస్తాయి. అవేంటో తెలుసుకోవాలని ఉందా? అయితే పదండి, కీరదోస నీళ్ల ప్రపంచంలోకి వెళ్దాం! కీరదోస నీళ్లలో దాగున్న నిధి: కీరదోసకాయలో 95% నీరే ఉంటుంది. అందుకే, దీని నీళ్లు మనల్ని తక్షణమే చల్లబరుస్తాయి. వేసవిలో వడదెబ్బ తగలకుండా కాపాడతాయి. అంతేకాదు, ఇందులో విటమిన్ కె, విటమిన్ సి, మెగ్నీషియం, పొటాషియం, మాంగనీస్ వంటి పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరంలోని అవయవాల పనితీరును మెరుగుపరుస్తాయి. అందాల ఆరోగ్యం కోసం: బరువు తగ్గాలనుకుంటున్నారా? కీరదోస నీళ్లు మీకు మంచి స్నేహితుడు. ఇందులో కేలరీలు చాలా తక్కువ. పైగా, జీర్ణక్రియను మెరుగుపరిచి, కొవ్వును కరిగిస్తాయి. కీరదోస నీళ్లలోని యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని కాంతివంతంగా మారుస్తాయి. మొటిమలు, మచ్చలు తగ్గిపోతాయి. చర్మం తేమగా, యవ్వనంగా కనిపిస్తుంది. కీరదోస నీళ్లలో ఉండే సిలికా, సల్ఫర్ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. జుట్టు రాలడం తగ్గుతుంది. జుట్టు ఒత్తుగా, దృఢంగా తయారవుతుంది. గుండె ఆరోగ్యానికి మేలు: కీరదోస నీళ్లలోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇందులో ఉండే విటమిన్ కె ఎముకలను దృఢంగా చేస్తుంది. ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలను దూరం చేస్తుంది. కీరదోస నీళ్లు అజీర్తి, మలబద్ధకం వంటి సమస్యలను నివారిస్తాయి. పేగులను శుభ్రంగా ఉంచుతాయి. కీరదోస నీళ్లు శరీరంలోని వ్యర్థాలను, విషపదార్థాలను బయటకు పంపిస్తాయి. మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. కీరదోస నీళ్లలోని యాంటీఆక్సిడెంట్లు క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి. %ఉాశీఖవతీవఎ దీఎ చాశ్రీంశీ =ఝ౦% ఆమెతో నా తొలి ముద్దు ఎప్పటికి మర్చిపోలేను – నాగ చైతన్య కీరదోస నీళ్లను ఎలా తయారు చేయాలి? కీరదోస నీళ్లు తయారు చేయడం చాలా సులభం! ఒక కీరదోసకాయను శుభ్రంగా కడిగి, చిన్న ముక్కలుగా తరగండి. ఈ ముక్కలను ఒక గ్లాసు నీటిలో వేసి, రాత్రంతా నానబెట్టండి. ఉదయాన్నే ఆ నీటిని వడకట్టి తాగండి. కావాలంటే, రుచి కోసం నిమ్మరసం, పుదీనా ఆకులు కూడా కలుపుకోవచ్చు. కీరదోస నీళ్లు ప్రకృతి మనకు ప్రసాదించిన ఓ వరం. వీటిని తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు. మరి ఇంకెందుకు ఆలస్యం? ఈరోజే కీరదోస నీళ్లను మీ ఆహారంలో భాగం చేసుకోండి. ఆరోగ్యాన్ని, అందాన్ని సొంతం చేసుకోండి!




# అందానికి ఆహారం

వేసవిలో అందాన్ని కాపాడుకోవడం.. కొంచెం కష్టంగానే ఉంటుంది. ముఖ్యంగా చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే.. అదనపు జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తుంది. అయితే, బయటినుంచి ఎన్ని క్రీములు రాసినా, ఎంత మెరుగులు దిద్దినా మండే ఎండల్లో వ్యర్థమే అవుతుంది. సరైన ఆహారం తీసుకున్నప్పుడే.. వన్నె తగ్గని అందం సొంతమవుతుంది. ఈ క్రమంలో చర్మ సంరక్షణలో కొన్ని ముఖ్యమైన అంశాలను అందించే ఆహారాన్ని తీసుకోవాలని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. హైడ్రేషన్: వేసవిలో చర్మం హైడ్రేటెడ్‌గా ఉండాలంటే.. అవకాడో, పుచ్చకాయలు, దోసకాయలు, స్వీట్ పొటాటో, టమాటా, గ్రీన్ టీ.. తీసుకోవడం మంచిది. అవకాడోలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, విటమిన్లు.. శరీరానికి మరింత శక్తినిస్తాయి. ఇందులోని యాంటి ఏజింగ్ లక్షణాలు.. చర్మం ముడతలు పడకుండా కాపాడతాయి. స్వీట్ పొటాటో.. నేచురల్ సన్‌బ్లాక్‌గా పనిచేస్తుంది. చర్మాన్ని కాంతిమంతంగా మారుస్తుంది. ఇందులో అధిక మొత్తంలో లభించే బీటా కెరోటిన్.. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పుచ్చకాయలు, దోసకాయలు అధిక శాతం నీటితో నిండి ఉంటాయి. ఇవి చర్మాన్ని హైడ్రేట్ చేయడంతోపాటు ఇన్‌ఫ్లమేషన్, చికాకును తగ్గిస్తాయి. వడదెబ్బ వల్ల కలిగే నొప్పిని నివారిస్తాయి. విటమిన్లు: వేసవిలో దెబ్బతిన్న చర్మం మళ్లీ మెరుగ్గా మారాలంటే.. ఆహారంలో విటమిన్లు అధికంగా ఉండేలా చూసుకోవాలి. కొలాజెన్ ఉత్పత్తి కోసం ఆహారంలో విటమిన్ సి ఉండాలి. నారింజ, నిమ్మకాయలు, ద్రాక్షపండ్లలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. క్యారెట్లలో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది చర్మంపై ముడతలు, గీతలు తగ్గించడంతోపాటు చర్మ ఆరోగ్యాన్ని కాపాడటంలో ముందుంటుంది. కేల్ ఆకుకూర.. వేసవిలో అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులోని విటమిన్ ఎ.. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీన్ని సలాడ్, సూప్‌లో తీసుకోవడం ద్వారా.. ఇందులోని విటమిన్లన్నిటినీ శరీరానికి అందించవచ్చు. ఇక గ్రీన్ టీలో ఉండే శక్తిమంతమైన ఫ్లేవనాయిడ్స్.. చర్మాన్ని ఫ్రీరాడికల్స్ నుంచి రక్షిస్తాయి. చర్మం ఎక్కువగా సాగకుండా నిరోధించడంతోపాటు ముడతలు పడకుండా చూస్తాయి. ఉల్లి వెల్లుల్లి కలిపి తింటే..వంటింట్లో ఉల్లి, వెల్లుల్లి తప్పనిసరిగా ఉంటాయి. దాదాపుగా అన్ని రకాల ఆహారాల్లో వీటిని వాడుతూ ఉంటారు.

# ముడతలు అన్నీ మాయం: ఇంట్లోనే ఈజీగా
# చేసుకునే బెస్ట్ ఫేస్ మాస్క్..

## అందమే అసూయపడేలా అవుతారు

సాధారణంగా మన వయస్సు పెరిగే కొద్దీ మొఖం మీద ముడతలు వస్తాయి. చర్మం కుంగిపోవడం ప్రారంభమవుతుంది. సన్నని గీతలు కనిపించడం ప్రారంభిస్తాయి. ఇవన్నీ వృద్ధాప్యాన్ని సూచిస్తుంటాయి. అయితే ఇంట్లోనే తయారుచేసుకునే కొన్ని రకాల ఫేస్ మాస్క్ ల ద్వారా, మన ఆహారంలో చిన్న చిన్న మార్పులు ద్వారా వీటిని తగ్గించవచ్చు. ఇందుకోసం కొల్లాజెన్‌ను పెంచే వాటిని మీ ఆహారంలో చేర్చండి. కొల్లాజెన్ మన చర్మాన్ని మృదువుగా చేస్తుంది. ఇది చర్మానికి స్థితిస్థాపకతను ఇస్తుంది. మీ రోజువారీ ఆహారంలో ఉసిరి, నిమ్మకాయ నీటిని చేర్చుకోండి. నువ్వులను కూడా వాడండి. అయితే వీటితో తయారుచేసే ఫేస్ మాస్క్ చర్మానికి సహజ బూస్టర్‌గా పనిచేస్తుంది, చర్మం దాని స్థితిస్థాపకతను తిరిగి పొందడానికి సహాయపడుతుంది. ఫేస్ మాస్క్ ఇలా చేయండి ఈ ఫేస్ మాస్క్ సిద్ధం చేయడానికి 2 టీస్పూన్ల తెల్ల నువ్వులు, 2 టీస్పూన్ల వేరుశెనగలు, 1 టీస్పూన్ ఆలివ్ నూనె తీసుకోవాలి. మూడు చీజ్‌లను శుభ్రమైన మిక్సర్ చలో వేసి బాగా గ్రైండ్ చేసి పెట్టుకోవాలి మీ ముఖానికి మసాజ్ చేయండి ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ఒక గాజు గిన్నెలో పోసి అందులో 1 టీస్పూన్ తేనె కలిపి పేస్ట్ లా చేయండి. ఈ పేస్ట్ ని మీ ముఖం మీద పేస్ట్ లాగా అప్లై చేయండి. ఇప్పుడు లైట్ మసాజ్ చేయండి. మసాజ్ చేయడానికి,మీ బొటనవేలును తీసివేసి దానిని పిడికిలిగా చేసి మీ గడ్డం చుట్టూ ఉన్న చర్మాన్ని పైకి ఎత్తండి. మసాజ్ చేయడానికి మీ వేళ్ల కీళ్లను ఉపయోగించండి. మీ మొఖం మొత్తాన్ని 10 నిమిషాల పాటు పూర్తిగా మసాజ్ చేసిన తర్వాత మీ ముఖంపై మందపాటి మాస్క్ పొరను వేయండి. ఖరీదైన షాంపూ, ఆయిల్స్ అవసరం లేదు.. ఇదొక్కటి చేస్తే జుట్టు అరికాళ్ల వరకు పెరుగుతుంది! ఎలా తొలగించాలి మాస్క్ అప్లై





చేసిన తర్వాత 1 గంట పాటు అలాగే ఉంచండి. ఆరిన తర్వాత మీ ముఖాన్ని నీటితో సున్నితంగా తడిపి స్క్రబ్ లాగా శుభ్రం చేయండి. ఇప్పుడు మీ ముఖాన్ని శుభ్రమైన నీటితో కడుక్కోండి,స్టీమర్ లో కొన్ని పుదీనా ఆకులను వేసి ఆవిరి పట్టండి. ఇలా కొద్దిసేపు ఆవిరి పట్టిన తర్వాత మీ ముఖాన్ని టవల్ తో కప్పుకోండి. ఇలా 10 నిమిషాలు అలాగే ఉంచి, ఆపై మీ ముఖం నుండి టవల్ తొలగించండి. కొన్ని రోజుల్లోనే మీరు తేడాను గమనించవచ్చు. మీ చర్మం మెరిసిపోతుంది.

# మార్కెట్

## రిలయన్స్‌కు కేజీ దెబ్బ

### కేంద్రం నుంచి రూ.24,500 కోట్ల డిమాండ్ నోటీస్

న్యూఢిల్లీ .: కృష్ణా–గోదావరి (కేజీ) బేసిన్‌లో గ్యాస్ ఉత్పత్తికి సంబంధించిన వివాదంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, దాని భాగస్వాములకు కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.24,500 కోట్ల (2.81 బిలియన్ డాలర్లు) డిమాండ్ నోటీసు ఇచ్చింది. కేజీ బేసిన్‌లో రిలయన్స్, బ్రిటీష్ పెట్రోలియం, జపాన్‌కు చెందిన నికో సంస్థలు కలిసి చమురు, గ్యాస్ ఉత్పత్తి చేస్తున్న విషయం తెలిసిందే. అయితే పక్కనే ఉన్న ప్రభుత్వ రంగ చమురు, గ్యాస్ ఉత్పాదక దిగ్గజం ఓఎన్‌జీసీకి చెందిన క్షేత్రాల నుంచి వస్తున్న గ్యాస్‌ను రిలయన్స్, దాని భాగస్వామ్య సంస్థలు వెలికితీసి, అమ్ముకున్నాయన్న వివాదం తలెత్తింది. ఈ క్రమంలోనే 2016లో 1.55 బిలియన్ డాలర్లు చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం రిలయన్స్, ఇతర కంపెనీలకు నోటీసులిచ్చింది. దీనిపై అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్‌కు రిలయన్స్, కంపెనీలు వెళ్లాయి. 2018 జూలైలో రిలయన్స్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో 2023 మేలో ఢిల్లీ హైకోర్టును ప్రభుత్వం ఆశ్రయించగా, సింగిల్ జడ్జి ధర్మాసనం కూడా రిలయన్స్‌కే మద్దతిచ్చింది. అయితే గత నెల ఫిబ్రవరి 14న దీన్ని డివిజన్ బెంచ్ కొట్టేసింది. ప్రభుత్వానికే అనుకూలంగా తీర్పిచ్చింది. దీంతో రూ.24,500 కోట్ల డిమాండ్ నోటీసు కేంద్రం పంపినట్టు స్టాక్ ఎక్స్చేంజీలకు రిలయన్స్ తెలిపింది. దీనిపై సవాల్ చేస్తామని కూడా ప్రకటించింది. మరోవైపు బ్యాటరీ సెల్ ప్లాంట్ ఒప్పందాన్ని మీరినందుకు రిలయన్స్‌పై కేంద్రం రూ.50 కోట్ల జరిమానా వేసింది.




# మార్కెట్ దెబ్బకి ఎల్ఐసీ విలవిల

## భారీగా నష్టపోతున్న స్టాక్ పోర్ట్‌ఫోలియో

ఈ ఏడాది మొదలు రూ.1.5 లక్షల కోట్లు ఆవిరి

ముంబై : ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)కు స్టాక్ మార్కెట్ నష్టాల సెగ గట్టిగానే తగులుతున్నది. దేశీయ సంస్థాగత మదుపర్లలో అతిపెద్దదైన ఎల్ఐసీకి ఘనమైన ఈక్విటీ పోర్ట్‌ఫోలియోనే ఉన్నది. అయితే 310కిపైగా షేర్లతో కూడిన ఈ పోర్ట్‌ఫోలియో వాల్యూ.. గతకొంత కాలంగా క్షీణిస్తున్న స్టాక్ మార్కెట్లతో భారీగానే ఆవిరైపోతున్నది. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా దాదాపు రూ.1.5 లక్షల కోట్లు హరించుకుపోవడం గమనార్హం. గత ఏడాది డిసెంబర్ ఆఖరునాటికి సుమారుగా రూ.14.9 లక్షల కోట్లుగా ఉన్న ఎల్ఐసీ స్టాక్ పోర్ట్‌ఫోలియో విలువ.. గత నెల చివర్లో దాదా పు రూ.13.4 లక్షల కోట్లకు పరిమితమైంది. దీంతో కేవలం జనవరి, ఫిబ్రవరి నెలల్లో రూ.1.45 లక్షల కోట్లు పడిపోయినైట్టైంది. ఇదీ సంగతి.. ఇంచుమించుగా ఎల్ఐసీ పెట్టుబడులు పెట్టిన అన్ని కంపెనీల షేర్లు నష్టాలనే పంచుతుండటం ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్నది. స్మాల్, మిడ్‌క్యాప్ షేర్లతోపాటు లార్జ్‌క్యాప్ షేర్లూ నిరాశపరుస్తున్నాయి. ఐటీసీ విషయానికే వస్తే.. ఈ కంపెనీ షేర్లపై ఎల్ఐసీ పెట్టిన పెట్టుబడుల విలువ ఏకంగా రూ.17వేల కోట్లపైనే పడిపోయింది. టీసీఎస్ (4.75 శాతం), ఇన్ఫోసిస్ (10.58 శాతం)ల్లోనూ వాటాలుండగా, రూ.18వేల కోట్లకుపైగా పోయాయి. ఆర్థిక రంగంలో.. ఎస్బీఐ (9.13 శాతం), ఐసీఐసీఐ బ్యాంక్ (7.14 శాతం), జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ (6.10 శాతం)ల్లోనూ ఎల్ఐసీకి పెద్ద ఎత్తునే వాటాలున్నాయి. మార్కెట్ నష్టాలతో రూ.15వేల కోట్లకుపైగా నష్టాలు వచ్చిపడ్డాయి. ఎల్అండ్‌టీ, హెచ్‌సీఎల్ టెక్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ తదితర షేర్లూ.. గడిచిన 2 నెలల్లో రెండంకెల స్థాయి శాతాల్లో నష్టాలు మిగిల్చాయి. ఆ రంగం.. ఈ రంగం అన్న తేడా లేకుండా దాదాపు అన్నింటి వాటాలూ దిగజారాయి. కాగా, ప్రస్తుతం స్టాక్ మార్కెట్లలో నెలకొన్న అస్థిర పరిస్థితులు, అమ్మకాల ఒత్తిళ్లను చూస్తుంటే.. ఎల్ఐసీకి మరిన్ని నష్టాలు తప్పేలా లేవు. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐలు) అదేపనిగా తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటం, చిన్న, మధ్యశ్రేణి షేర్లు బలహీనపడుతుండటం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నది.


పాలసీదారుల నమ్మకానికి పరీక్ష.. బీమా అంటే ఎల్ఐసీ.. ఎల్ఐసీ అంటే బీమా. భారతీయులకు ఈ సంస్థపై అంతటి ధీమా మరి. ఇక ప్రభుత్వ రంగ సంస్థ కావడం, ఏండ్ల తరబడి సేవలు అందిస్తుండటం, పట్టణాలు–గ్రామాలు అన్న తేడా లేకుండా దేశవ్యాప్తంగా లక్షలాది ఏజెంట్లు, కోట్లాది కస్టమర్లు కలిగి ఉండటం ఎల్ఐసీకి కలిసొచ్చే అంశం. సామాన్యులు ముఖ్యంగా మధ్యతరగతి వర్గాలు తమ కష్టార్జితాన్ని ఎంతో ఇష్టంగా ఎల్ఐసీలో పెట్టి నిశ్చింతగా ఉంటారంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. అయితే మోదీ సర్కారు స్టాక్ మార్కెట్లలో ఎల్ఐసీ పెట్టుబడులకు తలుపులు బార్లా తెరవడంతో ఇప్పుడు ఈ నమ్మకం అందరిలోనూ సడలుతున్న దుస్థితి. ఇంకా చెప్పాలంటే ఎల్ఐసీ పెట్టుబడి వ్యూహాలు.. పాలసీదారుల రాబడులపైనే అనుమానాల్ని రేకెత్తిస్తున్నాయన్న విమర్శలు అన్ని వర్గాల నుంచి గట్టిగా వస్తుండటం ఒకింత భయాందోళనల్నే కలిగిస్తున్నాయి.




## ట్రంప్ టారిఫ్ ఇక్కట్లు.. బంగారం ధరలకు రెక్కలు..

### రూ.89వేల మార్క్‌కు పుత్తడి..!

అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగా దేశీయ బులియన్ మార్కెట్లలో జ్యువెల్లర్లు, రిటైలర్లు, స్టాకిస్టుల నుంచి కొనుగోళ్ల మద్దతు లభించడంతో మంగళవారం బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. ఒక్కరోజే 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.1,100 వృద్ధి చెంది తిరిగి రూ.89 వేల మార్క్‌ను చేరుకుందని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ తెలిపింది. సోమవారం 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.87,900 వద్ద ముగిసింది. మరోవైపు 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.1,100 పుంజుకుని రూ.88,600 పలికింది. సోమవారం 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.87,500 వద్ద స్థిర పడింది. మరోవైపు, కిలో వెండి ధర రూ.1,500 వృద్ధితో రూ.98,000లకు చేరుకుంది. సోమవారం కిలో వెండి ధర రూ.96,500 వద్ద ముగిసింది. కెనడా, మెక్సికో, చైనాలపై విధించిన టారిఫ్‌లు యధాతథంగా అమల్లోకి వస్తాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం ధృవీకరించడంతో బంగారం ధరలకు రెక్కలొచ్చాయని బులియన్ వ్యాపారులు చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చర్యలకు ప్రతిగా యూఎస్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలు పెంచుతామని చైనా, కెనడా ప్రకటించడంతో నార్త్ అమెరికా పొడవునా ఉద్రిక్తతల పెరుగుదలకు దారి తీసింది.



# శాసన మండలిలో రైతు సమస్యలపై చర్చ

**వ్యవసాయంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు**

**వాకౌట్ చేసిన వైకాపా సభ్యులు**

**వైకాపా తీరుపై మండిపడ్డ మంత్రులు**

అమరావతి,మార్చి5(ఆర్ఎన్ఎ):ఏపీ అసెంబ్లీ సమావేశాలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. మండలిలో ప్రశ్నోత్తరా లసమయం కొనసాగుతోంది. అసెంబ్లీకి మాత్రం వైకాపా సభ్యులు హాజరు కావడంలేదు. మండలిలో మాత్రం చర్చల్లో ఆ పార్టీ సభ్యులు పాల్గొంటున్నారు. పలు అంశాలను మంత్రులు శాసన మండలిలో ప్రస్తావించారు. శాసన మండలిలో రైతు సమస్యలపై చర్చ జరిగింది. ప్రభుత్వానికి రైతులు, వ్యవసాయంపై చిత్త శుద్ధి లేదని సభ నుంచి వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారు. అన్నదాత సుఖీభవ అమలుపై అచ్చెన్నాయుడు కీలక ప్రకటన చేశారు. మే నెల నుంచి అన్నదాత సుఖీభవ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. అర్హత కలిగిన రైతులందరికీ రూ. 20 వేల నగదు అందజేస్తామని చెప్పారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ అమలుపై విధివిధానాలు ఖరారు చేస్తున్నామని అన్నారు. వైసీపీ ప్రభుత్వం మాదిరిగా తాము రైతులను మోసం చేయమని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో వ్యవసాయ రంగాన్ని



నష్టపరిచిందని అన్నారు. వ్యవసాయ యంత్రాలు లేవు, భూసార పరిక్షలు లేవు, పంటల భీమా చెల్లింపులు లేవని అన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. వచ్చే సీజన్ నాటికి హంద్రీనీవా ప్రాజెక్టుకు సంబంధించి తక్షణం చేయాల్సిన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలకు సంబంధించి జీవనాడి అయినా హంద్రీ నీవా ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని తెలిపారు. అందువల్లనే రాష్ట్రంలో ఇంతకుముందు ఎన్నడూ లేని విధంగా కనీవిని ఎరుగని రీతిలో ఏడాది బ్జడెట్లో అత్యధికంగా హంద్రీనీవాకు రూ.3243 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. హంద్రీనీవా పాపానికి, జాప్యానికి రాయలసీమ ముద్దుబిడ్డననే చెప్పుకునే జగనే ముమ్మాటికి కారణమని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో హంద్రీనీవాకు సంబంధించి 80 శాతం పనులు పూర్తయితే జగన్ ఐదేళ్ల పాలనలో ఒక్క శాతం పనులు కూడా పూర్తి చేయలేక చేతులెత్తేశారని విమర్శించారు. ఈ రకంగా రాయలసీమ ప్రజల పాలిట జగన్ ద్రోహిగా మిగిలిపోయారని చెప్పారు. 2014 - 19 టీడీపీ పాలనలో హంద్రీనీవాకు రూ.4000 కోట్లు ఖర్చు పెడితే వైసీపీ పాలనలో కేవలం రూ.500 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని అన్నారు. హంద్రీనీవాలో 3850 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న మోటార్లను సైతం పూర్తిస్థాయిలో వైసీపీ ప్రభుత్వం ఉపయోగించుకోలేదని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

## సిఎం చంద్రబాబుతో గాదె శ్రీనివాసులు నాయుడు భేటీ

**ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషికి హామీ**

అమరావతి : టీచర్ల సమస్యల పరిష్కారానికి మంత్రి నారా లోకేష్ విశేషంగా కృషి చేస్తున్నారని, ప్రభుత్వ పాలసీల రూపకల్పన విషయంలో ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాకే నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, నాణ్యమైన బోధనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉపాధ్యాయ సంఘాలు కృతజ్ఞతలు తెలిపాయి. ముఖ్యమంత్రి చంద్రబాబును ఉండవల్లిలోని నివాసంలో బుధవారం ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు కలిశారు. గాదె శ్రీనివాసులు నాయుడిని ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. కూటమి ప్రభుత్వానికి తన మద్దతు గాదె శ్రీనివాసులు నాయుడు ప్రకటించారని చెప్పారు. ప్రభుత్వానికి -ఉపాధ్యాయులకు మధ్య శ్రీనివాసులు నాయుడు వారధిగా పనిచేస్తారని సీఎం చంద్రబాబుకు ఉపాధ్యాయ సంఘాలు తెలిపాయి. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సహకారంతో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు తెలిపారు. తన గెలుపు కోసం సీఎం చంద్రబాబుతో పాటు కూటమి పార్టీలన్నీ సహకరించాయని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉంటే ఆ ప్రభుత్వంతో కలిసి పని చేయటం తనకు అలవాటు అని చెప్పారు. చంద్రబాబు ఆశీర్వాదంతో తనకు కొండంత ధైర్యం వచ్చిందని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు పేర్కొన్నారు.

## పిపిపి మోడల్‌లో 10 మెడికల్ కాలేజీల నిర్మాణం

**మండలిలో వైకాసా సభ్యుల ప్రశ్నలకు మంత్రి సమాధానం**

అమరావతి : రాష్ట్రంలో 10 మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో నిర్మాణం చేస్తున్నామని మంత్రి సత్య కుమార్ తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో 17 కొత్త మెడికల్ కాలేజీలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కాలేజీల నిర్మాణంపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. కేవలం 15 శాతం పనులు మాత్రమే గత ఐదేళ్లలో పూర్తి చేశారని అన్నారు. ఏపీలో మెడికల్ కాలేజీలపై శాసనమండలిలో చర్చ జరిగింది. మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేస్తున్నారా అంటూ వైసీపీ సభ్యులు ప్రశ్నించారు. వైసీపీ సభ్యుల ప్రశ్నలకు వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ సమాధానం చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణాల గురించి పట్టించుకోని నేతలు ఇప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఒక్క పులివెందుల కాలేజికి మాత్రం 59 శాతం నిధులు ఖర్చు చేశారన్నారు. టెండర్‌లే పిలవని పార్వతీపురం కాలేజీని అద్భుతంగా కట్టామని అప్పటి డిప్యూటీ సీఎం చెప్పడం హాస్యస్పదంగా ఉందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం మెడికల్ విద్యను పేద వాడికి దూరం చేసిందని మంత్రి సత్య కుమార్ విమర్శించారు.

## సమన్వయంతో మహిళా దినోత్సవ వేడుకలు ను విజయవంతం చేద్దాం..

**మహిళా భద్రత, సాధికారతను ప్రతిబింబించేలా స్టాళ్ల ఏర్పాటు**

**డీఆర్‌డీఏ, మెప్మా తదితర విభాగాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు**

**ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో వేడుకల నిర్వహణ**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా భద్రత, సాధికారతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాయని.. వివిధ పథకాలు, కార్యక్రమాల ఫలాలను స్త్రీ శక్తికి చేరువచేసి, వారిని సమగ్రాభివృద్ధి దిశగా నడిపించేలా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేద్దామని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో వేడుకల నిర్వహణకు సంబంధించి దిశానిర్దేశర చేసేందుకు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు గుమ్మిడి సంధ్యారాణి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేడుకల నిర్వహణకు సూచనలు చేశారు. ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా వివిధ శాఖల సమష్టి భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ.. డీఆర్‌డీఏ, మెప్మా, వైద్య ఆరోగ్యం, స్త్రీ, శిశు సంక్షేమం, పరిశ్రమలు తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, శాఖల వారీగా కార్యాచరణను వివరించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించు కొని రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయం మొదలు, రాష్ట్ర స్థాయి వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని.. ఎన్‌టీఆర్ జిల్లాస్థాయి కార్యక్రమం నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. గౌరవ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేయాలన్నారు. వివిధ శాఖల పరిధిలో మహిళాభివృద్ధికి అమలవుతున్న పథకాలు, కార్యక్రమాలపై మహిళలను జాగృతం చేసి.. వాటిని సద్వినియోగం చేసుకునేలా ముందుకు నడిపించేందుకు స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. డీఆర్‌డీఏ, మెప్మా తదితర విభాగాలు ఇందుకు ప్రణాళికాయుతంగా వ్యవహరించాలన్నారు. బ్యాంకు లింకేజీ మద్దతు, ప్రకృతి సేద్యం ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, మిల్లెట్స్ విలువ జోడింపు, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు చేయూతనిచ్చే పథకాలు, కార్యక్రమాలు, పోషణ భద్రత, పీఎం విశ్వకర్మ, పీఎంఈజీపీ వంటి పథకాలు, లఖ్‌పతిదీదీ, డ్రోన్ దీదీ తదితరాలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. మహిళల భద్రతకు ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా వినియోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వంటివాటిపైనా దృష్టిసారించాలని.. ప్రత్యేక అవగాహన ర్యాలీల నిర్వహణకూ ఏర్పాటు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, పీవో-యూసీడీ వెంకటరత్నం, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, డా. ఎన్‌టీఆర్ వైద్యసేవ సమన్వయకర్త డా. జె.సుమన్, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, ఏసీపీ కె.లతాకుమారి, ఎల్‌డీఎం కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌ను కించపరిచేలా చేయవద్దు

**ప్రతిపక్ష హోదా ఇస్తే వచ్చేది కాదు**

**గతంలో సభలో జగన్ ఏం మాట్లాడారో గుర్తుకు తెచ్చుకోవాలి**

**మంత్రులు లోకేశ్, నాదెండ్ల మనోహర్‌ల వ్యాఖ్యలు**

అమరావతి : వైకాపా అధ్యక్షుడు జగన్ ప్రతిపక్ష బాధ్యతను నిర్వహించకుండా ఆ హోదా కోరుకోవడం శోచనీయమని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. సభలో గవర్నర్‌ను అవమానించడం అత్యంత దారుణమని మండిపడ్డారు. బుధవారం శాసనసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాల్లో శాసనసభలన్నీ పార్లమెంట్ సంప్రదాయాలనే అనుసరిస్తాయన్నారు. సెక్షన్ 121 సి ప్రకారం ఏదైనా సభలో సభ్యుల సంఖ్యలో పదో వంతు ప్రతిపక్షానికి ఉండాలని లోక్‌సభలో రూలింగ్ ఉందని లోకేశ్ గుర్తుచేశారు. తెదేపాకు ఉన్న 23 మంది శాసనసభ్యుల్లో ఐదుగురిని లాగేస్తే చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా కూడా ఉండదంటూ గతంలో సీఎంగా జగన్ చేసిన వ్యాఖ్యలను లోకేశ్ ప్రస్తావించారు. ఇప్పుడు స్పీకర్‌పై వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ సభ గౌరవాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజాతీర్పును గౌరవించి వారి కోసం పోరాడాల్సిన బాధ్యత పార్టీలదేనని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కంటే ఎక్కువ భద్రత జగన్‌కు కల్పిస్తున్నామన్నారు. తగిన సభ్యులు లేకుండా ప్రతిపక్ష హోదా కోరుకుంటూ దుష్ప్రచారం చేసే సంప్రదాయం కొనసాగకూడదన్నారు. ప్రభుత్వం ఎక్కడా వ్యక్తిగత కక్షలకు వెళ్లడం లేదని మంత్రి నారా లోకేశ్ అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ రెడ్డికి ఉప ముఖ్యమంత్రి కంటే ఎక్కువగా జడ్ ప్లస్ సెక్యూరిటీ ఇచ్చామన్నారు. స్పీకర్‌పై తప్పుడు రాతలు బాధాకరమన్నారు. ఎవరు ఎక్కడ ఉండాలో ప్రజలు నిర్ణయిస్తారని, ప్రజాప్రతినిధులుగా ప్రజలు తరపున పోరాడాల్సి ఉందన్నారు. ఎవరు అధికారంలో ఉన్నా ఇది కరెక్టు కాదని, చట్టసభల్లో అర్థవంతమైన చర్చలు జరిగితేనే ప్రజలకు మేలు జరుగుతుందని మంత్రి చెప్పుకొచ్చారు. బుధవారం అసెంబ్లీలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడారు. 'చట్టసభలు చూస్తూ పెరిగా. చిన్నవయసులో చట్టసభలను చూశాను. అప్పట్లో వ్యక్తిగత దూషణలు ఉండేవి కావు, ప్రజలకు ఏమి కావాలో దానిపైనే చర్చలు జరిగేవి. చట్టసభల్లో ఇది నాకు రెండో అవకాశం. తొలిసారి శాసనసభకు వచ్చా. ఇటీవల ప్రతిపక్ష సభ్యులు బాధ్యత లేకుండా గవర్నర్ స్పీచ్‌ను డిస్టర్బ్ చేసి వెళ్లారు. గతంలో మేం నిరసన తెలియజేసినపుడు బెంచిల వద్దే ఉండి ధర్నా చేశాం. పోడియం వద్దకు రాలేదు, మేం ఎప్పుడూ లక్ష్మణరేఖ దాటలేదు. నేను అసెంబ్లీలో కొత్త మెంబర్. పార్లమెంటులోని 121సి నిబంధన ప్రకారం ప్రతిపక్ష హోదాకు టోటల్ నెం.లో 1/10 ఉండాలని స్పష్టంగా ఉంది. అసెంబ్లీ కండీషన్స్ ఫర్ రికగ్నిషన్లో కూడా ఈ విషయం పొందుపర్చబడి ఉంది' అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. స్పీకర్‌పై వ్యక్తిగత ఆరోపణలు చేయడం హౌస్ పరువు తగ్గిస్తుంది. ఎవరు ఎక్కడ ఉండాలో ప్రజలు నిర్ణయిస్తారు. ప్రజాప్రతినిధులుగా ప్రజలు తరపున పోరాడాల్సి ఉంది. జగన్ రెడ్డికి ఉప ముఖ్యమంత్రి కంటే ఎక్కువగా జడ్ ప్లస్ సెక్యూరిటీ ఇచ్చాం. ప్రభుత్వం ఎక్కడా వ్యక్తిగత కక్షలకు వెళ్లడం లేదు. చట్టాన్ని ఉల్లంఘించడం, దానిని హౌస్ పైన రుద్దడం బాధాకరం. ఎవరు అధికారంలో ఉన్నా ఇది కరెక్టు కాదు. చట్టసభల్లో అర్థవంతమైన చర్చలు జరిగితేనే ప్రజలకు మేలు జరుగుతుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ప్రతిపక్ష హోదాపై వైకాపా నేతలు కావాలనే బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు. జగన్ తనకు లేని అధికారాన్ని కోరుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు గౌరవం ఇవ్వకుండా ఛీ కొట్టినప్పుడు హోదా ఇవ్వాలని ఎలా కోరుకుంటారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై ప్రచార మాధ్యమాల్లో చేస్తున్న దుష్ప్రచారంపై సభా హక్కుల సంఘానికి నివేదించాలని జనసేన తరపున కోరుతున్నట్లు తెలిపారు. జగన్ అనాలోచిత వ్యాఖ్యలు, మూర్ఖమైన నిర్ణయాలను ఇతరులకు ఆపాదించటం సరికాదని హితవు పలికారు.

## ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీలు

**జనసేన నుంచి నాగబాబు పేరు ఖరారు**

**నామినేషన్‌కు సిద్ధంగా ఉండాలని పవన్ సూచన**

అమరావతి : ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సోదరుడు కొణిదెల నాగబాబు పేరు ఖరారైంది. ఎమ్మెల్యేల కోటాలో నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికలకు కూటమిలో భాగంగా జనసేన అభ్యర్థిగా నాగబాబు పేరును పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ ఖరారు చేశారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగబాబు సేవలందిస్తున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయాలని నాగబాబుకు పవన్ సమాచారం ఇచ్చారు. నామినేషన్‌కు అవసరమైన పత్రాలు సిద్ధం చేయాలని పార్టీ కార్యాలయాన్ని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొత్తం ఐదు స్థానాల్లో ఒకరి అభ్యర్థి పేరు ఖరారైంది. జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు పేరును ఖరారు చేస్తూ పవన్ కళ్యాణ్ అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న నాగబాబును ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నుకుంటారని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. దాదాపు గంటపాటు ఈ భేటీ జరిగింది. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు ఎంపికపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అంతకుముందు నాగబాబును కేబినెట్‌లోకి తీసుకుంటామని ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై సోషల్ మీడియాలో నెగిటివ్ కామెంట్స్ రావడాన్ని గమనించిన జనసేన ఆయనకు రాజ్యసభకు పంపాలని భావించారు. విజయసాయి రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన స్థానంలో నాగబాబును పంపించాలని అనుకునున్నప్పటికీ ఆ స్థానాన్ని ఖాళీ చేయించింది బీజేపీ కాబట్టి... ఆ స్థానాన్ని కమలం పార్టీకి వదలాలి అనే సూచనలు కూడా వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో బుధవారం ఉదయం సీఎం చంద్రబాబుతో మాట్లాడిన తర్వాత పవన్ కళ్యాణ్... ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీగా నాగబాబు పేరును ఖరారు చేసినట్లు జనసేన పొలిటికల్ సెక్రటరీ, ఎమ్మెల్సీ హరిప్రసాద్ అధికారికంగా జనసేన గ్రూప్‌లో పోస్ట్ చేశారు. ఈనెల పదవ తేదీలోపు నామినేషన్ వేయాల్సిన నేపథ్యంలో మంచి రోజు చూసుకుని నాగబాబు నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. అలాగే మిగిలిన నలుగురు ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లు కూడా ప్రకటించగా.. ఐదుగురు కలిసి నామినేషన్ వేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇక ఐదుగురు ఎమ్మెల్సీలో నాగబాబు పేరు ఖరారవగా.. మిగిలిన నాలుగు ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లను ప్రకటించాల్సి ఉంది. అయితే నాగబాబు రాజ్యసభకు వెళ్తే ఐదు ఎమ్మెల్సీల్లో ఒకటి టీడీపీ నుంచి వంగవీటి రాధాకు ఇస్తారనే అంతా భావించారు. కానీ ఇప్పుడు ఎమ్మెల్సీగా నాగబాబు పేరు ఖరారు చేయడంతో ప్రస్తుతం ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈరోజు సీఎం చంద్రబాబు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఆయన తిరిగి వచ్చిన తర్వాత కేబినెట్ సమావేశం అనంతరం ఎమ్మెల్సీలు ఎవరనేది ప్రకటించనున్నట్లు సమాచారం. అయితే ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి బీజేపీ అడుగగా.. ఇప్పటికే ఒక స్థానం నాగబాబుకు ఇచ్చేయడంతో బీజేపీకి ఇచ్చే అవకాశం లేదని చంద్రబాబు ముందుగానే స్పష్టం చేసినట్లు తెలిసింది. మరి మిగిలిన నాలుగు ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులు ఎవరు అనేది ఉత్కంఠంగా మారింది.

## ఎన్నికల ముందు ఎగిరెగిరి పడ్డ జగన్

**ఇప్పుడేమో ఎదురుదాడి విమర్శలు**

**పవన్ గురించి మాట్లాడే అర్హత లేదు**

**మండిపడ్డ మంత్రి నాదెండ్ల మనోహర్**

అమరావతి : వై నాట్ 175 అని ఎగిరిన మనిషి 11కు పడిపోవడంతో మతి భ్రమించి, ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మాజీ సీఎం జగన్‌పై పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తీవ్రంగా విమర్శలు గుప్పించారు. జర్మనీ చట్టాలు ఏపీలో అమలు చేస్తానంటే ఎలా? అని ప్రశ్నించారు. తాడు బొంగరం లేని పార్టీ వైసీపీ అని సెటర్లు వేశారు. ఇంగిత జ్ఞానం లేదు కాబట్టే తనకు తాను శాశ్వత పార్టీ అధ్యక్షుడిగా జగన్ ప్రకటించుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ప్రజా జీవితంలో ఒక్క రూపాయి అయినా ఇచ్చి దాతగా జగన్ నిలబడ్డాడా ? పవన్ కళ్యాణ్ వేలాదిమందికి ఆర్థిక సాయం చేశారని అన్నారు. నిన్నటి పట్టభద్రుల ఎన్నికల్లో తీర్పు ఇచ్చింది యువత కాదా? సూపర్ 6 గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. మాటకు కట్టుబడి ఉంటూ విలువలతో కూడిన రాజకీయాలు చేయటం జగన్ అలవాటు చేసుకోవాలని సూచించారు. రైతులకు ధాన్యం కొనుగోళ్లు బకాయిలు పెట్టి వెళ్లిపోయిన వాడు ఇవాళ రైతుల గురించి మాట్లాడుతున్నాడని అన్నారు. నిజాయితీగా ఒక్కరోజైనా జగన్ పనిచేశాడా? అని ÷ర్ అయ్యారు. అధికారంలో ఉండగా వర్క్ ఫ్రమ్ హోమ్ ముఖ్యమంత్రిగా ముద్రపడిన వ్యక్తి కాస్త ఇప్పుడు వర్క్ ఫ్రమ్ బెంగుళూరు ఎమ్మెల్యేగా మారాడని కామెంట్స్ చేశారు. జగన్ కోడికత్తికి ఎక్కువ, గొడ్డలికి తక్కువ అని మేం అనలేక కాదు, మాకు సభ్యత ఉందని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి తీరుతుంది.

## భీమిలిలో గోడకూల్చివేత ఘటన

**నేహారెడ్డి నుంచి ఖర్చులు రాబట్టండి**

**విచారణ సందర్భంగా హైకోర్టు ఆదేశం**

అమరావతి : భీమిలి బీచ్‌లో అక్రమంగా నిర్మించిన గోడల కూల్చివేత ఖర్చులను నేహారెడ్డి నుంచి రాబట్టాలని మైకోర్టు ఆదేశించింది. విశాఖపట్నంలోని భీమిలి బీచ్ వద్ద అక్రమ నిర్మాణాలపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా గోడ నిర్మాణం చేపట్టడంపై ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. విజయసాయి కుమార్తె నేహా రెడ్డి వ్యాపార భాగస్వామిగా ఉన్న కంపెనీపైనా న్యాయస్థానం మండిపడింది. కంపెనీపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులను ఆదేశించిన న్యాయమూర్తి.. అలా చేస్తేనే క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి వీలుంటుందని పేర్కొన్నారు.బీచ్‌లో గోడ తొలగించి ఆరు అడుగుల పునాదిని అలాగే వదిలేయడం సరికాదు. గోడ వల్ల కలిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలి. గోడ కూల్చివేత ఖర్చు, పర్యావరణ నష్టం నేహా రెడ్డి కంపెనీ నుంచి రాబట్టాలి అని న్యాయమూర్తి ఆదేశించారు. భీమిలి వద్ద 4 రెస్టో బార్ల అక్రమ నిర్వహణపై దాఖలైన పిల్ పైనా హైకోర్టులో విచారణ జరిగింది. రెస్టో బార్లపై సర్వే చేసి నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించింది. తదుపరి విచారణను న్యాయస్థానం మూడు వారాలకు వాయిదా వేసింది.

## సభలో బలం మేరకే ప్రతిపక్ష హోదా

**హోదా కోసం జగన్ హైకోర్టుకూ వెళ్లారు**

**బెదరింపు తరహాలో తనకూ లేఖ రాశారు**

**హోదా అన్నది స్తే రాదని స్పష్టం చేసిన స్పీకర్**

అమరావతి : ప్రతిపక్ష హోదాపై నిరాధార ఆరోపణలతో వైకాపా ఎమ్మెల్యే జగన్ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. బుధవారం సభ ప్రారంభం కాగానే ఆయన మాట్లాడారు. 'ప్రతిపక్ష హోదాపై వైకాపా ఎమ్మెల్యే జగన్ హైకోర్టుకు కూడా వెళ్లారు. న్యాయ ప్రక్రియ కొలిక్కి వచ్చేవరకు వేచి చూద్దామకున్నా. ఇటీవల జగన్, వైకాపా సభ్యులు చేసిన వ్యాఖ్యలు నా దృష్టికి వచ్చాయి. ఎంతటివారిపైనైనా అసత్యాలు ప్రచారం చేసే ధోరణితో జగన్ వ్యవహరిస్తున్నారు. వారు చేస్తున్న ఆరోపణలు గందరగోళానికి దారి తీస్తున్నాయి. స్పీకర్‌కు దురుద్దేశాలు ఆపాదించడం సభా నియమాల ఉల్లంఘన కిందికి వస్తాయి. దేవుడు తిరస్కరించిన వరాన్ని పూజారి నుంచి ఆశించడం తప్పని అయ్యన్న వ్యాఖ్యానించారు. ఇవన్నీ తెలిసీ జగన్ చేసిన ప్రేలాపనలను సభాపతి హోదాలో క్షమించి వదిలేస్తున్నా. అభియోగాలు, ప్రేలాపనలు, బెదిరింపులతో జగన్ నాకు గత ఏడాది జూన్ 24న లేఖ రాశారు. ప్రతిపక్ష హోదా కావాలంటూ హైకోర్టును కూడా ఆశ్రయించారు. తనకు ప్రతిపక్ష హోదా ఇచ్చేలా సభను ఆదేశించాలని న్యాయస్థానాన్ని కోరారు. జగన్ పిటిషన్ ఇప్పటికీ విచారణకు తీసుకోవాలా.. వద్దా అనే దశలోనే ఉంది. అయినా ప్రతిపక్ష హోదాపై ఆయన అసత్యాలు ప్రచారం చేస్తూనే ఉన్నారు. తప్పుడు ప్రచారానికి తెరదించేందుకు రూలింగ్ ఇవ్వాలని నిర్ణయించా. సభకు దూరంగా ఉంటున్న ఎమ్మెల్యేలు.. ప్రజలు తమను ఎందుకు గెలిపించారో ఆలోచించాలి. సభకు రాకుంటే తమ నియోజకవర్గ ప్రజల సమస్యలు ఎవరు లేవనెత్తుతారు? ఇవన్నీ గ్రహించి సభకు రావాలని వైకాపా సభ్యులను కోరుతున్నానని స్పీకర్ పేర్కొన్నారు.

## ఆడుదాం ఆంధ్రా అవకతవకలపై కమిటీ: మంత్రి

అమరావతి : ఆడుదాం ఆంధ్రా'లో జరిగిన అవకతవకల పట్ల పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు చాలా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని శాసన మండలిలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. లోతుగా పరిశీలించడానికి ఒక ఇండిపెండెంట్ కమిటీతో విచారణ వేసి 45 రోజుల్లో నివేదిక సమర్పిస్తామని అన్నారు. 'ఆడుదాం ఆంధ్రా' పేరిట తప్పుచేసిన అధికారులు ప్రజా ప్రతినిధుల పాత్రల గురించిన రిపోర్ట్ సభకు అందజేస్తామని అన్నారు. 'ఆడుదాం ఆంధ్రా' కోసం గత వైసీపీ ప్రభుత్వం మొత్తం రూ.119 కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. ఈ మొత్తాన్ని ఆర్ అండ్ బీ, స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్, జిల్లా కలెక్టర్స్ ద్వారా ఖర్చు చేశారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.

## భోగాపురం ఎయిర్‌పోర్టుకు మెట్రో కనెక్టివిటీ

**అసెంబ్లీలో మంత్రి నారాయణ వెల్లడి**

అమరావతి : భోగాపురం ఎయిర్ పోర్ట్‌కు గాజువాక నుంచి ట్రాఫిక్ రద్దీ తగ్గింపు, కొత్త రోడ్ల నిర్మాణంపై అసెంబ్లీలో మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... విశాఖపట్నంలో భోగాపురం ఎయిర్ పోర్ట్‌కు వెళ్లేందుకు ట్రాఫిక్ రద్దీ తగ్గింపునకు మెట్రోతో పాటు కొత్త రోడ్ల ప్రతిపాదనలు ఉన్నాయని గుర్తుచేశారు. ట్రాఫిక్ నివారణకు విశాఖ మెట్రో ప్రతిపాదన ఉందని చెప్పారు. గాజువాక నుంచి భోగాపురం వరకూ మద్దిలపాలెం, మధురవాడ మీదుగా 34.6 కిలోమీటర్లు మెట్రో నిర్మాణం జరుగుతుందని అన్నారు. మెట్రో ప్రతిపాదనలు కేంద్రానికి పంపించామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఖచ్చితంగా ఆమోదం పొందేలా చూస్తామని... ఆమోదం రాగానే పనులు ప్రారంభిస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. విశాఖపట్నంలో మెట్రో రైలు వస్తే ట్రాఫిక్ కొంతమేర తగ్గుతుందని.. కానీ మెట్రో ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి నాలుగేళ్ల సమయం పడుతుందని తెలిపారు. ఏహెచ్ 45 రోడ్డుపై ట్రాఫిక్ తగ్గించడానికి 15 అంతర్గత రోడ్లు ఏడాదిన్నరలోగా పూర్తయ్యేలా అధికారులను ఆదేశించానని అన్నారు. పాత హైవే ఏహెచ్ 47 నుంచి ఎన్ హెచ్ 16కు ఆరు రోడ్లు ప్రతిపాదన ఉందని గుర్తుచేశారు. విశాఖపట్నంలోని ఎమ్మెల్యేలు, అధికారులతో మీటింగ్ పెట్టాలని మంత్రిని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు కోరారు. వచ్చే వారమే మీటింగ్ పెడతానని మంత్రి నారాయణ సభలో చెప్పారు.



# అకీరానందన్ మొదటి సినిమాకు ఆ హీరోయిన్ అయితే బాగుంటుంది

## డిమాండ్ చేస్తున్న ఫ్యాన్స్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ రాజకీయాలలోకి వచ్చాక సినిమాలపై ఫోకస్ తక్కువగా పెడుతున్నాడు. దీంతో పవన్ తనయుడు అకీరాని హీరోగా చూడాలని అభిమానులు అనుకుంటున్నారు. అకీరా నందన్ తొలిసినిమా ఎప్పుడు ప్రారంభం అవుతుందని కొన్నాళ్లుగా జోరుగా డిస్కషన్ జరుగుతుంది. అయితే పవన్ తన వారసుడు అకీరా నందన్ ను అతి త్వరలో లాంచ్ చేసే పనిలో నిమగ్నమయ్యారని ఫిల్మ్ నగర్‌లో టాక్ వినిపిస్తోంది. అకీరా నందన్‌ను ప్రముఖ నిర్మాత అశ్వినీ దత్ లాంచ్ చేయనున్నట్టు సమాచారం. సూపర్ స్టార్ మహేశ్ బాబు, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తేజ్‌లను కూడా ఇండస్ట్రీకి పరిచయం చేసింది అశ్వినీ దత్ కాగా, ఇప్పుడు అకీరా నందన్ బాధ్యతలను కూడా ఆయనే తీసుకున్నారని తెలుస్తోంది. అయితే అకీరా నందన్ హీరో అయితే ఆయన సరసన నటించే కథానాయిక ఎవరు అయితే బాగుంటుందనే చర్చ కూడా మొదలైంది.. అఖీరానందన్ ఎప్పుడు ఇండస్ట్రీలోకి హీరోగా ఎంట్రీ ఇచ్చిన సరే హీరోయిన్ మాత్రం మహేష్ బాబు కూతురు సీతార అయి ఉండాలని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. ఇండస్ట్రీలో మొదటి నుంచి పవన్ కళ్యాణ్, మహేష్ బాబు మధ్య మంచి స్నేహ బంధం ఉంది. ఈ క్రమంలో అకీరా సరసన సితారని హీరోయిన్‌గా పరిచయం చేయడానికి మహేష్ ఎలాంటి అభ్యంతరం తెలపకపోవచ్చు. మరోవైపు సితార కూడా సినీ ఇండస్ట్రీలో తన సత్తా చూపించాలని ఎంతగానో అనుకుంటుంది. మరి అకీరా-సితార జంటగా ఎవరైన సినిమా తీస్తే మాత్రం అది బ్లాక్ బస్టర్ కావడం ఖాయం. ఇది జరుగుతుందా లేదా అనేది చూడాల్సి ఉంది. కాగా,అకీరా నందన్ మొదటి సినిమాకు తమిళ దర్శకుడు విష్ణువర్ధన్ దర్శకత్వం వహించనున్నాడని గత కొద్ది రోజులుగా సినీ వర్గాల్లో చర్చ నడుస్తుంది. పవన్ కళ్యాణ్‌తో 'పంజా' సినిమాను తెరకెక్కించిన విష్ణువర్ధన్, ఇప్పుడు అకీరా నందన్‌ను లాంచ్ చేయడంకి సంబంధించి కూడా పూర్తి క్లారిటీ రావలసి ఉంది.





# పార్లమెంట్‌కు రామ్‌చరణ్

## ఎందుకో తెలుసా..?

ఆర్‌ఆర్‌ఆర్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత 'గేమ్ ఛేంజర్' అంటూ వచ్చాడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్. శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్ అవుతుందనుకుంటే బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. దీంతో ఎలాగైన హిట్ కొట్టాలానే కసితో ప్రస్తుతం ఒక సినిమా చేస్తున్నాడు. ఆయన కథానాయకుడిగా రాబోతున్న తాజా ప్రాజెక్ట్ 16. పాన్‌ఇండియా చిత్రంగా రూపొందుతున్న ఈ సినిమాకి బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తుండగా.. ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు. ఉత్తరాంధ్రా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే ఈ సినిమా కోసం రామ్ చరణ్ పార్లమెంట్‌కి వెళ్లబోతున్నాడు. ఈ సినిమాలోని కథలో భాగంగా.. ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించనున్నారు మేకర్స్. ఇందులో భాగంగానే రామ్‌చరణ్ పార్లమెంట్‌లో జరిగే షూటింగ్‌లో పాల్గొననున్నాడు. ఈ షూటింగ్ కోసం చిత్రబృందం ఇప్పటికే అవసరమైన అనుమతుల కోసం దరఖాస్తు చేసుకొగా.. అధికారుల నుంచి అనుమతుల కోసం ఎదురుచూస్తుంది. ఇక అనుమతి వచ్చిన అనంతరం పార్లమెంట్‌లో షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం. అదే సమయంలో.. ఢిల్లీలోని జమా మసీద్ వద్ద కూడా కొన్ని సన్నివేశాలను చిత్రీకరించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు, కానీ రంజాన్ మాసం కారణంగా ఆ షెడ్యూల్ మార్చి చివరి వరకు వాయిదా పడే అవకాశం ఉంది. మరోవైపు ఈ విషయంపై ఉత్తరాంధ్ర ప్రాంతంలోని గ్రామీణ నేపథ్యంలో సాగే కథకి పార్లమెంట్‌కి లింక్ ఏంటి అని నెటిజన్లతో పాటు మెగా అభిమానులు సోషల్ మీడియా వేదికగా చర్చించుకుంటున్నారు. ఈ సినిమాలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, కన్నడ చక్రవర్తి శివరాజ్‌కుమార్, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# కమల్, అజిత్‌ను ఫాలో అవుతున్న నయన్

ఒకప్పుడు నటీనటులకు తమకు పెద్దవారు ఇచ్చే బిరుదులను ఆదరంగా స్వీకరించి, గొప్పగా చెప్పుకునే వారు. ఆ తర్వాత అభిమానులు ప్రేమతో ఇచ్చే బిరుదులనూ స్వీకరించడం మొదలు పెట్టారు. కొందరైతే దర్శక నిర్మాతలకు సూచన చేసి మరీ బిరుదులను పొందిన వారూ ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం సినిమా రంగంలో సేవ చేసిన వారికి గుర్తింపుగా పద్మశ్రీ పురస్కారాలను ప్రకటిస్తూ ఉంటుంది. అయితే అది బిరుదు కాదనే విషయాన్ని స్పష్టం చేస్తుంది. సినిమా టైటిల్స్ కార్డుల్లో పేరు ముందు పద్మశ్రీ అనే పదాన్ని బిరుదులా ఉపయోగించడం నిషిద్ధం. కావాలనుకుంటే సదరు వ్యక్తి 'పద్మశ్రీ పురస్కార గ్రహీత' అని పేరు ముందు వేసుకోవచ్చు. అయితే... ప్రభుత్వం ఇచ్చే పద్మ పురస్కారాల కంటే... స్టార్ హీరోలకు, హీరోయిన్లకు, దర్శకులకు అభిమానులు, సినిమా ఇండస్ట్రీ వాళ్ళు ఇచ్చే బిరుదులంటే భలే ఇష్టం. ఎలాంటి సంకోచం లేకుండా ఆ బిరుదులను సినిమా టైటిల్స్ కార్డుల్లోనూ, మీడియాకు ఇచ్చే ప్రెస్ నోట్స్ లోనూ వాడేసుకుంటారు. ఇటీవల ఇలాంటి బిరుదల పట్ల, అభిమానులు తమ పేర్ల ముందు చేర్చుతున్న విశేషణాల పట్ల కొందరు నటీనటులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. తమను పేరుతో సంభోదిస్తే చాలని, ప్రత్యేకమైన బిరుదలను పెట్టవద్దని బహిరంగంగా అభిమానులను వేడుకుంటున్నారు. ప్రముఖ నటుడు, దర్శక నిర్మాత కమల్ హాసన్‌ను కొంతకాలంగా ఉళగనాయకన్ అనే పేరుతో సంభోదిస్తున్నారు. అయితే... తనకు అలాంటి బిరుదులు తగిలించుకోవడం ఇష్టం లేదని కమల్ హాసన్ ఇటీవల స్పష్టం చేశారు. అలానే తమిళ స్టార్ హీరో అజిత్‌ను ఫ్యాన్స్ ప్రేమతో 'తల' అని పిలుస్తుంటారు. అజిత్ కూడా ఇటీవల అభిమానులకు ఓ ఓపెన్ లెటర్ రాసి... అతను అజిత్ అని పిలిస్తే చాలని అన్నారు. ఇప్పుడు అదే బాటలో లేడీ సూపర్ స్టార్ నయనతార కూడా నడుస్తోంది. గత కొంతకాలంగా సౌతిండియన్ సూపర్ స్టార్ అనే పేరును నయన్ కు విశేషణంగా తగిలించారు. ఆమె ఇటీవల ఉత్తరాదిలోకీ అడుగుపెట్టి, అక్కడా 'జవాన్' సినిమాతో తన సత్తాను చాటింది. దాంతో ఉత్తరాది వారు సైతం నయన్ ను 'లేడీ సూపర్ స్టార్' అనడం మొదలైంది. అయితే... తన పేరు ముందు ఇలాంటివేవీ ఇక మీద పెట్టవద్దని నయనతార ఓ బహిరంగ లేఖను విడుదల చేసింది. నయన్ అనే పేరే తన మనసుకు ఎంతో దగ్గరగా ఉంటుందని, అందువల్ల అదే పేరుతో తనను సంభోదించమని ఆమె కోరింది. 'రేపు ఎలా ఉంటుందో మనకు తెలియదు. కానీ అభిమానుల ప్రేమ నాకు ఎప్పుడూ ఉంటుందని భావిస్తున్నాను. వారికి వినోదం పంచడానికి నేను ఎల్లప్పుడూ కష్టపడుతూనే ఉంటాను. సినిమా అనేది మనందరినీ కలిపింది. దానిని అందరం కలిసి ఆస్వాదిద్దాం' అని నయన్ ఆ లేఖలో పేర్కొంది. ఇక సినిమాల విషయానికి వస్తే నయనతార 'ముక్కుత్తి అమ్మన్ -2, రక్కాయి, మన్నాంగట్టి సిన్స్ 1960, టెస్ట్' తదితర ప్రాజెక్ట్స్ తో బిజీగా ఉంది.



# నాగార్జున్‌తో ఊరమాస్ సాంగ్ చేసిన పూజా హెగ్డే

ఒకప్పుడు టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన పూజా హెగ్డే ఆ తర్వాత డల్ అయింది. వరుస పరాజయాలతో ఆమెకి అవకాశాలే కరువయ్యాయి. స్టార్ హీరోలతో కలిసి పని చేసిన పూజా హెగ్డే ఇప్పుడు చిన్న హీరోలతో కూడా పని చేసేందుకు సిద్ధమైనట్టు తెలుస్తుంది. అయితే పూజా హెగ్డేకి ఇప్పుడు తెలుగులో పెద్దగా అవకాశాలు లేవు. తమిళంలో మాత్రం రెండు సినిమాలు చేస్తుంది. అవి రెండూ భారీ మూవీస్ కావడం విశేషం. సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా రూపొందుతున్న కూలీలో స్పెషల్ సాంగ్ కూడా చేయబోతున్నట్టు టాక్ వినిపిస్తుంది. ఈ సినిమాలు పూజా హెగ్డేకి ఎంత వరకు ప్లస్ అవుతాయా అని అభిమానులు చర్చించుకుంటున్నారు. పూజా హెగ్డే తెలుగులో ప్రభాస్, ఎన్టీఆర్, మహేష్ బాబు, అల్లు అర్జున్, రామ్ చరణ్, నాగచైతన్య, అఖిల్, వరుణ్ తేజ్ వంటి హీరోలతో నటించింది. క్రేజ్ ఉన్న సమయంలో రెచ్చిపోయింది. రెమ్యునరేషన్ కూడా భారీగానే పెంచేసింది. వచ్చిన అవకాశాలని దేనిని వదులుకోలేదు. అయితే ఇందులో కొన్ని దెబ్బ కొట్టడంతో పూజా ఇప్పుడు రూట్ మార్చింది. కంటెంట్ ఉన్న సినిమాలు, బలమైన పాత్రలే చేయాలని అనుకుంటుందట. ఇప్పుడు కోలీవుడ్‌లో పూజా నటిస్తున్న విజయ్..జన నాయగన్, సూర్య..రెట్రో.. చిత్రాలు కూడా అలాంటివే అని తెలుస్తుంది. అయితే క్రేజ్ ఉన్న సమయంలోనే పూజా హెగ్డే రంగస్థలంలో జిగేల్ రాణి అనే స్పెషల్ సాంగ్‌కి చిందులేసింది. ఆ పాట థియేటర్లని ఊపేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు దాన్ని మించి..కూలీలో ఐటెమ్ సాంగ్ ఉంటుందట. అందులో కింగ్ నాగార్జునతో ఈ అమ్మడు ఆడిపాడనుందని అంటున్నారు. ఊరమాస్‌గా ఈ పాట ఉండనున్నట్టు తెలుస్తుండగా, ఇందులో నాగ్‌తో కలిసి పార్టీలో తెగ రచ్చ చేయనుందట. ఇందులో పూజా లుక్ కూడా అదిరిపోయేలా ఉంటుందని అంటున్నారు. కాగా, రజనీకాంత్ కూలీలో నాగార్జున కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. నెగటివ్ షేడ్ ఉన్న రోల్ అని సమాచారం. ఇదిలా ఉంటే ఇప్పటికే నాగ్ తనయులు నాగచైతన్యతో ఒక లైలా కోసం, అఖిల్‌తో మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ చిత్రాల్లో నటించిన పూజా హెగ్డే ఇప్పుడు నాగార్జునతో చిందులేయడం హాట్ టాపిక్‌గా మారింది.

# అందంతో కట్టిపడేస్తున్న రెబామోనికా

రెబా మోనికా జాన్ ఒక భారతీయ నటి, మోడల్, ఆమె తమిళ, మలయాళ చిత్రాలలో ప్రముఖంగా పని చేస్తుంది మరియు కొన్ని తెలుగు మరియు కన్నడ చిత్రాలలో పని చేసింది. తాజా సోషల్ మీడియా ఈ కోమలి షేర్ చేసిన తెగ వైరల్ అవుతున్నాయి. మీరు కూడా వీటిపై ఓ లుక్ వెయ్యండి. 4 ఫిబ్రవరి 1994న కర్ణాటక రాజధాని బెంగుళూరులో ఓ మలయాళీ కుటుంబంలో జన్మించింది వయ్యారి భామ రెబ మోనికా జాన్. ఈ ముద్దుగుమ్మ తండ్రి పేరు జాన్, ఈమె తల్లి పేరు మినీ జాన్. ఈ బ్యూటీ కుటుంబం క్రైస్తవ మతానికి చెందినవారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో సేక్రేడ్ హార్ట్ గర్ల్స్ హై స్కూల్ లో పాఠశాల విద్యను పూర్తి చేసింది ఈ భామ. బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీ నుంచి కెమిస్ట్రీలో మాస్టర్స్ డిగ్రీ పట్టా పొందింది ఈ అందాల తార రెబ. 2022లో క్రైస్తవ సంప్రదాయంలో కుటుంబీకులు, బంధుమిత్రుల మధ్య జోమోన్ జోసెఫ్ అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. ఈ వయ్యారి సినిమాలకు ముందు కొన్ని ప్రకటనలలో కనిపించింది. అందులో ధాత్రి హెయిర్ ఆయిల్ ప్రకటన చాల ప్రముఖమైనది. 2016లో జాకోబింటే స్వర్గరాజ్యం అనే మలయాళీ ఫ్యామిలీ డ్రామాతో సినీరంగ ప్రవేశం చేసింది. తర్వాత మలయాళీ, తమిళ చిత్రాల్లో కనిపించింది. ఈ నెల 29న విడుదల కానున్న తెలుగు కామెడీ ఎంటర్టైనర్ మ్యాడ్ స్క్వేర్ సినెమా ఓ స్పెషల్ సాంగ్ లో కనిపించనున్న ఈ ముద్దుగుమ్మ. ఇప్పటికి విడుదలైన ఈ పాట లిరికల్ వీడియోకి ప్రేక్షకుల్లో మంచి రెస్పాన్స్ వచ్చింది.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com